శనివారం
2•2•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 218
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





నేటి నుంచి గేట్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఎన్ఐటీలు సహా వివిధ జాతీయ విద్యాసంస్థల్లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 2, 3, 9, 10 తేదీల్లో గ్రాడ్యుయేట్ యాప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఎడ్యుకేషన్ (గేట్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వర కు పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 24 సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు తెలంగాణ నుంచి దాదాపు 80 వేలకుపైగా విద్యార్థులు హాజరవుతారు. రాష్ట్రంలో కరీంనగర్, కోదాడ, కొత్తగూడెం, వరంగల్‌లో పరీక్షకేంద్రాలను ఏ ర్పాటుచేశారు. గేట్ నిర్వహణ బాధ్యతలను ఐఐటీ మద్రాసుకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది.

కమర్షియల్ కోర్టుల్లో ఈ-ఫైలింగ్

- ఈవోడీబీలో భాగంగా కేంద్రం నిధులు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కమర్షియల్ కోర్టుల చట్టం- 2015 ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటుచేసిన వాణిజ్య కోర్టుల్లో కార్యకలాపాలను మరింత సులభతరం చేయడానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ) కింద రూ.24.10 లక్షలను కేంద్రం మంజూరుచేసింది. రాష్ట్రంలో ఈవోడీబీ నోడల్ సంస్థ గా ఉన్న పరిశ్రమలు, వాణిజ్యశాఖ కమర్షియల్ కోర్టుల్లో ఈ- ఫైలింగ్‌తోపాటు కేస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఐఎస్) అమలు బాధ్యతను చేపట్టింది. వాణిజ్యశాఖ ఖర్చుచేసిన నిధులను చెల్లిస్తూ న్యాయ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

జేఈఈ మెయిన్ పేపర్-2 పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా గతనెల 8 నుంచి 12 వరకు నిర్వహించిన జేఈఈ మెయిన్ రాత పరీక్షలకు సంబంధించిన పేపర్-2 పరీక్ష (బీఆర్క్/బీప్లానింగ్) ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా 1,80,052 మంది నమోదు చేసుకోగా, 1,45,386 మంది హాజరయ్యారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఏప్రిల్ 6 నుంచి 20 వరకు జేఈఈ మెయిన్-2 పరీక్షల నిర్వహణ తర్వాత జేఈఈ మెయిన్ విద్యార్థుల ర్యాంకులను విడుదలచేస్తారు. ఏప్రిల్‌లో నిర్వహించే జేఈఈ మెయిన్ -2 పరీక్షలకు ఫిబ్రవరి 8 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభిస్తారు. దరఖాస్తుల స్వీకరణకు మార్చి 7 వరకు గడువు విధించారు.

సాగునీటి పారుదలశాఖలో.. భూసేకరణ అధికారిగా రాములు నాయక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగునీటి పారుదలశాఖలో జనగామ జిల్లాలో భూసేకరణ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ రాములునాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇటీవలే ఈ పోస్టుకు నియమితులైన కే గంగాధర్‌ను తిరిగి పురపాలకశాఖకు డిప్యూటేషన్‌పై పంపింది.

ముహూర్తం


సూర్యోదయం: 6.52 గంటలకు


సూర్యాస్తమయం: 6.08 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, త్రయోదశి రాత్రి 9.21 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పూర్వాషాఢ రాత్రి 11.55 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: సాయంత్రం 6.34 నుంచి రాత్రి 8.10 వరకు, రాహుకాలం ఉదయం 9.41 నుంచి 11.05 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.52 నుంచి 8.22 వరకు, వర్జ్యం: ఉదయం 6.04 నుంచి 7.40 వరకు.



శుక్రవారం ఉదయం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సమీపంలో కమ్ముకున్న పొగమంచు

తగ్గుతున్న చలి తీవ్రత

- రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. నేటినుంచి పొడి వాతావరణం
- 3నుంచి 4 డిగ్రీలు పెరిగిన రాత్రి ఉష్ణోగ్రత

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో చలి తీవ్రత తగ్గుముఖం పడుతున్నదని, పొడి వాతావరణం నెలకొంటున్నదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు రెండ్రోజులుగా 3 నుంచి 4 డిగ్రీల మేరకు పెరిగాయి. రాగల ఐదు రోజులవరకు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి నాగరత్న తెలిపారు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగి చలి తగ్గుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ గాలిలో తేమశాతం పెరుగడంతో చలి ప్రభావం కొనసాగుతున్నది. రాజధానిలో తేమ 87శాతం నమోదయిందని, దీంతో చలి తీవ్రత ఉన్నదని వాతావరణకేంద్రం అధికారులు వెల్లడించారు. కనిష్ఠ ఉష్ణోగ్రత 17.7డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 27.8డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సూర్యాపేట జిల్లాలో అతి తక్కువగా 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది.

ఐదుగురు వృద్ధులు మృతి

రాష్ట్రంలో చలి తీవ్రతతో ఐదుగురు మృతిచెందారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం నాగుర్లపల్లికి చెందిన పెరుమాండ్ల నర్సయ్య (74), గురువారం అర్ధరాత్రి, కమ్మపల్లి గ్రామానికి చెందిన మిట్టగడపల సామేల్ (80) శుక్రవారం ఉదయం మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా గూడూరులోని చంద్రుగూడెంలో గడ్డ మల్లయ్య(70) చలి గాలులకు తట్టుకోలేక అస్వస్థతకు గురై శుక్రవారం మరణించాడు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గోపరపల్లికి చెందిన బోయిని ఈరమ్మ (71), శానగొండ గ్రామానికి చెందిన జోంగోని శంకరయ్య (68) చలి తీవ్రత తట్టుకోలేక మృతిచెందారు.

'భరోసా'కు జాతీయ గుర్తింపు

- దేశవ్యాప్తంగా ఏర్పాటుచేయడంపై పరిశీలనకు బృందాన్ని పంపిన సుప్రీంకోర్టు
- హైదరాబాద్ భరోసా సెంటర్‌ను పరిశీలించి వెళ్లిన నిపుణుల బృందం



హైదరాబాద్‌లోని భరోసా కేంద్రంలో ఏఎస్‌జీ పింకీ ఆనంద్‌కు వివరాలు తెలియజేస్తున్న సీపీ అంజనీకుమార్ అడిషనల్ సీపీ శిఖాగోయల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం దేశవ్యాప్తంగా ఏర్పాటుచేయనున్న వన్‌స్టాప్ క్రైసెస్ కేంద్రాల కోసం భరోసా సెంటర్లను మోడల్‌గా తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ఓ ఉన్నత స్థాయి కమిటీకి సుప్రీంకోర్టు సూచించింది. దీంతో మన భరోసా కేంద్రాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించినట్లయిందని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జి, ఐజీ స్వాతిలక్రా 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. నిర్భయ ఘటన తర్వాత మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఏయే చర్యలు తీసుకుంటున్నారని సుప్రీంకోర్టులో న్యాయవాది నిపుణ్ సక్సేన రిట్‌పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ దీపక్‌గుప్తాతో కూడిన ధర్మాసనం ఇటీవలే తీర్పునిచ్చింది. తెలంగాణలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, సదుపాయాలపై ఆరాతీయాలని అడిషనల్ సోలిసిటర్ జనరల్ పింకిఆనంద్‌తోపాటు కేంద్రహోంశాఖ అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అడిషనల్ సోలిసిటర్ జనరల్ పింకి ఆనంద్ నేతృత్వంలోని నిపుణుల బృందం గురువారం హైదరాబాద్‌లోని భరోసా కేంద్రాన్ని, చైల్డ్‌ఫ్రెండ్లీ కోర్టులను పరిశీలించి.. న్యాయసహాయం, వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నట్టు స్వాతిలక్రా తెలిపారు. భరోసా కేంద్రానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, అడిషనల్ సీపీ క్రైమ్స్ శిఖాగోయల్‌తో కలిసి నిపుణుల బృందానికి వివరించారు.

క్యాథరిన్ హడ్డాతో కేటీఆర్ భేటీ

- అమెరికాలో తెలుగు విద్యార్థుల సమస్యపై చర్చ
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి కేటీఆర్ అర్హుడు
- ట్వీట్ చేసిన యూఎస్ కాన్సులేట్ జనరల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డాతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు శుక్రవారం సమావేశమయ్యారు. అమెరికాలో తెలుగు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యతోపాటు, పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. అమెరికాతో భారత్ సంబంధాలు, ప్రధానంగా తెలంగాణలో పెట్టుబడులు చర్చకు వచ్చాయి. 'కేటీఆర్ వంటి మంచి మిత్రుడితో సమావేశం కావడం ఎల్లప్పుడూ విశేషంగా భావిస్తుంటా. అమెరికా-తెలంగాణ కలిసి పనిచేసే అనేక అంశాలపై మేం చర్చించాం. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి ఆయన పూర్తిగా అర్హుడు' అంటూ సమావేశం అనంతరం క్యాథరిన్ ట్వీట్ చేశారు. దీనికి స్పందిస్తూ 'క్యాథరిన్ హడ్డా.. మిమ్మల్ని కలవడం సంతోషకరం. అమెరికా-భారత్‌ల మధ్య బంధం బలోపేతానికి సంబంధించి పలు అంశాలు చర్చించడం సంతోషకరం. సమావేశంలో మనం చర్చించినట్టే అమెరికాలో తెలుగు విద్యార్థుల సమస్య పరిష్కారం అంశాన్ని సంబంధిత అధికారులకు చేరవేస్తారని భావిస్తున్నాం' అంటూ కేటీఆర్ రీట్వీట్ చేశారు.



శుక్రవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, జోగినిపల్లి సంతోష్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీపాటిల్, బడుగుల లింగయ్యయాదవ్

బైసన్‌పోలో స్థలాన్ని కేటాయించండి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన టీఆర్ఎస్ ఎంపీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర కొత్త సచివాలయం నిర్మాణానికి బైసన్‌పోలో గ్రౌండ్‌ను కేటాయించాలని టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. పార్లమెంట్‌లో శుక్రవారం ఆమెను కలిసి మరోసారి వినతిపత్రం సమర్పించారు. నూతన సచివాలయం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేసుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసిందని ఆమెకు ఎంపీలు తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తామని ఎంపీలతో కేంద్ర మంత్రి అన్నారు. మంత్రిని కలిసిన వారిలో లోక్‌సభ టీఆర్ఎస్ పక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, జోగినిపల్లి సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, లింగయ్యయాదవ్ తదితరులున్నారు.

కంటివెలుగు@1.42కోట్లు

8675 గ్రామాలు, 800 మున్సిపల్ వార్డుల్లో శిబిరాలు.. 21,63,391 మందికి కండ్లద్దాల పంపిణీ

కంటి వెలుగు 104 వ రోజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో 1,42,63,963 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి పౌరుడు కంటి చూపు కోల్పోవద్దన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ అధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి శుక్రవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 8,675 గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని 800 వార్డుల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో1,42,63,963 మందికి కంటి పరీక్షలు చేయగా.. 21,63,391 మందికి రీడింగ్ అద్దాలను అందజేశారు. కాగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 78,176 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో పురుషులు 36,453, మహిళలు 41,708 మంది, ట్రాన్స్‌జెండర్స్ 15మంది ఉన్నారు. శుక్రవారం మెదక్ జిల్లాలో 2,164 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1491 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు.



భువనగిరిలోని హుస్నాబాద్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంటి వైద్యశిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	శుక్రవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	78,176	1,42,63,963
కండ్లద్దాలు పొందినవారు	5,363	21,63,391
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	5,582	16,88,727
కంటి సమస్యలపై రెఫరల్	3,862	8,79,446



ప్రభుత్వం పేదలకు ఎంతో మేలు చేస్తున్నది

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కంటి వెలుగుతో పేదలకు ఎంతో మేలు జరుగుతున్నది. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కంటి అద్దాలను, అవసరం ఉన్న వారికి ఆపరేషను చేయడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నది. కంటి పరీక్షలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది.

- పెరుమాండ్ల నరేశ్, అడ్లూర్, కామారెడ్డి జిల్లా

ఈ నెలలో ఆర్థిక సంఘం పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదిహేనవ ఆర్థిక సంఘం బృందం ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడ్రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనుంది. 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లోని జూబ్లీహాల్‌లో సీఎం కేసీఆర్, అధికారులతో ఈ బృందం సమావేశం కానుంది. అనంతరం 20వ తేదీన క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనుంది. ఇందులో భాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథ పనులను ఆర్థిక సంఘం బృందం పరిశీలించనుంది.

అంగన్‌వాడీలకు 'రేషన్' బియ్యం

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పంపిణీ ప్రక్రియ
- కండ్లకోయలో నాణ్యతను పరిశీలించిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ ప్రకియ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. మేడ్చల్ జిల్లా కండ్లకోయిలో మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం జగదీశ్వర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా డైరెక్టర్ విజయేందిర బోయి, పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్, మేడ్చల్ ఎమ్మెల్యే సీ మల్లారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని 35700 అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్‌షాపుల్లోని ఈ పాస్ యంత్రాల ద్వారా బియ్యాన్ని అందిస్తున్నారు. ఇందు కోసం 72 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేలిముద్రలను ఈ-పాస్ యంత్రాలతో అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం జగదీశ్వర్, డైరెక్టర్ విజయేందిరబోయి, పౌరసరఫరాల కమిషనర్ అకున్‌సబర్వాల్ మాట్లాడుతూ బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్‌షాపుల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ రోనాల్డ్ రాస్, జగిత్యాల జిల్లాలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కామారెడ్డిలో కలెక్టర్ సత్యనారాయణ, నల్లగొండలో కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, జేసీ నారాయణరెడ్డి, నిజామాబాద్‌లో జేసీ రవీందర్‌రెడ్డి, మంచిర్యాలలో జేసీ సురేందర్‌రావు, నిర్మల్‌లో కలెక్టర్ ప్రశాంతి, జేసీ భాస్కర్‌రావు, పెద్దపల్లిలో జేసీ వనజాదేవి, సిద్దిపేట జిల్లా దుద్దెడలో జేసీ పద్మాకర్ ప్రారంభించారు. ఈ కొత్త విధానం ద్వారా అంగన్‌వాడీ నిర్వాహకులు ఏ రోజు, ఎంత మంది, ఎన్ని క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్లారు? ఇంకా ఎంత తీసుకెళ్లాల్సి ఉంది? ఓపెనింగ్, క్లోజింగ్ బ్యాలెన్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలుంటుంది. మొత్తం సరఫరా ప్రక్రియను పర్యవేక్షించడానికి కూడా సులువుగా ఉంటుంది. రేషన్ షాపుల్లోని బయోమెట్రిక్ ద్వారా బియ్యం సరఫరా కానుండటంతో అక్రమాలకు అడ్డుకట్టపడనుంది.




ఈ పాస్‌లో వేలిముద్రను తీసుకుంటున్న రేషన్ డీలర్

గంటలో వెయ్యి మందికి బీపీ పరీక్షలు

- గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న గాంధీ దవాఖాన

గాంధీ దవాఖాన : అత్యుత్తమ వైద్యసేవలతో మన్ననలు పొందుతున్న గాంధీ దవాఖాన గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నది. గంట వ్యవధిలో వెయ్యి మందికి బీపీ పరీక్షలు నిర్వహించి రికార్డును దక్కించుకున్నదని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం మీడియాకు తెలిపారు. దేశంలోని 37కేంద్రాల్లో 11,416 మందికి బీపీ చెక్ చేయగా.. 2018 సెప్టెంబర్ 24న గాంధీ దవాఖాన మెడిసిన్ విభాగం వార్డులో గంట వ్యవధిలోనే వెయ్యి మంది రోగులకు బీపీ పరీక్షలు నిర్వహించారని చెప్పారు.



గాంధీ దవాఖాన గిన్నిస్ రికార్డు పత్రాన్ని చూపిస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్, ప్రొఫెసర్ వినయ్‌శేఖర్

లోకం పోకడ



కొన్నిసార్లు ట్రైలర్ బాగున్నా, సిన్మా అస్సలు బాగుండదట.. ఇదీ అంతేనా అనడుగుతున్నాడు సార్!

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రికార్డు స్థాయిలో మిర్చిపంట సాగైంది. పంట దిగుబడి బాగా రావటంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. పంట చేతికి రావటంతో గణపూర్ (ఎం) - పెద్దాపురం గ్రామాల మధ్య రోడ్డుపై మిర్చి పంటను ఆరబోశారు ఇలా..



నకిలీ ఓటర్ల నమోదులో ఏఈఆర్వో సస్పెన్షన్

మెహిదీపట్నం/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఓటర్ల జాబితా తయారీ, ఓటరు గుర్తింపుకార్డుల జారీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాంపల్లి నియోజకవర్గ ఏఈఆర్వోగా వ్యవహరిస్తున్న మెహిదీపట్నం సర్కిల్ సహాయ టౌన్‌ప్లానర్ మహ్మద్ ఖలీలుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఓటరు రిజిస్ట్రేషన్ అధికారిగా ఉన్న డిప్యూటీ కమిషనర్ ఎంకేఐ అలీ, సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించిన షేక్ హుస్సేన్‌లకు చార్జిమెమోలు జారీచేశారు.

నేటి నుంచి తిరిగి నుమాయిష్

- నాలుగు రోజులు పొడిగించే అవకాశం

అబిడ్స్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అగ్ని ప్రమాదం నేపథ్యంలో రెండు రోజులపాటు నిలిపివేసిన నుమాయిష్ ఎగ్జిబిషన్‌ను తిరిగి శనివారం నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి జీవీ రంగారెడ్డి తెలిపారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే వాళ్లు ఎలాంటి భయానికి లోనుకాకూడదని, భద్రతా పరంగా అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. స్టాల్ హోల్డర్‌లు ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా కూడా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నుమాయిష్‌ను మరో నాలుగు రోజుల పాటు పొడిగించే అవకాశాలు ఉన్నాయి.

శనివారం
2•2•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE





బడ్జెట్ పత్రాల సూట్‌కేసుతో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్



ఓటు బడ్జెట్!

కర్షకులు, కార్మికులు, మధ్యతరగతికి మోదీ గాలం

మధ్యంతరం అంటూనే పూర్తిస్థాయి ప్రతిపాదనలు

- రైతుబంధు తరహాలో కిసాన్ సమ్మాన్ నిధి
- ఐదెకరాల్లోపు రైతులకు ఏడాదికి ఆరువేలు
- అసంఘటిత కార్మికులకు నెలకు రూ.3 వేల పింఛను
- పశుపోషణ, మత్స్య పరిశ్రమ రైతులకు వడ్డీ రాయితీ
- ఇండ్ల కొనుగోలుదారులకు పన్నురాయితీ
- బ్యాంకు డిపాజిట్ల వడ్డీపై టీడీఎస్ మినహాయింపు పెంపు

లోక్‌సభ ఎన్నికల వేళ మోదీ సర్కారు ఓటర్ల ముంగిట మోకరిల్లింది. మళ్లీ అధికారం కోసం అర్రులు చాస్తున్న ఎన్డీయే ప్రభుత్వం.. సంప్రదాయానికి భిన్నంగా మధ్యంతరం అంటూనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రైతులు, వేతనజీవులు, కార్మికులపై కుప్పలుతెప్పలుగా వరాల వర్షం కురిపించింది. రెండునెలల్లో పదవీకాలం ముగిసే సర్కారు.. ఏడాదికాలానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడమే కాకుండా వచ్చే పన్నెండేండ్లకు పది అంశాలతో విజన్-2030 ప్రకటించడం విశేషం.

- 35 కోట్ల మందికి తాయిలాలు
- రూ.97 లక్షల కోట్లతో పీయూష్ గోయల్ బడ్జెట్
- మొదటి నాలుగు నెలలకు రూ.34.17 లక్షల కోట్లు వ్యయ ప్రతిపాదనలు
- ద్రవ్యలోటు లక్ష్యం 3.4%
- రూ. 2.97 లక్షల కోట్లకు పెరిగిన సబ్సిడీ బిల్లు
- పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.90 వేల కోట్లు

భారీ కేటాయింపుల్లో కొన్ని (రూ.కోట్లలో)

రక్షణ రంగం	3,05,296
సబ్సిడీలు	2,96,684
పెన్షన్లు	1,75,300
వ్యవసాయం	1,49,981
గ్రామీణాభివృద్ధి	1,38,962
విద్య	93,848
హోంశాఖ	1,03,927
రవాణా	1,56,187

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:

గత ఐదేండ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతి పెద్ద ప్రజాకర్షక బడ్జెట్ ఇదే. వ్యవసాయరంగానికి తెలంగాణ రైతుబంధు తరహా పథకాన్ని ప్రకటించడంతోపాటు, మధ్యతరగతి వేతనజీవులకు రూ.5 లక్షల వరకు పన్ను రిబేటు, అసంఘటిత కార్మికులకు నెలకు రూ.3వేల పింఛను, చిన్నవ్యాపారులకు జీఎస్టీ ఊరట, ఇండ్ల కొనుగోలుదారులకు పన్ను రాయితీ.. ఇలా ప్రజాకర్షక పథకాలను వరుసబెట్టి ప్రతిపాదించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ 2019-20 బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. పూర్తి ఏడాదికి రూ.97,43,039.70 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదించారు. ఇందులో మొదటి నాలుగు నెలలకు రూ.34.17 లక్షల కోట్ల వ్యయానికి పార్లమెంట్ ఆమోదాన్ని కోరారు.

ఓటర్ల ప్రసన్నతే లక్ష్యం!

దేశవ్యాప్తంగా దాదాపు 35 కోట్ల మంది ఓటర్లను నేరుగా ప్రభావితం చేసేలా పీయూష్‌గోయల్ బడ్జెటరీ ప్రతిపాదనలున్నాయి. ముఖ్యంగా రైతులు, మధ్యతరగతి ప్రజలను లక్ష్యం చేసుకొని బడ్జెట్ ప్రసంగం కొనసాగింది. వ్యవసాయరంగంలో ఐదెకరాల లోపు పొలం ఉన్న దాదాపు 12 కోట్లమంది రైతులకు ఏడాదికి ఆరువేల రూపాయలను మూడు విడుతల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని ప్రకటించడమే కాకుండా ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. ఇందుకోసం రూ.75 వేల కోట్లను కూడా కేటాయించారు. పది కోట్ల మందికి పైగా అసంఘటిత కార్మికులకు నెలకు రూ.3వేల పింఛను పథకాన్ని ప్రవేశపెట్టారు. మూడు కోట్ల మంది వేతన జీవులు, పెన్షనర్లు,

మిగతా 11వ పేజీలో



ఐటీ మినహాయింపులో

తిరకాసు

రూ. 5 లక్షల వరకు రిబేటు
మారని శ్లాబులు
ఆదా చేసుకున్నవారికే ప్రయోజనం
అధికాదాయ వర్గాలకు దక్కని ఊరట

కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్ను రాయితీల్లో తిరకాసుంది. శ్లాబులు, పన్ను రేట్లు మార్చకుండానే చేసిన ఈ ప్రతిపాదనలు ప్రజలను గందరగోళంలో పడేశాయి. రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటే పన్ను చెల్లించాల్సిన అవసరం లేదన్న మాటలో మతలబు ఉంది. ఆదాయం పన్నులోని వివిధ సెక్షన్ల కింద పన్ను ఆదా చేసే సాధనాల్లో మదుపు చేసిన తర్వాత నికర ఆదాయం రూ. 5 లక్షలు లేదా అంతకన్నా తక్కువగా ఉంటే, మొదటి శ్లాబు రూ. 2.5 నుంచి రూ. 5 లక్షల లోపు ఆదాయంపై చెల్లించాల్సిన రూ.12,500 పన్నుకు సెక్షన్ 87ఏ కింద రిబేటు ఇచ్చారు. రూ. 5లక్షలకు ఒక్క రూపాయి అధికంగా ఉన్నా ఆ శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాల్సిందే. మరో మాటలో చెప్పాలంటే 5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి ప్రయోజనం కనిపిస్తున్నా అంతకుమించిన ఆదాయం ఉన్నవారికి అంతగా ప్రయోజనం లేనట్టే.

9

కేసీఆర్ బాటలో..

- రైతుబంధు తరహాలో కొత్త పథకం తెచ్చిన మోదీ ప్రభుత్వం
- అనుసరణే కానీ.. అంతంతమాత్రం సాయం
- ఐదెకరాల్లోపువారికి ఆరువేలకే పరిమితం
- ఆపైబడి సాగురైతులకు శూన్యహస్తం
- రాష్ట్రంలో ఎకరానికి పదివేల చొప్పున ఎంతైనా
- ఆదర్శంగా నిలిచిన రాష్ట్రం.. అంతటా ఆసక్తే
- ఇప్పటికే ఒడిశా, బెంగాల్ ప్రభుత్వాల అమలు
- ఏపీలో గెలిస్తే అమలుచేస్తామంటున్న జగన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతుబంధు.. రాష్ట్రంలో రైతులకు కొండంత అండగా నిలిచి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన వినూత్న పథకం. అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడకుండా నిలువరించిన పథకం. నిజంగా ఇది అవస్థలపాలవుతున్న అన్నదాతల పట్ల ఆపద్బంధు అయింది. రైతన్నల బతుకుతీరునే మార్చింది. అందుకే ఈ పెట్టుబడి సాయం పథకం అంతటా ఆసక్తిని రేపింది. వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అనేక రాష్ట్రాల ప్రతినిధులు తెలంగాణలో పర్యటించి అమలుతీరును తెలుసుకున్నారు. ఇప్పటికే ఒడిశా, బెంగాల్ ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల్లో ఈ తరహా పథకాలను ప్రవేశపెట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వస్తే తామూ అమలుచేస్తామని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

మిగతా 4వ పేజీలో



దేశానికే మార్గదర్శకంగా
రైతుబంధు

- దేశ దశ, దిశను మార్చే శక్తి సీఎం కేసీఆర్‌కే ఉన్నది
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

4

రైతుబంధు స్ఫూర్తిగా
కిసాన్ సమ్మాన్ నిధి

- మూడేండ్ల క్రితం ప్రకటించి ఉంటే రైతులకు ఇప్పటికే ఫలాలు దక్కేవి
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మనకు అరకొరే!

నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్ ▪ గిరిజన వర్సిటీకి రూ.4కోట్లు ▪ 'మిషన్'పథకాలకు నిధుల్లేవ్
నెరవేరని విభజన హామీలు ▪ గ్రాంట్ ఇన్ ఎయిడ్ లెక్కలువేస్తున్న ఆర్థిక శాఖ

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ :

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో తెలంగాణకు నిరాశే ఎదురైంది. రాష్ట్రానికి అరకొర నిధులను కేటాయించింది. సింగరేణికి పెట్టుబడి కింద రూ. 1,850కోట్లు కేటాయించింది. గిరిజన వర్సిటీకి రూ.4కోట్లు, ఐఐటీ హైదరాబాద్‌కు రూ.80కోట్లు కేటాయించింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు కేంద్ర నిధులు ఇస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఆశించింది. నీతి ఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం బడ్జెట్‌లో ఈ రెండు పథకాలకు మొండి చేయి చూపింది. విభజన హామీల్లో భాగంగా ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారం, భూపాలపల్లి జిల్లా ములుగులో గిరిజన వర్సిటీ, ఉద్యాన వర్సిటీని కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ఇందులో కేవలం గిరిజన వర్సిటీకి రూ.నాలుగు కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నది. రైల్వేపరంగానూ కొత్త ప్రాజెక్టులేమీ మంజూరు కాలేదు. భద్రాచలం-సత్తుపల్లి కొత్త రైల్వే మార్గానికి రూ.405 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి లైన్‌కు రూ. 200కోట్లు

మిగతా 11వ పేజీలో

18 నుంచి
ఆర్థిక సంఘం పర్యటన

రాష్ట్రంలో మూడురోజులపాటు..
18, 19న సీఎం కేసీఆర్, అధికారులతో సమావేశం
20న క్షేత్రస్థాయి పర్యటన

2

200 మంది విద్యార్థుల అరెస్ట్



క్యాథరిన్ హడ్డాతో కేటీఆర్ భేటీ

2

- అమెరికాలో తెలుగు విద్యార్థుల సమస్యపై చర్చ
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి కేటీఆర్ అర్హుడు
- ట్వీట్ చేసిన యూఎస్ కాన్సులేట్ జనరల్

అమెరికాలో 'పే టు స్టే' స్కాం

- వివిధ డిటెన్షన్ సెంటర్లకు తరలింపు.. వీరిలో పలువురు తెలుగువారు
- కొందరికి షరతులతో కూడిన బెయిల్
- 60 మైళ్లు దాటిపోకుండా జీపీఎస్ ట్యాగ్
- అరెస్ట్ కానివారు ఫిబ్రవరి 5 లోగా దేశం వదిలి వెళ్లిపోవాలని హెచ్చరిక
- సిబ్బంది వేధింపులు తాళలేక డిటెన్షన్ సెంటర్లలో భారతీయుల నిరాహార దీక్ష
- బలవంతంగా ముక్కు గొట్టాల ద్వారా ఆహారం



వాషింగ్టన్, ఫిబ్రవరి 1:

అమెరికాలో సంచలనం సృష్టించిన 'పే టు స్టే' కుంభకోణంలో సుమారు 200 మంది విదేశీ విద్యార్థుల్ని అరెస్టు చేసినట్లు అక్కడి యంత్రాంగం ప్రకటించింది. న్యూజెర్సీ, అట్లాంటా, హ్యూస్టన్, మిషిగాన్, కాలిఫోర్నియా, లూసియానా, నార్త్ కరోలినా, మిస్సోరి రాష్ట్రాల్లో ప్రత్యేక దాడులు నిర్వహించి వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. వీరిని వివిధ డిటెన్షన్ సెంటర్లకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. అరెస్టయిన విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా పెద్దసంఖ్యలో ఉన్నారు. వీరందరిపై 'పౌర వలస నిబంధనల' చట్టం ప్రకారం అభియోగాలు నమోదు చేయనున్నట్లు ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికార ప్రతినిధి కరిస్సా కట్రెల్ చెప్పారు. కొద్దిరోజుల్లో మరికొంతమంది విద్యార్థులను అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. 'వీసా నిబంధనలు ఉల్లంఘించి అమెరికాలోనే ఉండేందుకు ఈ విద్యార్థులంతా డెట్రాయిట్‌లోని ఫార్మింగ్టన్ యూనివర్సిటీలో

మిగతా 12వ పేజీలో

కార్మికులు 3,000 పింఛన్

అసంఘటిత రంగంలోని కార్మికులకు ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్‌ధన్ పథకం కింద నెలవారీ పెన్షన్. నెలకు రూ.100 చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60 ఏండ్లు దాటిన తర్వాత రూ.3 వేల పింఛన్.

పేదలు-వెనుకబడిన తరగతులు

- దేశంలోని అన్నిరకాల వనరులపై పేదలకే మొదటి హక్కు. పేదలకు 10% రిజర్వేషన్‌ను కల్పించేందుకు విద్యా సంస్థల్లో 25% అదనపు సీట్లు.
- పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాల తొలగింపునకు కృషి.
- కోరుకున్న ప్రతి ఒక్కరికి ఈ ఏడాది మార్చి నాటికి విద్యుత్ కనెక్షన్లు.

ఎంఎస్‌ఎంఈ వ్యాపారులు

- జీఎస్టీలో నమోదైన చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానులకు కోటి రూపాయల వరకు రుణాలపై రెండు శాతం వడ్డీ రాయితీ.
- ప్రభుత్వరంగ పరిశ్రమల నుంచి 25 శాతం ఔట్ సోర్సింగ్‌లో కనీసం 3 శాతం మహిళలు యజమానులుగా ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేటాయింపు.
- డీఐపీపీ పేరును డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్‌గా మార్పు

58,166 కోట్లు ఈశాన్యం

ఈశాన్య రాష్ర్టాల అభివృద్ధికి 21 శాతం కేటాయింపులు (రూ.58,166 కోట్లు) పెంపు. అరుణాచల్ ప్రదేశ్‌కు విమాన సదుపాయం, మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ర్టాలకు రైలుమార్గం. బ్రహ్మపుత్ర నది గుండా సరుకు రవాణాకు చర్యలు.

అణగారిన వర్గాలు

నోటిఫై కాని సంచార, ఉపసంచార జాతులను గుర్తించేందుకు నీతి ఆయోగ్‌లో ఓ కొత్త కమిటీ ఏర్పాటు. వారికోసం సామాజికన్యాయం, సాధికార మంత్రిత్వశాఖ పరిధిలో కొత్త అభివృద్ధి బోర్డు ఏర్పాటు.

రైతుకు పెట్టుబడిసాయం

- ఐదెకరాలలోపు రైతులకు ఏడాదికి రూ.6 వేలు
- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధితో 12కోట్ల మందికి లబ్ధి
- వ్యవసాయానికి లక్షన్నర కోట్లు..గోకుల్ మిషన్‌కు 750 కోట్లు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అసంతృప్తితో ఉన్న రైతులను ఎన్నికల వేళ బుజ్జగించడానికి మోదీ ప్రభుత్వం పెట్టుబడిసాయాన్ని ప్రకటించింది. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఏడాదికి ఆరువేల రూపాయల నగదును నేరుగా వారి ఖాతాల్లో వేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ శుక్రవారం తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ పథకం ద్వారా దాదాపు పన్నెండు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. దీనివల్ల ఖజానాపై రూ.75 వేల కోట్ల భారం పడనున్నది. ఈ పథకానికి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) అని పేరు పెట్టారు. రూ.6 వేలను మూడు విడుతలుగా రైతులకు చెల్లిస్తారు. ఈ ఏడాది నుంచే పథకాన్ని అమలుచేయనున్నారు. డిసెంబర్ 2018 నుంచి మార్చి 2019 వరకు తొలివిడుతగా పరిగణిస్తారు. ఈ మేరకు మార్చిలోపు రూ.2 వేలను రైతుల ఖాతాల్లో జమచేస్తారు. ఇందుకోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20వేల కోట్లను కేటాయించి అంచనాలను సవరించారు. అయితే ఈ పథకం విధివిధానాలను మాత్రం ప్రకటించలేదు. పీఎంకిసాన్ పథకంతోపాటు వ్యవసాయరంగానికి సంబంధించి అనేక రాయితీలను మంత్రి ప్రతిపాదించారు. 2019-20 సంవత్సరానికి రూ.1,49,981కోట్ల కేటాయింపులు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయానికి రూ.86,602 కోట్లుకేటాయించగా.. ఈసారి రూ. 63, 379 కోట్లు ఎక్కువ. ఎరువులపై ఇచ్చే సబ్సిడీ మొత్తాన్ని మాత్రం తగ్గించారు. రూ. 74,986 కోట్లను రూ.70,075 కోట్లకు పరిమితంచేశారు. వడ్డీ వ్యాపారుల కబంధహస్తాల నుంచి రైతులను కాపాడటంకోసమే ఈ పథకమని పీయూష్‌గోయల్ వివరించారు.

మత్స్యపరిశ్రమ రైతులకు వడ్డీ రాయితీ

వ్యవసాయ అనుబంధరంగాలైన పశుపోషణ, మత్స్యపరిశ్రమ రైతులకూ ఆర్థికమంత్రి ఊరట కల్పించారు. వీరికి గత బడ్జెట్ నుంచి కిసాన్ క్రెడిట్‌కార్డులు అందించారు. ఈకార్డుల ద్వారా రుణాలు పొందిన రైతులకు రెండు శాతం వడ్డీరాయితీని ప్రకటించారు. అంతేకాకుండా, రైతులు తాము తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లిస్తే అదనంగా మరో మూడు శాతం వడ్డీ రాయితీని ప్రకటించారు. ప్రకృతి విపత్తుల కారణంగా ఎన్డీఆర్‌ఎఫ్ సహాయ కార్యక్రమాలు నిర్వహించిన ప్రాంతాల్లోని రైతులకు పంటరుణాలపై 2 శాతం వడ్డీ రాయితీతోపాటు మూడుశాతం సకాలంలో రుణాల చెల్లింపు ఇన్సెంటివ్‌ను కూడా ఇస్తారు. రుణాల రీ షెడ్యూలింగ్ మొత్తం కాలానికి ఈ రాయితీ వర్తిస్తుంది.

రుణ పరిమితి యథాతథం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయరుణాల పరిమితిని యథాతథంగా ఉంచారు. 2018-19లో వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.11 లక్షల కోట్లు కాగా.. రూ.11.68 లక్షల కోట్లకు చేరుకొందని, ఈ ఏడాది కూడా అదే లక్ష్యం కొనసాగుతుందన్నారు.

గోకుల్ మిషన్‌కు 750 కోట్లు

గోసంరక్షణ కోసం ఏర్పాటుచేసిన రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలోనే కేటాయింపులను రూ. 750 కోట్లకు పెంచినట్లు గోయల్ తెలిపారు. దీంతోపాటు గోవుల ఉత్పత్తి, సుస్థిర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చట్టాల అమలు పర్యవేక్షణకు 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్' వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు. మత్స్యశాఖకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు పీయూష్‌గోయల్ తెలిపారు.

కనీస మద్దతు ధర 50 శాతం పెంపు

రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేసేందుకు 22 రకాల పంటలపై కనీస మద్దతుధరను ఉత్పత్తి వ్యయం కంటే 50శాతం పెంచామని మంత్రి పేర్కొన్నారు. పంటల ధరలు పడిపోవడం వల్ల రైతులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని.. ఈ పరిస్థితి నుంచి రైతులను బయటపడేసేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటుందని గోయల్ తెలిపారు.

కిసాన్ సమ్మాన్ నిధి పరిమితమైనది

తెలంగాణ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని కేంద్రం స్ఫూర్తిగా తీసుకోవడం రాష్ర్టానికి గర్వకారణం. కానీ రైతుబంధు పథకంతో పోల్చితే కిసాన్ సమ్మాన్ నిధి పరిమితమైనది. ఎకరాలవారీగా కాకుండా ఐదు ఎకరాలలోపు ఎంత ఉన్నా ఏడాదికి రూ.6 వేలు ఇవ్వడంవల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు.

- విజయకుమారి, వ్యవసాయ ఆర్థికశాస్త్రవేత్త, తెలంగాణ వ్యవసాయ వర్సిటీ

కేంద్రం సాయం మొత్తాన్ని పెంచాలి

రైతుబంధుతో పోలిస్తే కిసాన్ సమ్మాన్ నిధి చాలా చిన్నది. రూ.6 వేల సాయాన్ని రైతులందరికీ వర్తింపచేసి ఉంటే బాగుండేది. ఐదెకరాలలోపు ఉన్నవారికే పథకాన్ని వర్తింపచేస్తున్నారు కాబట్టి సాయం మొత్తాన్ని పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా సాయం మొత్తంపై పరిమితి విధిస్తే బాగుంటుంది.

- ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, వ్యవసాయ ఆర్థికశాస్త్రవేత్త, తెలంగాణ వ్యవసాయ వర్సిటీ


కేసీఆర్ బాటలో..

మూడోపేజీ తరువాయి...

ప్రకటించారు. మరిన్ని రాష్ర్టాలు ఇదే బాటన నడువాలనుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ తరహాలో కొత్త పథకాన్ని ప్రకటించింది. శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం- కిసాన్)' ప్రకారం.. రెండు హెక్టార్ల వరకు సాగుభూమి ఉన్న రైతులకు మూడు విడతల్లో రూ.2000 చొప్పున ఏడాదికి రూ.6000 అందజేస్తారు. ఈ రకంగా రైతులను ఆదుకునే అంశంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శిగా నిలిచింది. తెలంగాణలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం నుంచి స్ఫూర్తిపొందిన జాబితాలో ఏకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా చేరినట్లయింది. రాష్ట్ర పథకంతో పోలిస్తే కేంద్ర పథకం రైతులకు తక్కువగా సాయపడేదే. తెలంగాణలో ఎన్ని ఎకరాలున్న రైతులకైనా ఈ పథకం వర్తిస్తుండగా, కేంద్రం మాత్రం రెండు హెక్టార్లు.. అంటే ఐదెకరాలలోపువారికే సాయమందిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటివరకు రెండు విడుతల్లో ఎకరానికి రూ.నాలుగువేల చొప్పున రూ.ఎనిమిదివేలు అందించారు. ఇకముందు ఐదువేల చొప్పున ఏడాదికి మొత్తంగా ఎకరానికి రూ.పదివేలు అందజేస్తారు. కేంద్ర పథకంలో ఐదెకరాల వరకున్న రైతులకు ఏకమొత్తంగా ఆరువేలు మాత్రమే లభిస్తాయి. ఆపైబడి సాగురైతులకు ఏమాత్రం సాయం అందదు.

రైతుబంధునే కొంతమార్చి..

రాష్ట్ర పథకాన్ని ఆదర్శంగా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ స్థాయిలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించలేక.. ఏదోస్థాయిలో సాయపడే ప్రయత్నం మాత్రం చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులను దుస్థితి నుంచి గట్టెక్కించాలని, రైతే రాజు కావాలని ఆలోచించిన ముఖ్యమంత్రి అందుకోసం పెట్టుబడి సాయాన్ని అందించాలని సంకల్పించారు. వ్యవసాయం చేసుకునేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుక్కునేందుకు, కూలీలకు చెల్లించేందుకు వీలుగా రైతుబంధు పథకాన్ని రూపొందించి అమలుచేస్తున్నారు. తెలంగాణలో రైతుల ఆదరాభిమానాలు అందుకున్న రైతుబంధులాంటి పథకాన్నే లోక్‌సభ ఎన్నికలకు ముందు బడ్జెట్‌లో ప్రకటించాలని భావించిన నరేంద్రమోదీ ప్రభుత్వం.. ఈ పథకాన్ని కొన్ని మార్పుచేర్పులతో దేశవ్యాప్తంగా అమలుకు ప్రకటించింది. వాస్తవాలను పరిశీలిస్తే.. తెలంగాణ రైతులకు సీఎం కేసీఆర్ అందిస్తున్న రైతుబంధు పథకం కింద అందుతున్న మొత్తం రైతులను ఆదుకునేలా ఉండగా తాజాగా కేంద్రం ప్రకటించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం మాత్రం రైతులకు కంటి తుడుపు చర్యగానే చెప్పవచ్చు. తెలంగాణ రైతుబంధుతో పోల్చితే కేంద్రం ఇచ్చేది తక్కువైనా కనీసం ఇప్పటికైనా రైతులకు సాంత్వన కలుగడం ప్రారంభమవుతుందని, దీనిని స్వాగతించాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాంటివాళ్లు వ్యాఖ్యానించడం గమనార్హం.



తెలంగాణ రైతుబంధు

- రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నా రైతుబంధు పథకం వర్తిస్తుంది.
- ఎకరానికి రూ.నాలుగువేల చొప్పున రెండు సార్లు అందిస్తారు.
- వానకాలం, యాసంగి పంటలకు రెండు విడుతలుగా మొత్తం రూ.ఎనిమిది వేలు లభిస్తాయి.
- ఈ వర్షాకాలం నుంచి ఈ మొత్తాన్ని విడతకు రూ.5 వేలుగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. అంటే ఎకరానికి రైతుబంధు కింద అందే సాయం మొత్తం రూ.10 వేలు.
- రాష్ట్రంలో ఇప్పటికే 58 లక్షల మంది రైతులకు ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి

- రెండు హెక్టార్లు.. అంటే 5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుంది.
- ఎన్ని ఎకరాల భూమి (5 ఎకరాల వరకు) ఉన్నా రూ. ఆరువేలు మాత్రమే వస్తాయి.
- మొత్తం మూడు విడతలుగా.. రూ. రెండు వేల చొప్పున అందిస్తారు.
- సంవత్సరంలో మొత్తం రూ.ఆరువేలు లభిస్తాయి.
- దేశవ్యాప్తంగా సుమారు 12 కోట్ల మంది రైతులు ఈ పథకానికి అర్హులవుతారని గుర్తించారు.

రాష్ర్టాలను ఆకట్టుకున్న పథకం

కేసీఆర్ ఈ పథకం ప్రారంభించిన తరువాత.. దేశవ్యాప్తంగా అనేక రాష్ర్టాలు స్పందించాయి. వివిధ రాష్ర్టాల అధికారులు, ప్రజాప్రతినిధులు తెలంగాణకు వచ్చి అమలుతీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ప్రపంచంలోనే మొట్టమొదటగా.. రైతులకు నేరుగా నగదును అందించేలా కేసీఆర్ రూపొందించిన రైతుబంధు పథకానికి అంతటా ప్రశంసలు లభించాయి. ఈ పథకం నుంచి స్ఫూర్తి పొంది తొలుత అమలుచేసింది ఒడిశా. తెలంగాణకు వచ్చిన ఒడిశా అధికారులు క్షేత్రస్థాయిలో రైతుబంధు పథకాన్ని పరిశీలించి.. ప్రశంసించారు. వెంటనే ఒడిశాలోనూ 'కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కం ఆగ్మెంటేషన్ (కాలియా)' అనే పథకాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. చిన్న, సన్నకారు రైతులకు ఐదు సీజన్లకోసం రూ.25వేల మొత్తాన్ని ఒకేసారి నగదు బదిలీగా ప్రకటించింది. బెంగాల్ అధికారులు కూడా రైతుబంధు నుంచి స్ఫూర్తిపొంది ఆ రాష్ట్రంలో ఈ తరహా పథకాన్ని ప్రారంభించారు. ఇక పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ తాము గెలిస్తే రైతుబంధు పథకాన్ని అమలు చేస్తామని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ర్టాల్లో రైతుబంధుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర, కేంద్ర పథకాల వల్ల రైతులకు లభించే సాయం

భూమి ఎకరాల్లో	తెలంగాణ రైతుబంధు	ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి
1	రూ.10 వేలు	రూ. 6 వేలు
2	రూ.20 వేలు	రూ. 6 వేలు
3	రూ.30 వేలు	రూ. 6 వేలు
4	రూ.40 వేలు	రూ. 6 వేలు
5	రూ.50 వేలు	రూ. 6 వేలు


- ఎకరాలు పెరిగినకొద్దీ తెలంగాణలో రైతులకు లభించే పెట్టుబడిసాయం పెరుగుతుంది. కానీ కేంద్ర పథకం ద్వారా ఐదెకరాలపైబడి సాగుభూమి ఉన్నవారికి ఎలాంటి సాయం లభించదు.

అన్నివర్గాలకు సాధికారత: మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ లోక్‌సభ ఎన్నికల అనంతరం దేశ శ్రేయస్సు ఎలా ఉండబోతున్నదో తెలిపే ఒక 'ట్రైలర్' మాత్రమేనని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇది అన్నివర్గాలకు లబ్ధి చేకూరుస్తుందని చెప్పారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రతిపాదనల అనంతరం మోదీ ప్రకటన విడుదల చేస్తూ, ఈ బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను సాధికారులను చేస్తుందని తెలిపారు. బడ్జెట్‌లో ప్రభుత్వం చేసిన పలు ప్రకటనలు, పథకాలను ప్రస్తావించారు. ఈ బడ్జెట్‌తో 12కోట్ల మంది రైతులు, మూడుకోట్ల మధ్యతరగతి కుటుంబాలు, 30-40 కోట్ల మంది అసంఘటిత కార్మికులు లబ్ధి పొందుతారని తెలిపారు. పేదరికం రికార్డు స్థాయిలో తగ్గుతున్నదని పేర్కొన్నారు. నవ భారత నిర్మాణం అనే లక్ష్య సాధనలో 130 కోట్ల మంది దేశ పౌరులు చేస్తున్న ప్రయత్నాలకు ఈ బడ్జెట్ ఊతమివ్వగలదని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు అనేకుల జీవితాలను స్పృశించాయని, ఆ విషయం బడ్జెట్ ప్రతిపాదనల్లో ప్రతిబింబించిందని తెలిపారు. రైతుల సంక్షేమం నుంచి మధ్య తరగతి వర్గాల వరకు, ఆదాయం పన్ను మినహాయింపు నుంచి మౌలిక సదుపాయాల వరకు, ఉత్పత్తి రంగం నుంచి చిన్న, మధ్య శ్రేణి పరిశ్రమల వరకు, గృహ నిర్మాణం నుంచి ఆరోగ్యరంగం వరకు, వేగవంతమైన అభివృద్ధి నుంచి నవభారతం వరకు అన్ని అంశాలు బడ్జెట్ ప్రతిపాదనల్లో చోటుచేసుకున్నాయని ప్రధాని చెప్పారు.

ఎవరేమన్నారంటే



సామాన్యులతో ప్రధాని సాన్నిహిత్యానికి నిదర్శనం

'సామాన్యులతో ప్రధాని మోదీకున్న సన్నిహిత సంబంధాలకు నిదర్శనం ఈ బడ్జెట్. దిగువ మధ్యతరగతి నుంచి వచ్చి అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నందునే మోదీ ఇటువంటి బడ్జెట్‌కు రూపకల్పన చేయగలిగారు.

- జితేంద్రసింగ్, పీఎంఓ శాఖ మంత్రి

అన్నివర్గాలకు లబ్ధి



ఈ బడ్జెట్‌తో అన్నివర్గాల ప్రజలు లబ్ధిపొందుతారు. ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగాల సృష్టికి దోహదం చేస్తుం ది. ఆదాయం పన్ను పరిమితిని పెంచడం చారిత్రాత్మక నిర్ణయం. ఈ చర్య మధ్యతరగతి వర్గం దేశాభివృద్ధిలో పాల్గొనడానికి తోడ్పడుతుంది.

-అమిత్‌షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు



మధ్యతరగతి కొనుగోలు శక్తిని పెంచే బడ్జెట్

మధ్యంతర బడ్జెట్.. విధాన నిర్ణయాల్లో దేశానికి మార్గదర్శనం చేసింది. ఇది దూరదృష్టి కలిగిన, అభివృద్ధికి బాటలువేసే బడ్జెట్. ఆదాయం పన్ను పరిమితిని రూ.ఐదులక్షలకు పెంచడం మధ్యతరగతికి లబ్ధిచేకూరుస్తుంది.

- న్యూయార్క్ నుంచి కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ

చారిత్రాత్మక బడ్జెట్



దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న మా ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది. ఇది చారిత్రాత్మక బడ్జెట్. నమ్మకం, ఆత్మవిశ్వాసం, అభి వృద్ధి, సుసంపన్నమైన న్యూ ఇండియా ను సృష్టించడానికిచేసే ప్రయత్నాలను ఈ బడ్జెట్ వేగవంతం చేస్తుంది.

- రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంశాఖ మంత్రి

ఇది ట్రయిలర్ మాత్రమే



ఈ బడ్జెట్ కేవలం ట్రయిలర్ మాత్రమే. మరిన్ని మంచి పథకాలు రాబోతున్నాయి. ప్రధాని మోదీ, ప్రభుత్వం దేశ ప్రజల ముందు తమ విజన్‌ను ప్రవేశపెట్టారు. ఈ మధ్యంతర బడ్జెట్ నమ్మశక్యమైనది. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చే చేస్తుంది.

- ముక్తార్ అబ్బాస్ నక్వీ, కేంద్రమంత్రి

ఇది రెండో సర్జికల్ స్ట్రయిక్



ఇది బడ్జెట్ కాదు సర్జికల్ స్ట్రయిక్. విదేశీ శత్రువులను కట్టడిచేసేందుకు బుల్లెట్లతో మొదటి సర్జికల్ స్ట్రయిక్‌చేశాం. ఇప్పుడు రెండో సర్జికల్ స్ట్రయిక్‌లో బ్యాలెట్లతో మా ప్రత్యర్థులను చిత్తుచేస్తాం. రాబోయే ఎన్నికల్లో మోదీ నేతృత్వంలో ఎన్డీయే నాలుగొందల స్థానాలు గెలుస్తుంది.

- కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్

ప్రతిపక్షాలు స్వాగతించాలి



ఈ బడ్జెట్‌ను ప్రతిపక్షాలు స్వాగతించాలి. ఈ బడ్జెట్ ప్రతిపక్షాలపై సర్జికల్ స్ట్రయిల్‌లాంటిది. బడ్జెట్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నందున ప్రతిపక్షం కూడా సంతోషించాలి.

- కేంద్రమంత్రి ఆర్కే సింగ్

'కిసాన్'కు రైతుబంధు స్ఫూర్తి

- మూడేండ్ల కింద ప్రకటించి ఉంటే రైతులకు ఇప్పటికే ఫలాలు దక్కేవి
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ మానస పుత్రిక అయిన రైతుబంధు పథకాన్ని పేరుమార్చి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని టీఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. రైతుబంధు పథకాన్నే కేంద్రప్రభుత్వం అనుకరించిందన్నారు. కేంద్రబడ్జెట్‌పై శుక్రవారం ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. రైతుబంధు పథకం ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని, దీనిని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ప్రవేశపెడుతున్న ఈ పథకంతో దేశంలోని రైతులందరూ లబ్ధి పొందబోతుండటం సంతోషంగా ఉన్నదని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం కేవలం పథకం పేరును మాత్రమే మార్చిందని, కానీ దాని స్ఫూర్తి మాత్రం అదే అన్నారు. జై కిసాన్ అంటూ ఎమోజీ ట్వీట్ చేశారు. కేసీఆర్ పథకం స్ఫూర్తితో కొద్దిగా మార్పులు చేసి దేశంలోని 12 కోట్ల మంది రైతులకు అమలు చేయాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, పథకం అమలులో షరతులు కూడా విధించారన్నారు. కేంద్రం ప్రకటించిన పథకాన్ని స్వాగతిస్తున్నామని, విజయవంతంగా అమలు చేయాలని ఆకాంక్షించారు. ఇదే పథకాన్ని రెండు మూడేండ్ల కిందట ప్రకటించి ఉంటే రైతులకు ఇప్పటికే ఫలాలు దక్కేవని చెప్పారు.

దేశానికే మార్గదర్శకంగా రైతుబంధు

- సీఎం కేసీఆర్‌కే దేశ దశ, దిశను మార్చే శక్తి
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్



ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు దేశానికే మార్గదర్శిగా నిలిచిందని, ఈ పథకాన్ని కేంద్రం కూడా కాపీకొట్టడం సీఎం కేసీఆర్ రాజకీయ పరిణతికి, దూరదృష్టికి ప్రత్యక్ష నిదర్శనమని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై శుక్రవారం ఆయన ట్విటర్‌లో స్పందించారు. సీఎం కేసీఆర్ ఆలోచనలు, పథకాలు దేశానికే మార్గదర్శిగా నిలిచాయనడానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ దర్పణంగా చెప్పవచ్చన్నారు. బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రవేశపెట్టడం వెనుక ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అభిప్రాయపడ్డారు. దేశానికి దిశానిర్దేశం చేసే శక్తి, యుక్తి కేసీఆర్‌కే ఉందన్నది బడ్జెట్ ద్వారా స్పష్టమవుతున్నదన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపు, వ్యవసాయరంగంపై ఆయనకున్న అపారపరిజ్ఞానం రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చి పెడుతున్నదని చెప్పారు.

ఆరువేలు కంటితుడుపే!

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రైతుసంఘాల అసంతృప్తి
- రాష్ట్రంలో ఐదెఎకరాలలోపు ఉన్న రైతులు 47.08 లక్షలు
- రూ.6,000 చొప్పున ఏడాదికి వచ్చేది రూ.2,824.59 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధిపై రైతు సంఘాల నాయకులు, విశ్లేషకులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికలవేళ ఓట్ల కోసం కంటితుడుపుగా ప్రవేశపెట్టిన పథకమని పేర్కొంటున్నారు. తెలంగాణలో ఐదెకరాలలోపు సాగుభూమి ఉన్న రైతులు 47.08 లక్షలమంది ఉన్నారు. ఒక దఫాకు రూ.941.53 కోట్లు చొప్పున ఏడాదిలో మొత్తం రూ.2,824.59 కోట్లు వీరికి అందుతాయి. ఒకవైపు ఇబ్బడిముబ్బడిగా సాగుఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఐదెకరాల్లోపు రైతులకు రూ.ఆరువేలు ఇవ్వడం పెద్దగా ఉపకరించేదికాదని రైతుసంఘాల నాయకులు చెప్తున్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకంతో రాష్ట్రంలోని 47.08 లక్షల మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతుబంధుతోపాటు అదనంగా రూ.ఆరువేలు అందనున్నాయి. కేంద్రం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. ప్రాథమికంగా అయితే, ఈ రెండు పథకాలు రైతులకు వర్తిస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాష్ట్రప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన, కొత్త పాస్‌పుస్తకాల జారీ, వ్యవసాయ విస్తరణ అధికారులతో సర్వే చేయించి బ్యాంకుఖాతాలు, ఆధార్ నంబర్లు, మొబైల్ నంబర్లు సేకరించిన విషయం తెలిసిందే. ఈ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వంతో షేర్‌చేసుకుంటే సరిపోతుంది. దీంతో మన రైతుల ఖాతాల్లోకి సొమ్ము వచ్చిపడుతుంది. అయితే మరో రెండు, మూడు రాష్ర్టాల్లో తప్పితే ఇంకా ఏ రాష్ట్రంలోనూ రైతుల వివరాలు, బ్యాంకుఖాతాల నంబర్ల సమాచారం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో 2018 డిసెంబర్ నుంచి వర్తింపజేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. ఫిబ్రవరి, మార్చి ఈ రెండునెలల్లో ఎలా అమలుచేస్తుందో అనే అనుమానాన్ని రైతుసంఘాలు వ్యక్తంచేస్తున్నాయి.

రాష్ట్రంలో ఐదెకరాల్లోపు రైతులు, వారికి అందే మొత్తం..

సాగుభూమి విస్తీర్ణం	రైతుల సంఖ్య (లక్షల్లో)	రూ.2,000 చొప్పున (కోట్లలో)	మూడు విడుతల్లో రూ.6,000 (కోట్లలో)
1 ఎకరంలోపు	14.86	రూ.297.16	రూ.891.49
1 నుంచి 2 ఎకరాలు	13.37	రూ. 267.47	రూ.802.40
2 నుంచి 3 ఎకరాలు	8.96	రూ.179.23	రూ.537.69
3 నుంచి 4 ఎకరాలు	5.75	రూ.115.02	రూ.345.06
4 నుంచి 5 ఎకరాలు	4.13	రూ. 82.65	రూ.247.94
మొత్తం	47.08	రూ.941.53	రూ.2,824.59

'కిసాన్ నిధి' కిసాన్‌కు చేరేనా?

'కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాలకు నిధులు జమ చేయడం అంత సలువుగా జరిగే పని కాదని నిపుణులు అంటున్నారు. తెలంగాణలో రైతుబంధు పథకం ప్రారంభించినప్పుడు రైతుల బ్యాంకు ఖాతాలలోనే పంట పెట్టుబడి డబ్బులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే బ్యాంకులు పాత అప్పుల కింద పెట్టుబడి డబ్బును జమచేసుకునే ప్రమాదం ఉందని గుర్తించి, పే ఆర్డర్ చెక్కులు ఇచ్చింది. పేదరైతులు అనేకమందికి బ్యాంకు ఖాతాలు కూడా ఉండవు కాబట్టి.. నేరుగా పేఆర్డర్ చెక్కులు ఇవ్వడమే మేలన్న అభిప్రాయం వ్యక్తమయింది. తెలంగాణ రైతుబంధును స్ఫూర్తిగా తీసుకొని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రభుత్వాలు కూడా రైతుబంధు స్కీమ్‌ను తీసుకువచ్చాయి. ఈ విధంగా పలురాష్ర్టాలు అమలుచేస్తున్న రైతు బంధును కేంద్ర ప్రభుత్వం కూడా తీసుకురావటంపై హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ, నేరుగా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు వేయటం వల్ల ఆ డబ్బులు రైతులకు ఏమేరకు చేరుతాయన్న సందేహాలు ఉన్నాయి. నిజానికి వ్యవసాయరంగం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు కీలక పాత్ర పోషిస్తాయి. భూమిని సాగుచేసే రైతుల వివరాలన్నీ రాష్ట్ర ప్రభుత్వాల వద్దనే ఉంటాయి. దీంతో 'కిసాన్ సమ్మాన్‌నిధి' విషయంలో రాష్ర్టాలను సంప్రదించి ఉండాల్సిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రైతుల కోసం

- కోటిన్నరమంది మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు.
- పశు పోషణపై ఆధారపడినవారికి రుణాలపై రెండు శాతం రాయితీ. సకాలంలో రుణం చెల్లించేవారికి అదనంగా 3 శాతం రాయితీ.
- విపత్తుల సమయంలో రెండు శాతం వడ్డీ రాయితీని రీషెడ్యూల్‌మెంట్ కాలం మొత్తానికి వర్తింపు.

6,000

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 12 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ.6000 నిర్దిష్ట ఆదాయం. రెండు హెక్టార్ల లోపు(ఐదెకరాలు) వ్యవసాయ భూమి ఉన్న రైతులు ఇందుకు అర్హులు.
మూడు వాయిదాలలో చెల్లింపు. 2018, డిసెంబర్ 1 నుంచి అమలు. ఈ పథకం కోసం 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.75వేల కోట్ల కేటాయింపు, 2018-19 రూ.20వేల కోట్లు కేటాయింపు.

750 కోట్లు

రాష్ట్రీయ గోకుల్ మిషన్ వ్యయం రూ.750 కోట్లకు పెంపు. గోవుల సంరక్షణకు, వాటి ఉత్పాదన పెంచడానికి రాష్ట్రీయ కామధేను ఆయోగ్ ఏర్పాటు

పర్యావరణానికి

3,111 కోట్లు

- పులుల సంరక్షణకు రూ.350 కోట్లు, ఏనుగుల ప్రాజెక్టుకు రూ.30 కోట్లు
- కాలుష్యం తగ్గింపు చర్యలకు 50 శాతం నిధుల కోత

ఈశాన్యానికి భరోసా

- గత కేటాయింపుల కన్నా ఈ సారి 21శాతం అధికంగా రూ.58,166 కోట్లు నిధుల కేటాయింపు.
- నార్త్‌ఈస్టర్న్ కౌన్సిల్ చేపడుతున్న వివిధ పథకాలకు రూ.580 కోట్లు
- ఈశాన్య రాష్ట్రాలు, సిక్కిం రాష్ట్రానికి సెంట్రల్ పూల్ ఆఫ్ రిసోర్సెస్ కింద రూ.931 కోట్లు
- ఇతర రాయితీ కింద చెల్లింపులకు రూ.974 కోట్లు.

అసంఘటిత కార్మికులకు మూడువేల పింఛన్

- రూ.15 వేల లోపు ఆదాయం ఉన్న కార్మికులకు వర్తింపు
- నెలకు రూ.100 చెల్లింపుతో వర్తింపు
- పది కోట్ల మందికి లబ్ధి చేకూర్చనున్న పథకం
- ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు

న్యూఢిల్లీ: అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సరికొత్త పథకాన్ని ప్రకటించింది. 'ప్రధానమంత్రి శ్రమ్‌యోగి మాంధన్ (పీఎం ఎస్‌వైఎం) పేరుతో ప్రారంభమయ్యే ఈ పథకంలో నెలకు రూ.15 వేల లోపు ఆదాయమున్న కార్మికులు ప్రతినెలా రూ.100 చెల్లిస్తే అరవై ఏండ్లు వచ్చినప్పటి నుంచి వారికి నెలకు రూ.3 వేల పింఛన్‌ను కేంద్రం చెల్లిస్తుంది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా పది కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభించనున్నది. 'స్థూల జాతీయోత్పత్తిలో సగం ఆదాయం అసంఘటిత రంగంలో ఉన్న 42 కోట్ల కార్మికుల చెమట బిందువుల నుంచే వస్తుంది. వృద్ధాప్యంలో వారికి సామాజిక భద్రతను కల్పించడం ప్రభుత్వ బాధ్యత' అని గోయల్ అన్నారు. ఈ పథకం విధివిధానాలను కూడా గోయల్ ప్రకటించారు. 29 ఏండ్ల వయసులో ఉన్నవారు ఈ స్కీంలో చేరితే అరవై ఏండ్లు వచ్చేంతవరకు ప్రతినెలా వంద రూపాయలు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో కార్మికుడు చెల్లించే మొత్తం రూ.37,200. 18 వ ఏట చేరాలనుకొనేవారు 55 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. అంటే ఒక్కొక్కరూ అరవై ఏండ్లు వచ్చేనాటికి రూ.27,720 చెల్లిస్తారన్నమాట. కార్మికులు చెల్లించిన మొత్తానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం వారి పింఛన్ ఖాతాకు జమచేస్తుంది. ఈ ప్రధానమంత్రి శ్రమ్‌యోగి మాంధన్ పథకానికి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్లు కేటాయించింది. అవసరమైతే అదనపు నిధులను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు గోయల్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల కార్మికుల కనీస ఆదాయం గత ఐదేండ్లలో 42 శాతం పెరిగిందని చెప్పారు.


నమో..నమో!

రూ. 20 లక్షలకు గ్రాట్యుటీ పెంపు

ఐదేండ్ల సర్వీసు ఉన్న ఉద్యోగులకు పన్నులేని గ్రాట్యుటీ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. ఈ పెంపుదల 2018 మార్చి నుంచి వర్తిస్తుంది. ఉద్యోగులకు వర్తింపజేస్తున్న కొత్త పెన్షన్ స్కీంలో ప్రభుత్వ వాటాను నాలుగుశాతం పెంచారు. ప్రభుత్వ వాటా ఇకపై 14 శాతం కానున్నది. బోనస్ పొందేందుకు వేతన అర్హతను రూ.10 వేల నుంచి రూ.21 వేలకు పెంచి బోనస్ పరిమితిని నెలకు రూ.3,500 నుంచి రూ. 7 వేలకు పెంచింది. ఈఎస్ఐ అర్హత పరిమితిని రూ.21 వేలకు పెంచి కనీస పింఛన్‌ను వెయ్యి రూపాయలుగా నిర్ణయించింది. విధుల్లో కార్మికుడు మరణిస్తే ఈపీఎఫ్‌వో ద్వారా చెల్లించే మొత్తాన్ని రూ.6 లక్షలకు పెంచారు. అంగన్‌వాడీ, ఆశాయోజన కార్యకర్తల గౌరవభృతిని 50శాతం పెంచారు. ఉద్యోగాల కల్పన గురించి మాట్లాడుతూ.. వృద్ధిరేటు పెరుగుదల, ఆర్థిక వ్యవస్థలో సుస్థిరత కారణంగా దేశంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఈపీఎఫ్‌వోలో సభ్యత్వం రెండుకోట్లకు పైగా పెరుగడమే ఇందుకు తార్కాణమని గోయల్ వెల్లడించారు.

- గ్రాట్యుటీ రూ.20 లక్షలకు పెంపు
- ఎన్పీఎస్‌లో ప్రభుత్వ వాటా 4% పెంపు
- బోనస్ రూ. 7 వేలకు పెంపు
- ఈఎస్ఐ అర్హత రూ.21 వేలు
- ఈపీఎఫ్‌వో ప్రమాద పరిహారం రూ. 6 లక్షలకు పెంపు
- అంగన్‌వాడీ, ఆశాయోజన కార్యకర్తల గౌరవ వేతనం 50 శాతం పెంపు

ఎయిర్ ఇండియాకు రూ.3,900 కోట్ల బకాయిల సర్దుబాటు

న్యూఢిల్లీ: బడ్జెట్ ప్రతిపాదనల మేరకు ఎయిర్ ఇండియాకు కేంద్ర ప్రభుత్వం రూ.3,900 కోట్ల రుణ బకాయిలను స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)కు బదిలీ చేయనుంది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన జాతీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఆర్థిక పరిపుష్టికి ఏర్పాటు చేసినదే ది ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్ స్పెషల్ పర్పస్ వెహికల్. 2019-20 కాలానికి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం రూ.1,300 కోట్లు ఎస్పీవీకి కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అదనంగా రూ.2,600 కోట్లను ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో అందించనుంది. మొత్తంగా రూ.3,900 కోట్లను ఎస్పీవీకి కేటాయించింది. ఎయిర్ ఇండియా ఆర్థిక పరిపుష్టికి ఏర్పాటయిన ఎస్పీవీకి రుణ బకాయిల బదిలీ కోసమే ఈ నిధులు కేటాయించినట్టు బడ్జెట్ ప్రతుల్లో స్పష్టంగా ప్రస్తావించింది. రూ. 55,000 కోట్ల అప్పుల భారం ఉన్న ఎయిర్ ఇండియా మెరుగుకు ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తూనే ఉన్నది. దీనిలో రూ.29,000 కోట్లను ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్ లిమిటెడ్‌కు బదిలీ చేయాల్సి ఉంది. 2007లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌తో విలీనమైనప్పటి నుంచి జాతీయ విమానయాన సంస్థ నష్టాలను ఎదుర్కొంటూనే ఉన్నది. 2012లో యూపీఏ పాలనలో పొడిగించిన బెయిల్ ఔట్ ప్యాకేజీతో ఎయిర్ ఇండియా మనుగడ కొనసాగింది. ఆడిటింగ్ లెక్కల ప్రకారం అధిక వడ్డీల భారం, విమానయాన రంగంలో నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా ఎయిర్ ఇండియా 2016-17 ఆర్థిక సంవత్సరానికి మొత్తంగా రూ.47,145.62 కోట్ల మేరకు నష్టాల్లో ఉన్నది. వీవీఐపీ ఆపరేషన్స్ కోసం విమానాల కొనుగోలుకు మరో రూ.1,084 కోట్లు ఎయిర్ ఇండియాకు ఇవ్వనున్నారు. 2019-20కి పౌర విమానయాన మంత్రిత్వశాఖకు మొత్తంగా రూ.4,500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.6,602.86 కోట్ల మొత్తానికంటే ఇది తక్కువే.. ఈ మొత్తాన్ని ఆ తర్వాత రూ.9,700 కోట్లకు పెంచారు.

ఎవరేమన్నారంటే

రైతులకు అవమానకర పథకం



మధ్యంతర బడ్జెట్‌లో రైతులకు ప్రకటించిన ఆదాయ హామీ పథకం రైతులకు అవమానకర పథకం. మోదీ అసమర్థత, అహంకారం రైతుల జీవితాలను ధ్వంసం చేసింది. ఏడాదికి ఆరు వేలంటే.. రోజుకు రూ.17కన్నా తక్కువే. ఈ రకంగా ఆ పథకం రైతులను అవమానపరచడమే. రైతు శ్రమను అవమానపరిచేలా ఈ పథకం ఉంది.

- రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు


ఓట్ ఆన్ అకౌంట్ కాదు.. అకౌంట్ ఫర్ ఓట్స్



మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన కేంద్రం, భారీ కేటాయింపులతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలా కాకుండా ఎన్నికల ప్రచారంలా సాగింది. ఇది ఓట్ ఆన్ అకౌంట్ కాదు. అకౌంట్ ఫర్ ఓట్స్‌గా ఉన్నది. దేశంలోని వనరులపై పేదలకే తొలి హక్కు ఉంటుందన్న కాంగ్రెస్ ప్రకటనను కాపీకొట్టినందుకు ధన్యవాదాలు.

- పీ చిదంబరం, కేంద్ర మాజీ ఆర్థికమంత్రి


ప్రజలకు ఫలితం లేని బడ్జెట్



ఈ బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడేదికాదు. అంతా శుష్కప్రసంగమే. వాస్తవ పరిస్థితులకు, నిజాలకు బడ్జెట్ దూరంగా ఉన్నది. పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి సంబంధించి ఆశించిన ఫలితాలను సాధించదు. బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాలు, దురహంకార ధోరణిని ప్రజలు గమనించాలి.

- మాయావతి, బీఎస్పీ అధ్యక్షురాలు


ఈ బడ్జెట్‌కు విలువలేదు



ఈ బడ్జెట్‌కు అసలు విలువ లేదు. ఇప్పుడు తీసుకొచ్చిన బడ్జెట్‌ను ఎవరు అమలుచేస్తారు? రైతులకు రూ.ఆరు వేల పథకం ప్రకటించే నైతికహక్కు బీజేపీ ప్రభుత్వానికి లేదు. నాలుగేండ్లుగా రైతుల కోసం ఇలాంటి పథకాలు ఎందుకు అమలుచేయలేదు? నోట్ల రద్దు, జీఎస్టీతో దేశం ఆర్థిక ఎమర్జెన్సీ పరిస్థితిని ఎదుర్కొంటున్నది.

-మమతాబెనర్జీ, ముఖ్యమంత్రి, పశ్చిమబెంగాల్


ఇది ఎలక్షన్ మ్యానిఫెస్టో



బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలా బడ్జెట్ ఉన్నది. ప్రజలను కొనుగోలు చేసేందుకు ప్రయతిస్తున్నది. రైతులను బీజేపీ ఫూల్స్ చేసేందుకు ప్రయత్నిస్తూ ఓట్లు కొల్లగొట్టాలని భావిస్తున్నది.

- మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత


దివాళాకోరుతనానికి నిదర్శనం



ఎన్నికల జిమ్మిక్కులా బడ్జెట్ ఉన్నది. ఈ ప్రభుత్వం ఎన్ని గింగిరాలు తిరిగినా రైతుల బాధలు, పేదరికం తొలిగిపోవు. పది కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, 100 స్మార్ట్‌సిటీలు నిర్మిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపుచేస్తామని చెప్పి ప్రజలను వెర్రివాళ్లను చేయడానికి ప్రయత్నించారు.

-సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

మోదీ చివరి అంకెల గారడీ



బడ్జెట్ మోదీ చివరి అంకెల గారడీలా ఉన్నది. విద్య, వైద్య రంగాల్లో పెట్టుబడులు పెరుగాలి. కనీస వేతనాలు పెరిగి అమల్లోకి రావాలి. పంటలకు ఒకటి న్నర రెట్లు అధిక ధరలు చెల్లించాలి.

- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

శత్రుదుర్భేద్య రక్షణే లక్ష్యం

- డిఫెన్స్‌కు రూ.3.05 లక్షల కోట్లు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే రూ.20 వేల కోట్లు అదనం

న్యూఢిల్లీ: దేశ రక్షణరంగానికి కేంద్రం మునుపెన్నడూ లేనివిధంగా భారీగా నిధులు కేటాయించింది. దేశాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చడమే లక్ష్యంగా అడుగులు వేసింది. శుక్రవారం పార్లమెంట్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో దేశ రక్షణరంగానికి 2019-20 ఆర్థిక సంవత్సరం కోసం రూ.3.05 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.20 వేల కోట్లు అధికమని తాత్కాలిక ఆర్థికశాఖ మంత్రి పీయూష్‌గోయల్ వెల్లడించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రక్షణరంగానికి రూ.2.85 లక్షల కోట్లు కేటాయించినట్టు గుర్తుచేశారు. 'మన రక్షణ బడ్జెట్ తొలిసారి 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.3 లక్షల కోట్లు దాటిపోతుంది. దేశరక్షణ, ఇతర సంసిద్ధత కోసం అవసరమైతే అదనంగా నిధులు అందజేస్తాం' అని తెలిపారు. సరిహద్దుల్లో అత్యంత క్లిష్టపరిస్థితుల నడుమ విధులు



నిర్వర్తిస్తున్న సైనికుల సంరక్షణ చూసుకోవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. 40 ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ)ను పరిష్కరించామని వెల్లడించారు. 'ఓఆర్‌ఓపీని గత ప్రభుత్వాలు మూడు బడ్జెట్‌ల సందర్భంగా ప్రకటించినా.. 2014-15 తాత్కాలిక బడ్జెట్‌లో కేవలం రూ.500 కోట్లు మాత్రమే కేటాయించాయని గుర్తుచేశారు. అందుకు విరుద్ధంగా రూ.35వేల కోట్లు వినియోగించి ఈ పథకాన్ని అమలుచేశాం' అని వివరించారు. నౌకాదళం, వైమానిక దళాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నవారికి చెల్లించే మిలటరీ సర్వీస్ పే గణనీయ పెంపుతో సైనికులకు అలవెన్సులు, వేతనపెంపు చేపట్టామని గోయల్ ప్రకటించారు.

హోంశాఖకు తొలిసారి లక్షకోట్లు

- గతం కంటే 4.9 శాతం పెంపు

హోంశాఖకు తొలిసారి బడ్జెట్ కేటాయింపులు లక్ష కోట్లు దాటాయి. గత బడ్జెట్‌లో రూ.99,034 కోట్లు కేటాయించిన కేంద్రం.. ఈ బడ్జెట్‌లో రూ.1,03,927 కోట్లు కేటాయించింది. గతం కంటే ఇవి 4.9 శాతం ఎక్కువ. ఢిల్లీ పోలీసు విభాగానికి రూ.7,496.91 కోట్లు కేటాయించిన మోదీ ప్రభుత్వం.. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు. సీఆర్పీఎఫ్‌కు రూ.23,742.04 కోట్లు, ఇండో-పాక్, ఇండో-బంగ్లా సరిహద్దు భద్రతా దళానికి రూ.19,647.59 కోట్లు కేటాయించింది. ఇంటెలిజెన్స్ బ్యూరోకు రూ.2,198.35 కోట్లు, ఎస్పీజీకి కేటాయింపులను రూ.411.68 కోట్ల నుంచి రూ.530.75 కోట్లకు పెంచింది. పోలీసు బలగాల ఆధునీకరణకు రూ.3,378 కోట్లు, సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పన, పర్యవేక్షణకు రూ.2,000 కోట్లు, మహిళల రక్షణ, సాధికారత పథకానికి రూ.1,330 కోట్లు, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి పథకానికి రూ.825 కోట్లు, స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ల కోసం రూ.953 కోట్లు, నిర్భయ నిధికి రూ.50 కోట్లు, జాతీయ విపత్తు సహాయ నిధికి రూ.10,000 కోట్లు కేటాయించింది.

విజన్ 2030

- విద్య, వైద్య, ఉపాధి, మౌలిక రంగాలపై దృష్టి
- డిజిటల్, స్పేస్ ఇండియాకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ: వచ్చే పదేండ్ల వరకు పది కీలక రంగాల్లో తన లక్ష్యాలను విజన్ 2030 రూపంలో కేంద్రం వెల్లడించింది.'పదేండ్ల తరువాత పేదరికం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత కలిగిన దేశం అన్న పదాలు చరిత్రలో మిగిలిపోతాయి. భారత్ అత్యాధునిక, సాంకేతికపరమైన, అత్యధిక వృద్ధిరేటు సాధించిన దేశంగా నిర్మాణమవుతుందని' అని ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ అన్నారు. 'ముందుగా మన ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ల అమెరికా డాలర్లను చేరడానికి, ప్రజలకు సులభతర జీవనాన్ని అందించడానికి అనువైన భౌతిక, సామాజిక మౌలిక వ్యవస్థల నిర్మాణం మా ప్రథమ లక్ష్యం' అని తెలిపారు. నాణ్యమైన, శాస్త్రీయమైన విద్యావిధానాన్ని రూపొందిస్తామని.. ఆధునిక డిజిటల్ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా పెద్దఎత్తున ఉపాధికల్పన చేస్తామన్నారు.

విజన్-2030 లక్ష్యాలు

- ప్రజలకు సులభతర జీవనాన్ని అందించడంకోసం భౌతిక, సామాజిక మౌలిక వ్యవస్థల నిర్మాణం
- డిజిటల్ ఇండియాలో భాగంగా ప్రభుత్వ నిర్వహణలో యువనాయకత్వాన్ని పెంపొందించడం
- విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనాల వినియోగంతో కాలుష్యరహిత భారతాన్ని నిర్మించడం
- ఆధునిక డిజిటల్ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంద్వారా గ్రామీణ పారిశ్రామికీకరణను విస్తరించి పెద్ద ఎత్తున ఉపాధి కల్పనచేయడం
- నదులను శుద్ధిచేయడం.. ప్రజలందరినీ సురక్షితమైన మంచినీటిని అందించడం, మైక్రో ఇరిగేషన్ ద్వారా నీటిని మరింత సమర్థంగా వినియోగించుకోవడం
- సాగరమాల ప్రాజెక్టును విస్తరించడం
- గగన్‌యాన్ ద్వారా 2022 నాటికి భారత వ్యోమగామిని రోదసిలోకి పంపించడం, ఉపగ్రహాల ప్రయోగవేదికగా భారత్‌ను తీర్చిదిద్దడం
- ఆహారోత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడం, సేంద్రియ విధానాల్లో ఆహారోత్పత్తిచేయడం, మన అవసరాలు తీర్చుకోవడమే కాకుండా.. ప్రపంచ అవసరాలు తీర్చేలా ఎగుమతులు చేయడం
- ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్యభారత్‌ను సాధించడం.. మహిళలకు సమాన హక్కులు, రక్షణ, సాధికారత కల్పించడం
- కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన లక్ష్యంగా బాధ్యతాయుతమైన అధికారయంత్రాంగంతో తీర్చిదిద్దడం

ఉపాధి హామీకి 60వేల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి భారీ కేటాయింపులు చేపట్టింది. శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో 2019-20 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకానికి 60,000 కోట్లు కేటాయించింది. గతేడాదితో కేటాయింపులు 55,000 కోట్లతో పోల్చితే ఇది 11 శాతం అధికం. 2018-19 సంవత్సరానికి సవరించిన అంచనా ప్రకారం 61,084 కోట్లుగా అధికారిక గణాంకాలు వెల్లడించాయి. దేశంలో పేదవారెవరూ ఆహారం లేకుండా ఖాళీ కడుపుతో నిద్రపోరాదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆర్థికమంత్రి పియూష్‌గోయల్ తెలిపారు. 2005లో ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దేశంలోని అన్ని గ్రామీణ జిల్లాలకు విస్తరిస్తున్నట్టు పేర్కొన్నారు.

కాలుష్య నియంత్రణకు బడ్జెట్ కోత

న్యూఢిల్లీ: కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం 50 శాతం నిధులు తగ్గించింది. గత బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈసారి దానిని రూ.10 కోట్లకు తగ్గించింది. దీనిపై పర్యావరణ నిపుణులు తీవ్రంగా మండిపడుతున్నారు. దేశంలో వాయు కాలుష్య సమస్య తీవ్రస్థాయిలో ఉండగా, ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం దిగ్భ్రాంతికరం అని వారు పేర్కొన్నారు. ఈబడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించింది తప్ప పునరుత్పాదక ఇంధనంతో సంబంధం ఉన్న పలు రకాల పన్నులపై ఎటువంటి స్పష్టతనివ్వలేదని శాస్త్ర పర్యావరణ కేంద్రం సభ్యుడొకరు విమర్శించారు. ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమానికి ఎటువంటి నిధుల కేటాయింపు జరుగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బ్యూరోక్రాట్ల శిక్షణకు 241 కోట్లు

న్యూఢిల్లీ: ఉన్నతాధికారులకు దేశీయంగా, విదేశాల్లో శిక్షణ, మౌలిక సదుపాయల కల్పనకు బడ్జెట్‌లో రూ.241.81 కోట్ల నిధులు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.194.76 కోట్ల కన్నా ఇది 24 శాతం ఎక్కువ. ఢిల్లీలోని సచివాలయ శిక్షణ, నిర్వహణ సంస్థ, ముస్సోరిలోని సివిల్ సర్వెంట్లకు శిక్షణ అందించే లాల్‌బహదూర్‌శాస్త్రి జాతీయ పరిపాలనా అకాడమీలో శిక్షణ కార్యక్రమాలకు రూ.162.75 కోట్లు, సీఐసీ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డుకు రూ.30.26 కోట్లు, క్యాట్‌కు రూ.119.46 కోట్లు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు రూ.239.97 కోట్లు కేటాయించారు. కాగా, లోక్‌పాల్‌కు బడ్జెట్ కేటాయింపుల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ.4.29 కోట్లు కేటాయించింది. మరోవైపు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ)కి కేటాయింపులను కొంతమేర పెంచింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సీవీసీకి రూ.35.5 కోట్లు కేటాయించినట్టు కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ ప్రకటించారు. ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.1.5 కోట్లు అధికమని తెలిపారు.



ఇది రెండో సర్జికల్ స్ట్రయిక్. మొదటిది దేశ సరిహద్దులో మన జవాన్లు తుపాకులతో చేశారు. ఇప్పుడు బ్యాలెట్‌తో ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం చేస్తున్న లక్షిత దాడి ఇది. ఈ బడ్జెట్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

రామ్‌విలాస్ పాశ్వాన్, కేంద్ర మంత్రి

మోదీ ప్రభుత్వం మరోసారి రైతులకు ద్రోహం తలపెట్టింది. ఏడాదికి రూ.6వేలు ఇస్తామని చెబుతున్నది. లాలిపాప్ కన్నా ఘోరం. ఈ సాయంతో నెలకు ఐదు వందలు, రోజుకు రూ.15 అందుతాయన్నమాట. వీటితో ఒక కప్పు చాయ కూడా రాదు. రైతులు సంపూర్ణ రుణమాఫీని కోరుతున్నారు. మద్దతు ధరలు అడుగుతున్నారు. అవికాకుండా చేసేదంతా నాటకమే.

డాక్టర్ అశోక్ ధావలె, ఆల్ ఇండియా కిసాన్ సభ, అధ్యక్షుడు



చరిత్రలో నేడు



1909

ప్యారిస్‌లో 'ఫ్యూచరిస్ట్ మ్యానిఫెస్టో'ను ప్రకటించిన ఇటలీ రచయిత మారినెట్టి.

1922



జేమ్స్ జాయిస్ రచన 'ఉలిసిస్' ప్రచురణ.



1971

ఉగాండాలో మిల్టన్ ఒబోటేను గద్దెదించి అధికారం చేజిక్కించుకున్న ఈదీ అమీన్.

ఈ మధ్య దేశవ్యాప్తంగా నిర్వహించిన 'ఒపీనియన్ పోల్స్'లో హంగ్ పార్లమెంట్ తప్పదని తేలింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు గానీ, కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏకు గానీ చాలినంత మెజార్టీ రాదని ఆ సర్వే తెలిపింది. ఈ క్రమంలో కేంద్రంలో అధికారం చేపట్టడానికి ప్రాంతీయ పార్టీల మద్దతు అనివార్యమని అర్థమవుతున్నది. రోజుకొకటిగా ఎన్డీయే మిత్రపక్షాలు బీజేపీకి దూరమవుతున్న స్థితిలో దానికి ప్రమాద ఘంటికలేనని చెప్పకతప్పదు.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సంకీర్ణ రాజకీయాల సున్నితత్వాన్ని, క్లిష్టతను కర్ణాటక రాజకీయాలు మరోమారు రుజువు చేస్తున్నాయి. జేడీ(ఎస్)-కాంగ్రెస్ కూటమి ముఖ్యమంత్రి కుమారస్వామి గత నాలుగు రోజుల్లోనే రెండు మార్లు రాజీనామా చేస్తానని హెచ్చరించే స్థితి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న తీరుపై దేవెగౌడ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంకీర్ణ ధర్మాన్ని అందరూ పాటించాలని సూచించాల్సి వచ్చింది. సాధారణ ఎన్నికల ముంగిట సంకీర్ణ రాజకీయాల సున్నితత్వాన్ని అర్థం చేసుకొని నడుచుకోకుండా కలహించుకుంటే ఇరు పార్టీలకూ నష్టమే.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ఎన్నికల బడ్జెట్!

కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భిన్నవర్గాలను మెప్పించడానికి చేసిన చివరిదశ ప్రయత్నంగా చెప్పవచ్చు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధును స్ఫూర్తిగా తీసుకొని, మొక్కుబడిగా రైతులకు ఆర్థిక తోడ్పాటును ప్రకటించారు. కార్మికులను ఆకర్షించడానికి అవ్యవస్థీకృత రంగ కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించారు. నెలకు వంద రూపాయల లెక్కన చెల్లించిన కార్మికులకు అరువై ఏండ్లు దాటిన తర్వాత నెలకు మూడు వేల రూపాయల పింఛన్ లభిస్తుంది. మధ్య తరగతి ఓటర్లను ఆకర్షించడానికి ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షలకు పెంచారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేండ్ల సర్వీసు ఉన్న ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితి పది లక్షల నుంచి ముప్పై లక్షలకు పెంచారు. ఇవన్నీ దేశంలో విస్తారంగా ఉన్న భిన్నవర్గాలను ఆకట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలనడంలో సందేహం లేదు. పెద్దనోట్ల రద్దు వంటి కఠిన నిర్ణయాల సమయంలో, ప్రజల్లో వ్యతిరేకత వచ్చినా సరే వెనుకాడను అంటూ, మొండిగా వ్యవహరించిన ప్రధాని మోదీ, తీరా ఎన్నికల సందర్భంగా మాత్రం మెతకదనం ప్రదర్శించారు.

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరో నాలుగు నెలల కోసం కేంద్ర ప్రభుత్వం 'పద్దుల ఆమోదం' మాత్రమే పొందవలసి ఉన్నది. ఆ తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వం ఎట్లాగూ పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది. కానీ పద్దుల ఆమోదానికి పరిమితం కావలసిన తాత్కాలిక బడ్జెట్‌ను జనాకర్షణ ప్రకటనల కోసం ఉపయోగించుకోవడం వల్ల మోదీ ప్రభుత్వ నైతికత ప్రశ్నార్థకమవుతున్నది. తాజా బడ్జెట్‌లోని కొన్ని ప్రతిపాదనలు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి తప్ప అమలు కావు. మరెందుకు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించినట్టు? ప్రజాస్వామ్యంలో ఎన్నికల ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు చేయడం పరిపాటి కనుక, వాటిని తప్పుపట్టలేము. కానీ ప్రధాని మోదీ వచ్చే ఆర్థి క సంవత్సరం నుంచి ఏవైనా విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని అనుకుంటే, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించవచ్చు. ఇట్లా మూన్నాళ్ల ముచ్చట కోసం విధాన ప్రకటనలు చేయడం మంచి పద్ధతి కాదు. పోనీ ప్రధాని మోదీ తన ఐదేండ్ల పరిపాలన అనుభవాన్ని రంగరంచి దేశ పునర్నిర్మాణం కోసం దార్శనికతతో కూడిన దిశానిర్దేశం చేస్తున్నారా అంటే అదీ లేదు. బడ్జెట్‌లో ఆయన ఏ ఒక్క కొత్త దృక్కోణాన్ని ఆవిష్కరించలేకపోయారు. పదేండ్లలో కాలుష్యాన్ని నివారిస్తామని, ఆరోగ్య నిర్వహణను అద్భుతంగా సాగిస్తామని, నదులను ప్రక్షాళన చేస్తామని, సాగరమాల పథకాన్ని అమలుచేస్తామని, విద్యుత్ వాహనాలను ప్రవేశపెడుతామని, అంతరిక్ష కార్యక్రమాలతో అదరగొడుతామని చెప్పుకోవడం ఊకదంపుడుగా ఉన్నదే తప్ప కొత్తదనం లేదు. బడ్జెట్ మొత్తంగా దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను, వాటి పరిష్కారాలను సూచించేదిగా కాకుండా, ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా ఉన్నది.

> **ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతుల రుణమాఫీని ప్రకటించింది. ఇప్పుడు మోదీ ఆర్థిక తోడ్పాటుగా ఆరు వేల రూపాయలు ఇస్తామంటున్నారు. ఏదేమైనా దేశ రాజకీయ వ్యవస్థ ముందు వ్యవసాయరంగాన్ని, రైతుల సమస్యను ప్రధాన అజెండాగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుంది. తెలంగాణ మోడల్ అమలుచేయాలనే డిమాండ్ దేశ ప్రజల నుంచి బలంగా రావాలని ఆశిద్దాం.**

మోదీ ఐదేండ్ల పాలన పొడుగూతా రైతుల ఆందోళనలతో కుతకుతలాడింది. ఆయన ముఖ్యమంత్రిగా వెలిగిపోయిన గుజరాత్ రాష్ట్రంలోనే పటీదారులు ఆందోళన బాటపట్టారు. బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అన్నదాతలు ఆగ్రహ ప్రదర్శనలు సాగించారు. అయినా సరే, ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా కాకుండా, సామాజిక వర్గాలను ఆకట్టుకొనే ఎత్తుగడల ద్వారా ఎన్నికల్లో నెట్టుకరావచ్చుననే భావజాలం బీజేపీ నాయకత్వానికి బాగా ఒంటబట్టింది. గుజరాత్ ఎన్నికల్లో గెలుపు ఈ అడ్డదారి ఆలోచనాధోరణిని మరింత బలోపేతం చేసింది. కానీ ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎదురుదెబ్బలు తిన్నది. పలు సర్వేలు కూడా బీజేపీ ప్రతిష్ఠ దిగజారిందని సూచించాయి. మోదీకి ఇక రైతులను ఆకట్టుకోవడం తప్పనిసరైంది. వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేయడానికి తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న సమగ్ర వ్యూహంలోని ఒక రైతుబంధు పథకాన్ని మాత్రం తీసుకొని, ఎన్నికల అస్త్రంగా వాడదలుచుకున్నారు. దాన్నికూడా మొక్కుబడిగా ఐదెకరాల లోపు ఉన్న రైతులకు (ఎకరానికి కాదు, ఒక్కో రైతుకు మాత్రమే) ఏడాదికి ఆరు వేల రూపాయలను మూడు దశలుగా ఇవ్వాలని నిర్ణయించారు. ఎన్నికల లబ్ధి కోసమైనా సరే, చిత్తశుద్ధితో కేసీఆర్ మోడల్‌ను యథావిధిగా అమలుచేసినా రైతుల బాధ కొంతైనా తీరేది, దేశం బాగుపడేది. ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతుల రుణమాఫీని ప్రకటించింది. ఇప్పుడు మోదీ ఆర్థిక తోడ్పాటుగా ఆరు వేల రూపాయలు ఇస్తామంటున్నారు. ఏదేమైనా దేశ రాజకీయ వ్యవస్థ ముందు వ్యవసాయ రంగాన్ని, రైతుల సమస్యను ప్రధాన అజెండాగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుంది. తెలంగాణ మోడల్ అమలుచేయాలనే డిమాండ్ దేశ ప్రజల నుంచి బలంగా రావాలని ఆశిద్దాం. తెలంగాణ మార్గంలో దేశం పురోగమించాలని కోరుకుందాం.

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

బాపూజీ నువ్వు బతికే ఉన్నవు

19 ఏండ్ల కౌమార దశలో గాంధీజీ, తన అన్న ఇతర మిత్రులు అందించిన ప్రోత్సాహంతో బారిస్టర్ చదువు కోసం 1888లో లండన్ వెళ్లారు. తల్లి పుత్లీబాయి లండన్ వెళ్లడానికి కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. అంతేకాదు, గాంధీకి చిన్నప్పుడు తాను చెప్పిన ప్రథమ పాఠం సంగతి జ్ఞాపకం చేసింది. 'చచ్చినా అబద్ధం చెప్పరాదు, నిజమే మాట్లాడాలె' అన్నది తల్లి నేర్పిన మొదటి పాఠం.

బాపూజీ నువ్వు బతికే ఉన్నవు, సందేహం లేదు. 'నేను బాబాను' అని నువ్వు ఎన్నడూ చెప్పలేదు. 'నేను స్వామిని' అని ఎన్నడూ అనలేదు. 'నాకు ఇక్కడ, ఇచ్చోట సమాధి కట్టండి. సమాధిలో నుంచి పలుకుతాను, నా మహిమలు చూపుతాను' అని నువ్వు ఎన్నడూ భక్త కోటికి చెప్పలేదు. అయినా నువ్వు శారీరకంగా, భౌతికంగా మృతిచెందినా, ప్రపంచమంతటా అసంఖ్యాకుల ఆలోచనల్లో నిజంగా బతికే ఉన్నవు. ఇతరులెవరూ లోపలికి ప్రవేశించలేని, కోటల వంటి, కోట్ల విలువైన ఆశ్రమాలను నువ్వు నిర్మించలేదు. శ్రీమంతుల ఇండ్లలో పూలపందిరి మంచాల్లో నువ్వు ఎన్నడూ పాదపూజలు చేయించుకోలేదు. నీ గురించి విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ ఎన్నడో అన్న మాటలు ఇప్పుడు జ్ఞాపకం వస్తున్నవి. ఆయన మాటలు '..వేలాది దరిద్రుల, నిరుపేదల గుడిసెల వాకిళ్లలో ఒకడిగా దుస్తులు వేసుకొని నిలిచాడు. వారి భాషలో ఆయన మాట్లాడినాడు. సజీవ సత్యంగా ఆయన కనిపించాడు. దేశ ప్రజలు ఆయన్ను మహాత్ముడన్నారు. అదే ఆయన పేరయింది. భారతీయులు తన వాళ్లని భావించినవాడు ఆయన ఒక్కడే'. బీపీఎల్ పేదోడి వలె నువ్వు చివరిమాట (హే రామ్) వరకు మోకాలి మీదికి చీప్ ధోతి కట్టి, అంగీ లేకుండా తిరిగినవు, పాదయాత్రలు చేసినవు. లండన్‌లో బ్రిటిష్ ప్రధానులు, మంత్రులు, వైస్రాయిలు, ఉన్నతాధికారుల ముందు ఇదే ఇండియన్ పేదోడిగా కూర్చొని భారత్ భవిష్యత్తుపై రౌండ్‌టేబుల్ చర్చలు జరిపినవు. స్టాలిన్‌తో, రూజ్‌వెల్ట్‌తో సమానుడిగా పేరొందిన సర్ విన్‌స్టన్ చర్చిల్ – బ్రిటిష్ ప్రధాని (యుద్ధకాలంలో)–నిన్ను 'ఫకీర్' అని అవమానించాడు. ఇంకెవరో నిన్ను 'కాఫిర్' అని అవమానించినారు. ఎవరెన్ని మాటలతో అవమానించినా, సహించిన, భరించిన 'మొండి మనిషి'వి నువ్వు. వాళ్లు అవమానించారని బాధపడి నువ్వు చర్చల మధ్య నుంచి ఎన్నడూ వాకౌట్ చేయలేదు, పోరాట రంగం నుంచి నిష్క్రమించలేదు. లక్ష్యం సాధించేవరకు, గమ్యం చేరేవరకు నిద్రపోని, జెండా దించని, భారత ప్రజల, కోట్లాది తాడిత, పీడిత ప్రపంచ ప్రజల గుండెల గహ్వారంలో బందీ అయిన మహా నాయకుడివు నువ్వు. 71 ఏండ్ల కిందట, జనవరి 30 సాయంత్రం ఢిల్లీలో ఒక ప్రార్థనా సమావేశంలో ఒక మతోన్మాది వంగి దండంపెట్టి పిస్టల్‌తో దాడిచేసి, బుల్లెట్లు శరీరంలోకి దూసుకుపోవడంతో ఇక నీ పనైపోయిందనుకున్నారు బాపూ.. అంతటితో నీ పనైపోలేదు. నీ మిషన్‌లో రెండో ఘట్టం ప్రారంభమైందని ఆ హంతకుడికి, హంతకుడి నేటి వారసులకు తెలియదు బాపూ! అందువల్లే, ఆ వారసులు మళ్లీమళ్లీ నిన్ను చంపాలనుకుంటున్నారు. నీ అమూల్య ప్రాణం హరించిన ఆ హంతకుడి గుడులు కట్టి పూజలు చేయాలనుకుంటున్నారు. వాళ్లమీద ఈగ వాలడం లేదు. వాళ్ల విషయంలో సెడిషన్ చట్టం, ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ వంటి అస్త్రశస్త్రాలేవీ జ్ఞాపకం రావడంలేదు. వాళ్లు విశృంఖల విహారం చేస్తున్నారు. వాళ్లపై సుమోటో కేసులు పెట్టడానికి వీలుందని న్యాయస్థానాలు భావించడం లేదు. ఆ రోజు సాయంత్రం ప్రార్థనా సమావేశానికి బాపూజీ రావడంలో జరిగిన ఆలస్యానికి కారణం? సమయ పాలనకు చాలా విలువనిచ్చే బాపూజీ ఆలస్యమైందని బాధపడ్డారు. హంతకుడి కోసమే అన్నట్లు బాపూజీ త్వరత్వరగా ప్రార్థనా సమావేశానికి వచ్చి బుల్లెట్ దెబ్బలతో నేలకూలారు. ఆరోజు మధ్యాహ్నం అప్పటి ఉపప్రధాని, దేశ వ్యవహారాల మంత్రి, ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ పటేల్ వచ్చి సుదీర్ఘ చర్చలు జరుపుతూ కూర్చోవడం వల్ల బాపూజీకి ఆలస్యమైంది. ఆరోజు మధ్యాహ్నం చర్చల్లో సర్దార్ పటేల్‌తో బాపూజీ హైదరాబాద్ సంస్థానం సమస్యను ప్రస్తావించాడని, హైదరాబాద్ సమస్య శాంతియుతంగా పరిష్కారం కావాలని బాపూజీ నొక్కిచెప్పాడన్నారు. హైదరాబాద్ సంస్థానంలో, విశేషించి తెలంగాణ ప్రాంతంలో బుసలుకొడుతున్న మతోన్మాద అరాజకత్వం బాపూజీకి చాలా మానసిక బాధ కలిగించింది. హైదరాబాద్ సంస్థానంలో భారత ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా వ్యవహరిస్తున్న కె.ఎమ్. మున్షీ ఢిల్లీలో, బొంబాయిలో బాపూజీ దర్శనం కోసం వెళ్లినప్పుడల్లా బాపూజీ హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం ఆరాటపడేవాడని మున్షీ ఒక గ్రంథంలో వివరించారు. పరిపాలనాదక్షుడిగా, గాంధీజీ పరమభక్తుడిగా పేరొందిన సర్దార్ పటేల్ హోంశాఖ మంత్రిగా ఉన్నప్పుడు బాపూజీ హత్య జరుగడం బాధాకరమని ఆ రోజు అసంఖ్యాకులు ప్రపంచమంతటా ఆక్రందించారు.

19 ఏండ్ల కౌమార దశలో గాంధీజీ, తన అన్న ఇతర మిత్రులు అందించిన ప్రోత్సాహంతో బారిస్టర్ చదువు కోసం 1888లో లండన్ వెళ్లారు. తల్లి పుత్లీబాయి లండన్ వెళ్లడానికి కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. అంతేకాదు, గాంధీకి చిన్నప్పుడు తాను చెప్పిన ప్రథమ పాఠం సంగతి జ్ఞాపకం చేసింది. 'చచ్చినా అబద్ధం చెప్పరాదు, నిజమే మాట్లాడాలె' అన్నది తల్లి నేర్పిన మొదటి పాఠం. మతోన్మాది గాడ్సే పిస్టల్ పేలి ప్రాణం పోయేవరకు 79 ఏండ్ల సమరశీల, ఉజ్వలోజ్వల జీవితంలో, దక్షిణాఫ్రికాలో 22 ఏండ్లు పోరాటాలు నిర్వహించినపుడు (1893–1915), 1915లో స్వదేశం వచ్చి 1947 వరకు భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన 32 ఏండ్లలో గాంధీజీ ఎన్నడూ అబద్ధం చెప్పలేదు. గాంధీజీ స్వాతంత్ర్య సమరసేనానిగానే మిగిలిపోలేదు. ఆయన గొప్ప అధ్యయనశీలి, గొప్ప రచయిత. గొప్ప పత్రికా సంపాదకుడు, మేధావి. లండన్‌లో విద్యార్థిగా, 1888–1891లలో గాంధీజీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ తదితర ఆధ్యాత్మిక, ధార్మిక గ్రంథాలు అనేకం పఠించారు. 1894లో, దక్షిణాఫ్రికాలో నాటాల్ ఇండియన్ కాంగ్రెస్‌ను స్థాపించిన రోజుల్లో గాంధీజీ విరామం లేకుండా మ్యాక్స్‌ముల్లర్, టాల్‌స్టాయ్ గ్రంథాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేశారు. రస్కిన్ గ్రంథం 'అన్‌టు దిస్ లాస్ట్' గాంధీజీని అపారంగా ప్రభావితం చేసింది. ఇండియన్ ఒపీనియన్, నవ్‌జీవన్, యంగ్ ఇండియా, హరిజన్ గాంధీజీ సంపాదకత్వం వహించిన పత్రికలు. స్వీయచరిత్ర 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పర్‌మెంట్స్ విత్ ట్రుత్' గ్రంథాన్ని ఆయన 1925లో రచించారు. దక్షిణాఫ్రికాలో శాంతియుత ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పుడు గాంధీజీ మొదటిసారి 1908 జనవరిలో 'సత్యాగ్రహం' పదాన్ని ప్రయోగించారు. బ్రిటిష్ పాలనలో గాంధీజీ ఇండియాలో పొందిన మొదటి కారాగారశిక్ష ఒక రచయితగా, ఒక సంపాదకుడిగా. 1922లో 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీజీ రాసిన మూడు ఆర్టికల్స్ బ్రిటిష్ పాలకులకు ఆగ్రహం కలిగించాయి. ఈ వ్యాసాలు రాసినందుకు బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీ మీద సెడిషన్ (దేశద్రోహం) కేసు పెట్టింది. న్యాయ స్థానం గాంధీజీకి ఆరేండ్ల కారాగారవాస శిక్ష విధించింది. స్వదేశం వచ్చి స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహించి ఆరేండ్లయినా కాకముందే గాంధీజీ ఆరేండ్లు జైలుశిక్ష అనుభవించారు. ఈ కేసుపై నాటి ఒక న్యాయ మూర్తి వ్యక్తపరిచిన అభిప్రాయం ఇది '..Barring the trial of Socrates, there is perhaps no trial in the history of mankind comparable to that of Gandhiji which stimulated so much interest and whose influence on the life of humanity has been so profound..' కారాగారశిక్షలు, నిర్బంధాలు గాంధీజీ సత్యవాణిని అడ్డుకోలేకపోయాయి.

> **గాంధీజీ స్వదేశానికి తిరిగిరాకుండా దక్షిణాఫ్రికాలో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించినట్లయితే నెల్సన్ మండేలా దాదాపు ముప్పై ఏండ్లు బ్రిటిష్ పాలకుల జైళ్లలో శిక్షలు అనుభవించవలసిన దుస్థితి ఏర్పడకపోయేది. ఈ రోజు ప్రపంచమంతటా గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. నేడు అన్నివిధాల సంభం పాలవుతున్న ప్రపంచానికి, ఈ దేశానికి గాంధీజీ బోధనలు, సిద్ధాంతాలు, విధానాలే శరణ్యమని స్పష్టమవుతున్నది.**


అప్పటికే గాంధీజీ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ధిక్కరిస్తున్న మహా నాయకుడిగా ప్రపంచ ప్రసిద్ధి పొందారు. ప్రపంచ ప్రఖ్యాత మేధావులు, రచయితలు, రాజనీతి విశారదులు, తత్త్వవేత్తలు టాల్‌స్టాయ్, రోమరోలా వంటి వారితో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా గాంధీజీకి సాన్నిహిత్యం ఏర్పడింది. 1924లో గాంధీజీ జీవితచరిత్ర రచించి వివిధ భాషల్లో ప్రచురించిన రోమరోలా గాంధీజీ గురించి అన్న మాటలు "..This is the man who has stirred three hundred million people to revolt, who has shaken the foundations of the British Empire and who has introduced into human politics the strongest religious impetus of the last two thousand years.." గాంధీజీ స్వదేశానికి తిరిగిరాకుండా దక్షిణాఫ్రికాలో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించినట్లయితే నెల్సన్ మండేలా దాదాపు ముప్పై ఏండ్లు బ్రిటిష్ పాలకుల జైళ్లలో శిక్షలు అనుభవించ వలసిన దుస్థితి ఏర్పడకపోయేది. ఈరోజు ప్రపంచమంతటా గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. నేడు అన్నివిధాల సంభం పాలవుతున్న ప్రపంచానికి, ఈ దేశానికి గాంధీజీ బోధనలు, సిద్ధాంతాలు, విధానాలే శరణ్యమని స్పష్టమవుతున్నది. మహాత్ముని సమకాలీనులైన కవులు, రచయితలు, మేధావులందరి మీద, ప్రపంచమంతటా ఆయన ప్రభావం గాఢంగా ప్రసరించింది. మహాకవి దాశరథి మాటల్లో ..

'జండా ఒక్కటె మూడు వన్నెలది,
దేశంబొక్కటే భారతఖండాసేతు హిమాచలోర్వర
కవీట్కాండమ్ము లోనన రవీంద్రుండొక్కడె కవీంద్రుడు
ఊర్జిత జగద్యుద్ధాలలో శాంతి కోదండోద్యద్విజయుడు
గాంధీ ఒక్కడే తల్లీ మహాభారతీ..!'

'ఓ మహాత్మా! ఓ మహర్షీ! ఓ క్షమాపీయూష వర్షీ! ఓ తపస్వీ! ఓ అహింసాశయ మనస్వీ!' అంటూ శ్రీశ్రీ శ్రద్ధాంజలి ఘటించారు.

విద్యావేత్తల ముందు విశేష బాధ్యతలు

విశ్లేషణ



బి.ఎస్.రాములు

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ ప్రయోజనాల దృష్టికోణంలో విద్యావేత్తలకు అనేక కర్తవ్యాలున్నాయి. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, భాష, వనరులు, మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, తెలంగాణ తాత్వికత, తాత్వికులు, తెలంగాణ సామాజిక పరిణామాల గురించి విద్యావేత్తలుగా పాఠ్యపుస్తకాల నిర్మాణంలో మార్పులు చేయాలె. ఇందుకు సంబంధించి అధ్యయనం, విశ్లేషణ, గ్రంథరచన, వ్యాసాలు, సెమినార్ పత్రాలు, పీహెచ్‌డీ పరిశోధనలు, జాతీయ సెమినార్లు మొదలైనవి చేపట్టడం విద్యావేత్తల కర్తవ్యాలు.

జనాభాలో ఈబీసీ గ్రూపు కలుపుకొని 68 శాతానికి పైగా గల బీసీలు, 16 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు మొత్తం కలిసి 85–89 శాతం ఉంటారు. వీరి కులాలు, కులవృత్తులు, వృత్తి నైపుణ్యాలు, పారిశ్రామిక విప్లవం దాకా శతాబ్దాలుగా ఈ సామాజికవర్గాలు సృష్టించిన సంపద, సేవలు, సామాజిక నిర్మితిలో వారి పాత్ర, ప్రాధాన్యం, భాషా సంస్కృతి, ఉత్పత్తి సాధనాలు, పరికరాలు, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, ఖనిజాలు, లోహాలు, సహజవనరుల వెలికితీతలో వారి కృషి, చేర్పు, పాఠ్యపుస్తకాల్లో వారి ప్రాధాన్యం విశ్లేషించడంతో పాటు పలు కోణాల్లో చరిత్ర పునర్నిర్మాణం చేయాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి పారిశ్రామిక విప్లవంతో మారిన స్థితిగతులు, ఆధునిక విద్య, పై వర్ణాల నుంచి కింది కులాల దాకా అందించడంలో ఏర్పడిన అవరోధాలు, పరిపాలనా వ్యవస్థకు అనుకూలంగా విద్యావిధానం ప్రవేశపెట్టడం ద్వారా ఉత్పత్తి శక్తులైన శూద్రులు కోల్పోతూ వస్తున్న అవకాశాల గురించి అవగాహన పెంపొందించుకోవాలి. ఆధునిక టెక్నాలజీ, ఉపాధి అవకాశాలతో కూడిన కోర్సులు, పాఠ్యాంశాల గురించి అధ్యయనం చేసి యువతరాలకు అందించాల్సి ఉన్నది.

రాజ్యాల విస్తరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల, శూద్రుల పాత్ర, వారి త్యాగాలు. సాహిత్యం, సంస్కృతి, కళల వికాసంలో భాషా వికాసంలో బీసీ, ఎస్సీల స్త్రీల పాత్ర ప్రాధాన్యం. సమస్త కళల, సాహిత్యాల మూలాధార సంస్కృతి, మానవ సంబంధాలు, సమస్త సంపదల సృష్టికర్తలుగా బీసీలు, శూద్రులు, అతిశూద్రులు మొదలైనవి అధ్యయనం చేయాలె. భారత రాజ్యాంగ ఆదర్శాలకు వ్యతిరేకంగా, భిన్నంగా ఉండే అంశాలను ప్రాచీన సాహిత్యం, కళలు, సంప్రదాయం పేరిట కొనసాగించడం ద్వారా భారత రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక విలువల ప్రచారం జరుగుతున్నది. వీటికి పరిష్కార మార్గాలు వెతికినప్పుడే మానవీయ సంస్కృతి వెల్లివిరుస్తుంది.

శతాబ్దాలుగా సమస్త సంపదల సృష్టికర్తలు శూద్రులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలే. కళాకారులుగా, సైంటిస్టులుగా, వృత్తి నిపుణులుగా ఏకకాలంలో ఎదిగిన సమాజ నిర్మాతలు శూద్రులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలే. పారిశ్రామిక విప్లవం నుంచి, జాతీయ ఉద్యమం, కులవృత్తులు, ఆధునిక వృత్తులు, ఆధునిక విద్య, జాతీయీకరణ, 1990 నుంచి ప్రైవేటీకరణ, సరళీకరణ ప్రభావం, బీసీ, ఎస్సీ, ఎస్టీలు, అందుకోవాల్సిన లక్ష్యాలు, అవకాశాలు, ప్రణాళికలు, ప్రాతిపదికలు మొదలైనవి అధ్యయనం చేయాలె. గ్రామీణ వ్యవస్థలో జనాభా వెయ్యిమందిలో 550 మందికి ఉపాధి, 450 మంది ఉపాధి లేని దశలో వలసలు సాగాయి. ఈ నేపథ్యంలో ఇతర పట్టణాలకు, రాష్ట్రాలకు, దేశాలకు సాగిన వలసలు, ఈ పరిణామంలో వారి స్థితిగతులు విశ్లేషించడం పాఠ్యపుస్తకాల్లో చేర్చడం, పుస్తకాలు రాయడం అవసరం.

తెలంగాణలో, దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి, వారి చరిత్ర, సంస్కృతి, మానవ సంబంధాలు, భాష, సాహిత్యం కళలు, ఆయా సామాజికవర్గాల మహనీయులు, సాహితీకారులు, తత్త్వవేత్తలు, అచల తత్వం, శైవం, వైష్ణవం, కుల దైవాలు, పండుగలు, ప్రముఖులు మొదలైనవాటి గురించి కనీసం 150 పుస్తకాలైన రాసి ప్రచురించాలి.

> **ప్రపంచంతో పోటీపడే విధంగా ఎప్పటికప్పుడు పాఠ్యపుస్తకాల్లో సమూల మార్పులు చేయాలి. అడ్వాన్స్ థింకింగ్, ఉపాధిహామీ ఉండే విధంగా కోర్సులు, శిక్షణలు ఉండాలి. ఉపాధి కల్పించే సంస్థలతో సంబంధం కల్పించే నూతన ప్రణాళిక, నూతన దృష్టికోణంతో నేటి విద్యార్థులను మలిచే మార్గదర్శకాలను తెలంగాణ విద్యావేత్తల నిపుణుల సైంటిస్టుల ప్రథమ కర్తవ్యం.**

సామాజికవర్గాల ఉత్పత్తి సాధనాలు, ఇండ్లు, గుడిసెలు, అలంకరణలు, ఆహార్యం, నాడు, నేడు పరిణామాలు, కులవివక్ష, కులాల మధ్య గౌరవాల్లో హెచ్చుతగ్గులు, ఆత్మన్యూనతకు గురిచేసే సామాజిక, మానవ సంబంధాలు, కులాంతర వివాహాల ఆవశ్యకత, కులాలవారీగా కంపార్ట్‌మెంటల్ ఆలోచనావిధానం, వంశపారంపర్య కులవృత్తుల కారణంగా మేధస్సులో, జీన్స్‌లో, శరీర నిర్మాణంలో, బాడీ లాంగ్వేజ్‌లో, భాషలో, పెళ్లి సంబంధాల్లో, కంచం పొత్తు, మంచం పొత్తు గురించిన వివరాలు, పైన పేర్కొన్న విశేషాలు, వైరుధ్యాలు, సంఘర్షణలు, నైపుణ్యాలు వెలికితీసి యువతరానికి తెలిపినప్పుడే వారు చరిత్రలో నిర్వహించిన మహత్తర పాత్ర తెలుస్తుంది.

భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులు, అవకాశాలు పాఠశాలస్థాయిలో తెలుపాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15,16,29ల ప్రాధాన్యాన్ని పాఠశాల నుంచి పీజీ దాకా అన్నిస్థాయిల్లో పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారత రాజ్యాంగం 'వన్ మ్యాన్, వన్ వాల్యూ, వన్ ఓట్' ఆదర్శీకరించింది. స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, సమానావకాశాల గురించి వివరించాలె. రిజర్వేషన్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిపార్ట్‌మెంట్ ద్వారా స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల ఏర్పాటు, పోటీపడి ఉద్యోగాలు, ఉపాధి అందుకోవడానికి నైపుణ్యాల శిక్షణ కోచింగ్‌లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు మొదలైనవాటి ఆవశ్యకత గురించి నిరంతరం నొక్కిచెప్పడం, సాధించడం అవసరం.

భారత రాజ్యాంగం కులవివక్షను, మత వివక్షను నిషేధించింది. సమస్త వివక్షలను నిషేధించింది. అసమానతలు తొలిగించడానికి అనేక మార్గదర్శకాలను పేర్కొన్నది. అందులో భాగంగా ఏ కులం గొప్పది కాదు. ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే. మనుషులందరూ ఒక్కటే. మనుషులుందరూ సమానమేనని నోట్ బుక్‌లపై, పుస్తకాలపై ప్రచురించాలి. ప్రాథమిక హక్కులు, ఆర్టికల్ 14, 15, 16లను ప్రతి పాఠ్య పుస్తకంలో, నోట్‌బుక్ మొదటిపేజీలో ప్రచురించాలి.

ప్రపంచంతో పోటీపడే విధంగా ఎప్పటికప్పుడు పాఠ్యపుస్తకాల్లో సమూల మార్పులు చేయాలి. అడ్వాన్స్ థింకింగ్, ఉపాధిహామీ ఉండే విధంగా కోర్సులు, శిక్షణలు ఉండాలి. ఉపాధి కల్పించే సంస్థలతో సంబంధం కల్పించే నూతన ప్రణాళిక, నూతన దృష్టికోణంతో నేటి విద్యార్థులను మలిచే మార్గదర్శకాలను తెలంగాణ విద్యావేత్తల నిపుణుల సైంటిస్టుల ప్రథమ కర్తవ్యం.

(వ్యాకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్)

స్మరణ

చైతన్యంతోనే అభివృద్ధి

రాష్ట్రంలో మూడు విడుతలుగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ఇదంతా అధికారులు విజయంగా చెప్పవచ్చు. పార్టీ రహితంగా జరిగిన ఎన్నికల్లో గెలిచిన సర్పంచి అభ్యర్థులకు అవగాహనా తరగతులు నిర్వహించి అభివృద్ధిలో భాగస్వాములయ్యేటట్లు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుపటం హర్షణీయం. గ్రామస్థాయిలో పాలనానుభవం, అవగాహన లేక గతంలో అనేక అవాంఛనీయ ధోరణులు చోటుచేసుకున్నాయి. ఆధిపత్యానికే గ్రామ సర్పంచి పదవి అన్నట్లుగా వ్యవహరించిన సందర్భాలున్నాయి. సర్పంచి మొదలు వార్డు సభ్యులదాకా అందరూ గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్న ఎరుక చాలామందికి లేకపోవటమే దీనికి కారణం.

ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో సర్పంచులకు అవగాహనా తరగతులు నిర్వహించిన తర్వాత ఆ శిక్షణా తరగతులను గ్రామస్థాయిదాకా విస్తరించాలి. గ్రామాభివృద్ధికి కావలసిన మౌలిక అవసరాలు గుర్తించటం, వాటిని తీర్చటం కోసం చేయాల్సిన పనులను నిర్దేశించుకోవాలి. ప్రతి పనికి ప్రభుత్వంవైపే చూడకుండా ప్రజలంతా సమిష్టిగా కదిలితే ఎన్నో అద్భుతాలు చేయవచ్చని ఎన్నో అనుభవాలున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం కూడా గ్రామస్థాయి నుంచి సమిష్టి పనివిధానంతో చేసుకోదగిన పనులను ప్రజలకు గుర్తింపజేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతమవుతాయనే నిజాన్ని వారికి గుర్తింపజేయాలి. హరితహారం, పారిశుధ్యం, సాక్షరత, సేంద్రీయ సాగులాంటి ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు ప్రజల ఐకమత్యంతోనే సాధ్యమవుతాయి. ఇలాంటి వాటిని ఆచరిస్తూ మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నాలు చేయటం అవసరం. కేవలం ప్రభుత్వ నిధులతోనే గ్రామాభివృద్ధి జరిగిపోతుందనే అపోహ నుంచి ప్రజలను బయటపడేయాలి. దీనికి చైతన్యమే పునాది. అందరి భాగస్వామ్యంతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమనేది ప్రతి ఒక్కరితో గుర్తింపజేయటమే ఇప్పుడు కావాల్సింది. ఈ దిశగా అడుగులు పడాలి. అభివృద్ధి సాధించాలి. గ్రామాల స్వరూపం మారిపోవాలి.

- జీడిపెల్లి లింగారావు, రామకృష్ణకాలనీ, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం

- మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం రూ.60వేల కోట్ల కేటాయింపు

ఇతరమైనవి

- జాతీయ కృత్రిమ మేధస్సు కార్యక్రమానికి మద్దతుగా కొత్తగా జాతీయ కృత్రిమ మేధస్సు పోర్టల్ ఏర్పాటు
- పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.90వేల కోట్లు.

రక్షణ రంగం

3 లక్షల కోట్లు — మొట్టమొదటిసారిగా రూ. 3లక్షల కోట్లు దాటనున్న రక్షణ రంగ బడ్జెట్

రైల్వేలు **64,587** కోట్లు

రైల్వేలకు మూల ధనం మద్దతు రూ.64,587 కోట్లు. మొత్తం మూలధన వ్యయం రూ.1,58,658 కోట్లు. నిర్వహణ నిష్పత్తిని పెంచేందుకు కృషి

విద్య

- జాతీయ విద్యా మిషన్‌కు కేటాయింపులు రూ.38,572 కోట్లు (20 శాతం) పెంపు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్)కు రూ.27,584 (18 శాతం) పెంపు

ఆరోగ్యం

హర్యానాలో 22వ ఎయిమ్స్ స్థాపన

వినోద పరిశ్రమ


భారతీయ నిర్మాతలకు సినిమా నిర్మాణంపై సింగిల్ విండో ద్వారా అనుమతులు. పైరసీని అరికట్టేందుకు సినిమాటోగ్రఫీ చట్టంలో మార్పులు చేసే యోచన.

డిజిటల్ గ్రామాలు

వచ్చే ఐదేండ్లలో లక్ష గ్రామాలను డిజిటల్ గ్రామాలుగా మార్పు

చదువుకు దక్కని ప్రాధాన్యం

ఉన్నత విద్యాసంస్థలకు తగ్గిన కేటాయింపులు.. రూ.93,847 కోట్లు
మౌలిక సౌకర్యాల కల్పనకు రైజ్ పథకం
వచ్చే నాలుగేండ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేసే ప్రతిపాదన
దేశవ్యాప్తంగా 20 'స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్'ల ఏర్పాటు


నమో..హాంఫట్

న్యూఢిల్లీ: కేంద్రం కీలకమైన విద్యారంగాన్ని పక్కన పెట్టింది. రూ.93,847.64 కోట్లు కేటాయించింది. ఇది గత ఏడాదితో పోల్చితే పదిశాతం ఎక్కువేకానీ, బడ్జెట్‌లో విద్యకు కేటాయిస్తున్న మొత్తం మాత్రం గత ఏడాదితో పోల్చితే తక్కువ. ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మకసంస్థలకు కూడా కేటాయింపులను గణనీయంగా తగ్గించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్రం.. ఆ నిర్ణయం ప్రభావం ఎస్సీ/ఎస్టీ/ఓబీసీల రిజర్వేషన్‌పై పడకుండా సీట్లను 25 శాతం మేర పెంచాలని ఉన్నత విద్యాసంస్థలను ఆదేశించింది. ఓ వైపు సీట్లు పెంచాలని చెప్పిన మోదీ సర్కార్.. మరోవైపు విద్యారంగానికి అత్తెసరు కేటాయింపులు జరుపటంపై విద్యావేత్తల నుంచి నిరసన వ్యక్తమవుతున్నది. 'నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అడ్ అడ్మినిస్ట్రేషన్' వీసీ ప్రొఫెసర్ ఆర్ గోవింద స్పందిస్తూ.. రైతులకు, మధ్యతరగతికి వరాలు ప్రకటించిన ప్రభుత్వం విద్యారంగాన్ని పక్కనపెట్టింది. ఎన్నికల ప్రయోజనాలకు విద్యారంగం ముఖ్యమైన అంశం కాదు అని తేల్చి చెప్పింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్ తగ్గటం అన్నది ఏండ్ల నుంచి కొనసాగుతున్న పరిణామమని గుర్తుచేశారు.

పాఠశాల విద్యకు అధిక మొత్తం

రూ.93,847.64 కోట్ల విద్యారంగ బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.56,386.63 కోట్లు, ఉన్నతవిద్యకు రూ.37,464.01 కోట్లు కేటాయించారు. గత ఏడాది విద్యారంగానికి రూ.85,010 కోట్లు కేటాయించగా.. ఈసారి దానిని స్వల్పంగా (రూ.8,837 కోట్లు) పెంచారు. మరో వైపు, 'రైజ్ (విద్యావ్యవస్థలో మౌలికవసతుల పునరుత్తేజితం)–2022' పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని కోసం వచ్చే నాలుగేండ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చుచేయాలని ప్రతిపాదించారు. పరిశోధక, విద్య, ఆరోగ్య సంస్థలను బలోపేతం చేస్తామని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యాసంస్థలకు రూ.608.87 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. గత బడ్జెట్‌లో రూ.350.23 కోట్లు కేటాయించారు. రెండు ఎస్పీఏ (స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్)లను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో స్వయంప్రతిపత్తితో నడిచే 18 ఎస్పీఏలను ఏర్పాటుచేస్తామన్నారు. ఆర్థిక అంచనాల కమిటీ వీటి ఏర్పాటును సమీక్షిస్తున్నదని, దేశంలోని అన్ని ఐఐటీ, ఎన్ఐటీల డైరెక్టర్లు, రాష్ట్రాల, కేంద్ర పాలితప్రాంతాల ప్రధాన కార్యదర్శులు ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఉన్నత విద్యాశాఖ విభాగం ఏర్పాటుచేసిన కమిటీ 'ఆపరేషన్ డిజిటల్ బోర్డు' విధానాన్ని సమర్థంగా వినియోగించడంపై పనిచేస్తున్నదని, దీన్ని అన్ని పాఠశాలల్లో అమలుచేస్తామని పేర్కొన్నారు.

ఐఐటీలు, ఐఐఎంలకు తగ్గిన నిధులు

గతంతో పోల్చితే ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, యూజీసీలకు కేటాయింపులు తగ్గాయి. ఐఐఎంల బడ్జెట్ రూ.1,036 కోట్ల నుంచి రూ.415.41 కోట్లకు, ఐఐటీలకు రూ.6,326 కోట్ల నుంచి రూ.6,223.02 కోట్లకు, యూజీసికి రూ.4,722.75 కోట్ల నుంచి రూ.4,600.66 కోట్లకు, ఏఐసీటీఈకి రూ.485 కోట్ల నుంచి రూ.466 కోట్లకు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్, రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)కు రూ.689 కోట్ల నుంచి రూ.660 కోట్లకు కేటాయింపులు తగ్గాయి. ఎన్నికల ఫలితాలపై విద్యారంగం ప్రభావం అంతగా ఉండదు కాబట్టి.. దానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదన్న 'సంప్రదాయాన్ని' మోదీ సర్కార్ కూడా పాటించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బడ్జెట్‌పై ఉపాధ్యాయుల భిన్నాభిప్రాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యారంగానికి కేంద్రం బడ్జెట్‌లో గత ఏడాది కంటే కేటాయింపులు తగ్గడం ఆందోళన కలిగిస్తున్నదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మొత్తం బడ్జెట్‌లో కనీసం 10 శాతం కేటాయింపులు జరుపాలని డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్రం విస్మరించిందని యూటీఎఫ్ నేతలు సీహెచ్ రాములు, చావ రవి అన్నారు. ఈ బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొంత ఊరట లభించిందని పీఆర్టీయూ నేతలు మారెడ్డి అంజిరెడ్డి, చెన్నయ్య చెప్పారు.

మధ్యంతర బడ్జెట్ 2019-20



లక్ష డిజిటల్ గ్రామాలు

- సీఎస్‌సీలతో మౌలికసదుపాయాలు
- రెండో అతిపెద్ద స్టార్టప్‌ల హబ్‌గా భారత్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఒక లక్ష గ్రామాలను డిజిటల్‌గా మార్చటానికి కేంద్రం సంకల్పించింది. ఈ మేరకు జాతీయ కృత్రిమ మేధో కేంద్రాన్ని ప్రారంభించనున్నదని మంత్రి పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. 12 లక్షల మంది పని చేస్తున్న మూడు లక్షలకుపైగా కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) దేశప్రజలకు పలు రకాల డిజిటల్ సేవలను అందిస్తున్నాయని, వీటివల్ల గ్రామా ల్లో కూడా డిజిటల్ మౌలిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. 'ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్టార్టప్‌ల హబ్‌గా భారత్ అవతరించింది. ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో డిజిటలీకరణకు సంబంధించి మనం సాధించిన విజయాలు పునాదిగా డిజిటల్ వ్యవస్థ, డిజిటల్ ఆర్థికవ్యవస్థ–2030 నిర్మాణం అవుతుంది. అసంఖ్యాక స్టార్టప్‌లతో కూడిన డిజిటల్ భారత్‌ను సృష్టించటంలో మన యువత మనకు సారథ్యం వహిస్తుంది. ఈ క్రమంలో లక్షలాదిగా ఉద్యోగాల కల్పన జరుగుతుంది' అని గోయల్ పేర్కొన్నారు. 'మొబైల్ డాటా వినియోగంలో ప్రపంచంలో మనమే నంబర్–1. ఐదేండ్లలో మొబైల్ డేటా వినియోగం ఏకంగా 50 రెట్లు పెరిగింది. డేటా, వాయిస్‌కాల్స్ ధరలు ప్రపంచంలోనే మనదగ్గర అత్యంత చవకధరకు లభిస్తున్నాయి. మేకిన్ ఇండియా కార్యక్రమం కింద సెల్‌ఫోన్ లేదా సెల్‌ఫోన్ విడిభాగాల కంపెనీల సంఖ్య 2 నుంచి 268కి పెరిగింది. ఇవి భారీ ఎత్తున ఉద్యోగావకాశాల్ని సృష్టించాయి' అని పీయూష్ గోయల్ వెల్లడించారు.

ఆరోగ్యానికి రూ.61,398 కోట్లు

గత బడ్జెట్ కంటే 16 శాతం అధిక కేటాయింపులు ■ ప్రధానమంత్రి జన ఆరోగ్య బీమాకు రూ.6,400 కోట్లు
రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనకు అంటకత్తెర ■ రూ.1,844 కోట్ల నుంచి రూ.156 కోట్లకు కేటాయింపుల కుదింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రూ.61,398 కోట్లు కేటాయిస్తున్నట్టు ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఈ కేటాయింపులు గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో జరిపిన కేటాయింపుల కంటే ఎక్కువ. 2018–19 వార్షిక బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి రూ.52,800 కోట్లు కేటాయించిన కేంద్రం.. ఈ బడ్జెట్‌లో కేటాయింపులను 16 శాతం పెంచింది. ఈ మొత్తంలో ప్రతిష్ఠాత్మక ఆయుష్మాన్ భారత్–ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేవై) బీమా పథకానికి రూ.6,400 కోట్లు కేటాయించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున 10 కోట్లకుపైగా పేద కుటుంబాలకు ఆరోగ్య బీమా రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చిన కేంద్రం.. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు జాతీయ పట్టణ ఆరోగ్య పథకం కింద రూ.250 కోట్లు, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం కింద మరో 1,350.01 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద దాదాపు 1.5 లక్షల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను 2022 నాటికి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చడంతోపాటు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులతోపాటు వృద్ధాప్య సమస్యలకు చికిత్సను అందించేలా తీర్చిదిద్దుతారు. జాతీయ ఆరోగ్య పథకానికి (ఎన్‌హెచ్‌ఎంకు) గత బడ్జెట్‌లో రూ.30,129.61 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఈసారి రూ.31,745 కోట్లకు పెంచింది. అయితే ఎన్‌హెచ్‌ఎం పరిధిలోని రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్బీవై) పథకానికి రూ.1,844 కోట్లు కుదించి కేవలం రూ.156 కోట్లు మాత్రమే కేటాయించింది. ఎయిడ్స్, లైంగిక వ్యాధుల (ఎస్టీడీ) నియంత్రణ పథకానికి గత బడ్జెట్‌లో రూ.2,100 కోట్లు కేటాయించిన కేంద్రం.. ఈసారి బడ్జెట్‌లో అదనంగా మరో రూ.400 కోట్లు కేటాయించింది. అలాగే ఎయిమ్స్‌కు కేటాయింపులను రూ.3,018 కోట్ల నుంచి రూ.3,599.65 కోట్లకు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ పథకానికి కేటాయింపులను రూ.80 కోట్ల నుంచి రూ.105 కోట్లకు పెంచిన మోదీ సర్కారు.. మానసిక వికలాంగుల ఆరోగ్య సంరక్షణ పథకానికి కేటాయింపులను రూ.50 కోట్ల నుంచి రూ.40 కోట్లకు తగ్గించింది. నర్సింగ్ సేవల మెరుగుదలకు రూ.64 కోట్లు, ఫార్మసీ స్కూళ్లు, కాలేజీల ఉన్నతీకరణకు రూ.5 కోట్లు కేటాయించిన కేంద్రం.. జిల్లా దవాఖానలు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలు (పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు), కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్థల ఉన్నతీకరణకు రూ.800 కోట్లు, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.2 వేలకోట్లు, రాష్ట్రాల్లో ప్రభుత్వ పారామెడికల్ సైన్సెస్ సంస్థలు, పారామెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.20 కోట్లు కేటాయించింది.




మౌలికంలో మునుముందుకు

- హైవేల నిర్మాణంలో వేగవంత వృద్ధి
- మరో ఎనిమిదేండ్లలో పది ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ.. భారత్ ఆకాంక్ష
- బడ్జెట్ ప్రసంగంలో మంత్రి గోయల్

న్యూఢిల్లీ: మౌలిక వసతుల అభివృద్ధిలో దేశం మునుముందుకు దూసుకుపోతున్నదని ఆర్థిక మంత్రి పీయూష్‌గోయల్ శుక్రవారం బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. సగటు అభివృద్ధిని అధిగమించి రోజుకు 27 కిలోమీటర్లతో హైవేల నిర్మాణంలో అత్యంత వేగవంత వృద్ధిని సాధించిందని చెప్పారు. రైల్వేలు, జల, వాయుమార్గాలు, డిజి–వేలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉన్నదన్నారు. ఎనిమిదేండ్లలో పది ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా రూపొందాలనేది భారత్ ఆకాంక్ష అని చెప్పారు. ఉడాన్ పథకం వల్ల సాధారణ పౌరులు కూడా విమానాలలో ప్రయాణించగలుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన సాగరమాల ప్రాజెక్టు ఫలితంగా కోస్తా ప్రాంతాల్లోని ప్రజల జీవన నాణ్యత, ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. తొలిసారిగా కోల్‌కతా నుంచి వారణాసి వరకు కంటెయినర్ సరుకు రవాణా మొదలయిందని చెప్పారు. ఈశాన్యానికి కూడా సరుకు రవాణాను విస్తరిస్తామని తెలిపారు. రైల్వేల చరిత్రలోనే ఈ ఏడాది అత్యంత సురక్షిత సంవత్సరమని చెప్పారు. తొలి స్వదేశీ నిర్మిత అత్యంత వేగవంత వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభూతినిస్తుందన్నారు. రైల్వేల మొత్తం క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూ.1,58,658 కోట్లు కాగా, బడ్జెట్‌లో రూ.64,587 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద గ్రామీణ రోడ్ల నిర్మాణం మూడింతలు పెరిగినట్లు చెప్పారు. మొత్తం 17.84 లక్షల ఆవాసాలకుగాను 15.80 లక్షల ఆవాసాలను పక్కారోడ్లతో అనుసంధానించామని, మిగతావాటిని అనుసంధానించే ప్రక్రియ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. 2014– 18 మధ్యకాలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1.53 కోట్ల ఇండ్లను నిర్మించినట్లు తెలిపారు.

రైలు చార్జీలు యథాతథం

- సరుకు రవాణా చార్జీల్లోనూ మార్పులేదు
- కేటాయింపులు రూ.64,587 కోట్లు
- పెట్టుబడి వ్యయం రూ.1.58 లక్షల కోట్లు




న్యూఢిల్లీ: బడ్జెట్‌లో రైలు ప్రయాణ టికెట్లపై, సరుకు రవాణా చార్జీలపై ఎటువంటి భారం మోపలేదు. ఇప్పటివరకు ఉన్న ధరలు యథాతథంగా కొనసాగనున్నాయి. రైల్వేశాఖకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. బడ్జెట్ తోడ్పాటు కింద రూ.64,587 కోట్లు కేటాయించగా.. పెట్టుబడి వ్యయం కింద రూ.1.58 లక్షల కోట్లు ప్రకటించారు. కొత్త లైన్ల నిర్మాణానికి రూ.7,255 కోట్లు, గేజ్ కన్వర్షన్‌కు రూ.2,200 కోట్లు, డబ్లింగ్‌కు రూ.700 కోట్లు, రోలింగ్ స్టాక్‌కు రూ.6,114.82 కోట్లు, సిగ్నలింగ్, టెలికంకు రూ.1,750 కోట్లు ఖర్చు చేయనున్నామని పీయూష్ గోయల్ తెలిపారు. టికెట్ల ధరలు, సరుకు రవాణా చార్జీలను పెంచడం లేదని ప్రకటించారు. రైల్వే ప్రయాణికులకు ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అదనంగా రూ.3,422 కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రైల్వే ప్రమాదాలు తగ్గాయని, బ్రాడ్ గేజ్ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న మనుషులు లేని లెవల్ క్రాసింగ్‌లను పూర్తిగా తొలిగించామని తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు' ప్రయాణికులకు మంచి అనుభూతిని కల్పించనున్నదని చెప్పారు. 'రైల్వేలకు మూలధనం మద్దతు రూ.64,587 కోట్లు, మొత్తం మూలధన వ్యయం కింద రూ.1,58,658 కోట్లు ప్రకటిస్తున్నాం' అన్నారు. గతేడాది బడ్జెట్ తోడ్పాటు రూ.55,088 కోట్లు కేటాయించగా.. పెట్టుబడి వ్యయం రూ.1.48 లక్షల కోట్లు ప్రకటించారు.

అధునాతన బోగీలు

అధునాతన బోగీల సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా రైల్వే అడుగులు వేస్తున్నది. అధునాతన సౌకర్యాలతో మన దేశంలో తయారైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రైయిల్ రన్ విజయవంతం కావడంతో ఇలాంటి రైళ్లను మరో ఆరు తయారు చేయాలని భావిస్తున్నది. 2019–21 మధ్య 15వేల అధునాతన బోగీలను తయారు చేయాలని దేశంలోని బోగీల తయారీ పరిశ్రమలకు రైల్వేశాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందులో 200 హమ్‌సఫర్ బోగీలు, 290 దీన్‌దయాళ్, 40 అంత్యోదయ బోగీలు.. ఇంకా మెట్రో బోగీలు ఉన్నాయి. మూడేండ్లలో 884 దీన్‌దయాళ్ జనరల్ క్యాటగిరీ బోగీలను కూడా రైల్వే తయారు చేయనున్నది. ఇందులో ప్యాడెడ్ సీట్లు, మంచినీటి సదుపాయం, బయో టాయిలెట్స్ ఉంటాయి. 600 మెయిన్‌లైన్ మల్టిపుల్ యూనిట్ బోగీలను తయారు చేసి ప్రధాన నగరాల్లో తిరిగే ప్యాసింజర్ రైళ్లకు అమర్చనున్నారు.

దక్షిణ మధ్య రైల్వేకు 5,924 కోట్లు

- గతేడాది కంటే రూ.172 కోట్లు ఎక్కువ
- కొత్త ప్రాజెక్టులు లేవు: అదనపు జీఎం జాన్ థామస్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రైల్వే బడ్జెట్‌లో కేంద్రం దక్షిణ మధ్య రైల్వేకు రూ.5,924 కోట్లు కేటాయించింది. ఇది క్రితంసారి కంటే రూ.172 కోట్లు అధికం. దక్షిణ మధ్య రైల్వేకు జరిగిన కేటాయింపులపై జోన్ అదనపు జీఎం జాన్ థామస్ రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వే స్పీడ్ రైళ్లకు ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. గేట్లు లేని రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మిస్తామని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గత అక్టోబర్‌నాటికి గేట్లు లేని రైల్వే క్రాసింగ్‌లు దాదాపు లేకుండా చేశామని చెప్పారు. ఈ బడ్జెట్‌లో అక్కన్నపేట – మెదక్‌కు కొత్త రైల్వే లైన్‌కు రూ.10 కోట్లు కేటాయించారన్నారు. రూ.118 కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం గత నాలుగేండ్లలో రూ.89 కోట్లు ఖర్చు చేసింది. హైదరాబాద్ ఎంఎంటీఎస్ ఫేజ్–2కు కేంద్రం రూ.10 లక్షలు కేటాయించింది. రూ.817 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం గత నాలుగేండ్లలో రూ.540 కోట్లు విడుదల చేసింది. మనోహరాబాద్– కొత్తపల్లి ప్రాజెక్టుకు రూ.200 కోట్లు, మునీరాబాద్– మహబూబ్‌నగర్ కొత్త లేన్‌కు రూ.275 కోట్లు కేటాయించింది. 1997–98లో రూ.645 కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టు మంజూరు కాగా, 246 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉన్నది. ఇందులో 66 కిలోమీటర్లు తెలంగాణ పరిధిలో, మిగతాదంతా కర్ణాటక రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. భద్రాచలం –సత్తుపల్లి ప్రాజెక్టుకు రూ.405 కోట్లు కేటాయించింది. సింగరేణి భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఈ లేన్‌ను రూ.704 కోట్ల అంచనాతో 2010–11లో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును వచ్చే రెండేండ్లలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్రలో విస్తరించి ఉన్న కాజీపేట–బల్హార్ష మూడో లేన్‌కు రూ. 265 కోట్లు కేటాయించింది. 202 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,063 కోట్లు కాగా, నాలుగేండ్లలో రూ.360 కోట్లు విడుదల చేసింది. సికింద్రాబాద్– నర్సాపూర్ మార్గంలోని 85 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు రూ.200 కోట్లు, కాజీపేట– విజయవాడ మూడో లేన్‌కు రూ. 110 కోట్లు, యాదాద్రి –ఘట్‌కేసర్ ఎక్స్‌టెన్షన్ ఎంఎంటీఎస్ రెండోదశకు రూ.20 కోట్లు కేటాయించింది. 33 కిలోమీటర్ల ఈ మార్గానికి రూ.412 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేశాఖ జాయింట్ వెంచర్‌గా ఉంది. చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌కు రూ.5 కోట్లు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ మౌలాలిలో నిర్మించేందుకు రూ.1.5 కోట్లు, కాజీపేట ఓవర్ ఆయిలింగ్ వర్క్‌షాప్‌కు రూ.5 కోట్లు కేటాయించింది.

భద్రత సంబంధిత కేటాయింపులు ఇలా

- ఆర్వోబీలు, ఆర్‌యూబీలకు రూ.397 కోట్లు
- వంతెనల నిర్మాణాలకు రూ.52 కోట్లు
- భద్రత క్రాసింగ్ గేట్ల కోసం రూ.72.5 కోట్లు
- ట్రాక్ పునరుద్ధరణకు రూ.657 కోట్లు
- కొత్త ట్రాక్షన్ పనులకు రూ.23.4 కోట్లు
- శిక్షణ కార్యక్రమాల కోసం రూ.16.4 కోట్లు

ప్రధాన కేటాయింపులు ఇలా

- కొన్ని కొత్త రైల్వే లైన్లకు రూ.834 కోట్లు
- డబ్లింగ్ పనులకు రూ.1,905
- ట్రాఫిక్ సౌకర్యాలకు రూ. 138 కోట్లు
- ప్రయాణికుల మౌలిక వసతులకు రూ.229 కోట్లు


ఎవరేమన్నారంటే



సీఎం కేసీఆర్ దేశానికే రోల్ మోడల్

తెలంగాణలో రైతుబంధు, రైతుబీమాను అమలు చేస్తూ రైతు బాంధవుడిగా పేరు పొందిన సీఎం కేసీఆర్ దేశానికే రోల్ మోడల్. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని కేంద్రం తన బడ్జెట్‌లో అచరించడమే ఇందుకు నిదర్శనం. రైతు ఆత్మహత్యలను అరికట్టేలా రైతుబంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారు. దీన్ని కేంద్రం మార్గదర్శకంగా తీసుకుని బడ్జెట్‌లో రైతులకు రూ.6వేల సాయాన్ని ప్రకటించినపుడు టీఆర్ఎస్ ఎంపీలుగా మేము ఎంతో గర్వపడ్డాం. బడ్జెట్‌లో పేర్కొన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తేనే ప్రజలు హర్షిస్తారు.


– ఏపీ జితేందర్‌రెడ్డి, లోక్‌సభలో టీఆర్ఎస్‌పక్ష నేత



వ్యవసాయ రంగానికి కేసీఆర్ మార్గదర్శి

దేశ వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ మార్గదర్శి. తెలంగాణలో వ్యవసాయం ఎంతో ముందంజలో ఉన్నది. కేంద్రంతోపాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పట్టించుకోవడానికి తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతుబీమా, గిట్టుబాటు ధరలు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ లాంటి పథకాలే కారణం. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి సాయాన్ని మరింత పెంచాల్సింది.

– గుత్తా సుఖేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి చైర్మన్



ఓట్ల బడ్జెట్‌లా ఉన్నది

కేంద్ర బడ్జెట్ ఓట్ల కోసం ప్రవేశపెట్టినట్టు ఉన్నది. రైతుబంధును కాపీకొట్టినందుకు సంతోషంగా ఉన్నది. కానీ ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తే రైతు సంతోషిస్తాడు. మోదీ రైతు బంధు కంటే తెలంగాణ రైతుబంధు మెరుగైంది. ఈ పథకాన్ని అమలు చేసేసమయానికి ఎన్నికల కోడ్ వస్తుంది. కాబట్టి ఇప్పట్లో అమలు చేయడం సాధ్యం కాదు. కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన ఐదేండ్లు పూర్తయింది. మళ్లీ ఎన్నికల్లో గెలిచిన ప్రభుత్వం పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.

– బీ వినోద్‌కుమార్, కరీంనగర్ ఎంపీ



తెలంగాణ రైతుబంధే మెరుగు

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు పథకాన్ని కేంద్రం కాపీకొట్టింది. కానీ అదీ సరిగాలేదు. దీంతో పోల్చుకుంటే తెలంగాణ రైతు బంధే మెరుగు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు ఏటా రెండుసార్లు రూ.5 వేల చొప్పున ఇస్తున్నది. కానీ కేంద్ర ప్రభుత్వం తమ పథకంలో రెండు హెక్టార్లలోపు ఉన్న ప్రతి రైతుకు ఏడాదికి రూ.6 వేలు ఆర్థికసాయం ప్రకటించింది. మోదీ రైతుబంధుపై మరింత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. అయినా ఈ పథకాన్ని స్వాగతిస్తున్నా. 33శాతం మహిళల రిజర్వేషన్ అంశాన్ని బడ్జెట్‌లో వెల్లడించలేదు. కచ్చితంగా ఇది ఎన్నికల బడ్జెట్. వేతన జీవులకు పన్ను మినహాయింపులు కల్పించారు.


– కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ ఎంపీ



మ్యానిఫెస్టోను చదివారు

బీజేపీ మ్యానిఫెస్టోను పార్లమెంట్‌లో చదివారు. బీజేపీ ప్రభుత్వ తీరు చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్టున్నది. ప్రభుత్వ కాలపరిమితి పూర్తయ్యాక కొత్త పథకాలు ప్రకటించారు. కిసాన్ సమ్మాన్ నిధి పథకంపై అనేక సందేహాలు ఉన్నాయి. ఏ పథకాన్నైనా మనస్ఫూర్తిగా అమలు చేయాలనుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. కేసీఆర్ రైతుబంధును అమలు చేశారు కాబట్టి తాము కూడా చేయాలనే ఉద్దేశంతో కాపీకొట్టారు. కేంద్రం ప్రకటించిన పథకం ద్వారా సగటున ఎకరానికి రూ.1,200 వస్తాయి. ఈ మొత్తం దేనికి సరిపోతుంది. అసంఘటిత కార్మికులకు ప్రవేశపెట్టిన పథకంలో స్పష్టతలేదు.


– డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎంపీ



మోదీ విజనరీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులు, ఉద్యోగులు, సామాన్యులందరికీ ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్ పేర్కొన్నారు. 2030 నాటికి ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఎన్డీ యే ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇది మోదీ విజనరీ అని కొనియాడారు. ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్, కేంద్రప్రభుత్వ బడ్జెట్‌పై జిల్లా, మండల కేంద్రాల్లో సభలు నిర్వహిస్తామని లక్ష్మణ్ ప్రకటించారు.

– లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



రైతులకు కొంత ఊరటనిచ్చే బడ్జెట్

బడ్జెట్ రైతులకు ఊరటనిచ్చేలా ఉన్నది. రైతులకు ఏడాదికి రూ.6 వేలు సాయం హర్షణీయం. పన్నుల మినహాయింపును రూ.5 లక్షలకు పెంపు, అసంఘటితక రంగంలోని 60 ఏండ్లు దాటినవారికి నెలకు రూ.3 వేల పెన్షన్ పథకాలు, వ్యక్తిగత ప్రయోజనాలను కల్పించడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ప్రకృతి విపత్తుల వల్ల సంభవించిన పంట నష్టాలకు సాయాన్ని అందించటం వల్ల వ్యవసాయరంగానికి ఊతమిచ్చేలా ఉన్నాయి.

– ప్రొఫెసర్ సురేశ్‌లాల్, కేయూ అర్థశాస్త్ర విభాగం

శివాలయ విమానగోపురం పనులు వేగిరం



క్రేన్ సాయంతో విజయ స్తంభాలను అమరుస్తున్న దృశ్యం

యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెరిగింది. శుక్రవారం అంతర్‌మండపానికి గలవిజయ స్తంభాలకు పొదికలను అమర్చే పనులను శిల్పులు నిర్వహించారు. ప్రధానాలయ విస్తరణ పనుల్లో పశ్చిమగోపురం పంచతల గోపురం అంతర్‌మండపానికి గల విజయస్తంభాలను అమర్చే పనులు సమర్థవతంగా చేపట్టారు. అంతర్‌మండపాన్ని విస్తరించేందుకు ఇవి దోహదపడుతాయి. ఎత్తయిన మహారాజగోపురాల వద్ద అంతర్‌మండపాలు... ప్రాకారాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థపతులు సుందరరాజన్, డాక్టర్ ఆనందచారివేలు పర్యవేక్షణలో ఉపస్థపతులు పనులను పర్యవేక్షించారు. శివాలయం మహామండపానికి స్తంభాల స్థాపన కార్యక్రమం రెండోరోజు కూడా ఘనంగా నిర్వహించారు. ఉప స్థపతులు సంజయ్, శ్రీను, ప్రసాద్, హేమాద్రి, మొగిలి తదితరులు పనులను పర్యవేక్షించారు.

కెస్లాపూర్‌లో మెస్రం వంశీయుల విశ్రాంతి

మహాపూజల నిర్వహణపై మెస్రం పటేళ్లతో చర్చలు



శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కెస్లాపూర్ మర్రిచెట్ల వద్ద పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: గోదావరినది పవిత్ర గంగాజలంతో ఆదిలాబాద్ జిల్లా కెస్లాపూర్ మర్రిచెట్ల వద్దకు గురువారం రాత్రి చేరుకున్న మెస్రం వంశీయులు కుటుంబసమేతంగా నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలోని మర్రిచెట్ల వద్దే విశ్రాంతి పొందుతున్నారు. శుక్రవారం మర్రిచెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావుతోపాటు ఆయా గ్రామాల నుంచి కెస్లాపూర్‌కు వచ్చిన మెస్రం వంశీయులు కచేరీ నిర్వహించారు. మెస్రం తుకుడోజీ గాయన్(పాటల) ద్వారా పడియోర్(నాగోబా) చరిత్రను మెస్రం వంశీయులకు వివరించారు. ఈ సమావేశంలో 4న నాగోబాకు నిర్వహించే మహాపూజలతోపాటు సిరికొండ మండలంలో తయారుచేస్తున్న పూజల కోసం ఉపయోగించే మట్టికుండలను తీసుకురావడంతోపాటు పెద్దల పేరిట నిర్వహించే (కర్మకాండలు) తుమ్ కార్యక్రమంపై చర్చించారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సూర్యాపేట	10.0	27.0
ఆదిలాబాద్	11.4	30.3
మంచిర్యాల	11.4	30.3
ఆసిఫాబా	11.4	30.3
సంగారెడ్డి	12.0	33.6
కరీంనగర్	13.6	33.7
మెదక్	14.0	32.3
సిద్దిపేట	14.6	32.1
యాదాద్రి	14.7	34.6
జనగామ	14.9	33.3
మహబూబాబాద్	15.0	28.0
నిర్మల్	15.0	30.0
వికారాబాద్	15.3	25.8
నాగర్‌కర్నూల్	15.5	34.6
మహబూబ్‌నగర్	15.7	34.6
రాజన్న సిరిసిల్ల	16.0	29.0
కామారెడ్డి	16.0	29.0
జగిత్యాల	16.0	31.0
పెద్దపల్లి	16.2	29.6
వనపర్తి	16.2	34.6
జోగుళాంబ గద్వాల	16.7	33.1
నిజామాబాద్	16.8	30.4
జయశంకర్	17.0	29.0
ఖమ్మం	17.0	29.0
వరంగల్ రూరల్	17.0	29.0
రంగారెడ్డి	17.0	30.0
నల్లగొండ	17.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	17.0	31.0
వరంగల్ అర్బన్	17.5	29.0
హైదరాబాద్	17.7	27.8
మేడ్చల్ మల్కాజిగిరి	17.7	27.8



శుక్రవారం మంచిర్యాల జిల్లాకేంద్రంలో జరిగిన సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థినులకు 'మిస్ కళాశాల' పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ భారతి హోళికేరీ విద్యార్థినులతో కలిసి సరదాగా క్యాట్‌వాక్ చేసి వారిని ఉత్సాహపరిచారు.
- నమస్తే తెలంగాణ, మంచిర్యాల ప్రతినిధి

టీఆర్‌ఎస్‌లోకి జోరుగా చేరికలు



జగిత్యాల జిల్లా మాల్యాల మండలం రామన్నపేటలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్



జనగామలో టీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. వివిధపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచులు శుక్రవారం టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వెల్మల్‌కు చెందిన 55 మంది హైదరాబాద్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం టీఆర్‌ఎస్‌లో చేరారు. నల్లగొండ మండలం గుర్రంపోడు మండలం చేపూరులో కాంగ్రెస్‌కు చెందిన 100 మంది నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సమక్షంలో, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో చేర్యాల, మద్దూరు జనగామ మండలాల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా, వివిధ పార్టీల మద్దతుతో సర్పంచ్, ఉపసర్పంచ్‌గా గెలుపొందినవారితోపాటు వివిధ పార్టీలకు చెందిన 500 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, టీడీపీ అధ్యక్షుడు పల్లెమోని వెంకన్న, హన్వాడ సర్పంచ్ రేవతి సత్యం, ఉపసర్పంచ్ కందకం గంగాపూర్, రామన్నపల్లి సర్పంచ్ గోవిందమ్మ, ఎల్లంబావితండా సర్పంచ్ పగిలమ్మ వారి అనుచరులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేటకు చెందిన వైస్ ఎంపీపీ గడ్డం మల్లారెడ్డి, సర్పంచ్ గడ్డం జలజ మల్లారెడ్డి శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

కేంద్రంలో కేసీఆర్.. రాష్ట్రంలో కేటీఆర్

బాధ్యతలు తీసుకోవాలని జనగామలో కార్యకర్తల తీర్మానం

జనగామ, నమస్తే తెలంగాణ: సీఎం కే చంద్రశేఖర్‌రావు కేంద్రంలో నాయకత్వం వహించి, తెలంగాణ రాష్ట్ర పాలన బాధ్యతలను యువనేత కేటీఆర్‌కు అప్పగించాలని, ఎంపీటీసీ వ్యవస్థను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం జనగామ జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో నియోజకవర్గ కార్యకర్తలు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

కాకతీయ కాల్వకు నీటి విడుదల

మెండోరా: ఉత్తర తెలంగాణ జిల్లాల వరద ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు అనుసంధానంగా ఉన్న జెన్‌కో కేంద్రం నుంచి కాకతీయ కాల్వకు శుక్రవారం జెన్‌కో ఎస్‌ఈ చంద్రయ్య, ఎస్సారెస్పీ ఈఈ రామారావు నీటి విడుదలను ప్రారంభించారు. ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని, ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. నీటి విడుదలతో జెన్‌కో కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనట్టు తెలిపారు.

పోలీస్ ఉన్నతాధికారికి హోంగార్డు వేధింపులు!

సూర్యాపేట సిటీ: మహిళా పోలీస్ ఉన్నతాధికారికి అసభ్యకర సందేశాలను పంపుతూ వేధింపులకు పాల్పడుతున్న హోంగార్డును శుక్రవారం పోలీసులు అరెస్టుచేశారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో డీపీవో విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు కరుణాకర్ ఆ శాఖ మహిళా ఉన్నతాధికారికి సెల్‌ఫోన్ ద్వారా అసభ్యకర సంక్షిప్త సందేశాలు పంపుతున్నాడు. కరుణాకర్‌ను గతంలోనే ఒకసారి ఆమె హెచ్చరించి వదిలేశారు. రెండ్రోజుల కిందట కరుణాకర్ మళ్లీ వాట్సప్‌లో అసభ్యకర సందేశాలు పంపించాడు. మహిళాధికారి ఫిర్యాదుమేరకు పట్టణ పోలీసులు కరుణాకర్‌పై కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించారు.

కేవీ కేశవులుకు కన్నీటి వీడ్కోలు



కేశవులు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ తదితరులు



కేవీ కేశవులు పార్థివదేహం వద్ద గౌరవవందనంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

■ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ధర్మపురి, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మంత్రి కేవీ కేశవులుకు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో అధికార లాంఛనాలతో కేశవులు అంత్యక్రియలు నిర్వహించారు. పార్థివదేహానికి ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ మంత్రి కర్నె వెంకట కేశవులు బుధవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆయన ఆకాంక్షమేరకు స్వగ్రామం ధర్మపురిలో అంత్యక్రియలు జరిపేందుకు శుక్రవారం ఉదయం పార్థివదేహాన్ని హైదరాబాద్‌నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. సందర్శకుల కోసం కొద్దిసేపు ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఉంచి, అనంతరం గోదావరి ఒడ్డున సంస్కృతాంధ్ర కళాశాల పక్కన గల ఆయన స్వగృహానికి తరలించారు. గోదావరి సోమవిహార్ పుష్కర్‌ఘాట్ వద్ద కేశవులు అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరిగాయి. పోలీసులు (ఫ్యునరల్ గార్డ్స్) తుపాకులతో విన్యాస్యాలు చేసి గౌరవవందనంగా గాలిలోకి మూడురౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం కేశవులు పెద్ద కుమారుడు మురళీధర్ సంప్రదాయబద్ధంగా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌తోపాటు జేసీ రాజేశం, ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీ వెంకటరమణ, ఏఆర్ డీఎస్పీ ప్రతాప్, ఆర్డీవో నరేందర్, ఏఆర్ ఎస్‌ఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు శ్రీకాంత్, రవీందర్, కేశవులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు కేశవులు పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

కరీంనగర్ టు దేశవ్యాప్తం

రైతుబంధు స్ఫూర్తితో అన్నదాతలందరికీ కేంద్రం సాయం

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి కరీంనగర్ జిల్లాలో ప్రారంభించిన రైతుబంధు పథకం ఇక దేశవ్యాప్తంగా అమలు కానుంది. ఈ పథకం స్ఫూర్తితోనే కేంద్రం 'కిసాన్ సమ్మాన్ నిధి'ని తీసుకొచ్చింది. పంట పెట్టుబడి కోసం ప్రతి సీజన్‌లో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితిని దూరంచేస్తూ సీఎం కేసీఆర్.. గతేడాది మే 10న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లి- ఇందిరానగర్ గ్రామంలో రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. సీఎం కేసీఆర్‌కు సెంటిమెంట్ జిల్లాగా ఉన్న కరీంనగర్ నుంచి ప్రారంభించిన అనేక పథకాలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాయి. రైతుబంధు కూడా ఇప్పుడు దేశంలోని అన్నదాతలకు పెద్దదిక్కుగా మారనుంది. టీఆర్‌ఎస్ సర్కారు ఈ పథకం కింద ఇప్పటికే అన్నదాతలకు రెండుసార్లు పెట్టుబడి సాయం అందించింది. రైతుబంధుకు కేంద్రం ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్‌నిధికి చాలా వ్యత్యాసం ఉన్నదని రైతులు చెప్తున్నారు. కిసాన్ సమ్మాన్ నిధిలో ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకే ఏడాదికి రూ. 6 వేలు మూడువిడుతల్లో ఇస్తామని చెప్పింది. కేంద్ర పథకానికంటే రైతు బంధు బాగుందని రైతులు చర్చించుకుంటున్నారు.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని ధర్మారాజుపల్లికి చెందిన రైతు మూగల సంజీవరెడ్డికి రైతు బంధు మొదటి చెక్కును అందజేస్తున్న సీఎం కేసీఆర్(ఫైల్)



పట్టుబడ్డ ఆయుధాలు, దుప్పికొమ్ములను పరిశీలిస్తున్న ఎస్పీ అన్నపూర్ణ

వికారాబాద్‌లో రెండు పిస్టల్స్ లభ్యం

కార్డన్‌సెర్చ్‌లో దుప్పి కొమ్ములు సైతం స్వాధీనం


యాలాల: వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని రాస్నం, సంగాయిపల్లి తండా, బాణాపూర్ గ్రామాల్లో ఎస్పీ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో రెండు తుపాకులు, ఏడు దుప్పికొమ్ములు దొరికాయి. వీటితో పాటు వేటకు సంబంధించిన ఇతర ఆయుధాలు దొరుకడంతో సంగాయిపల్లి తండాకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వీడని ఉత్కంఠ

విద్యార్థినుల కోసం ఉదయ సముద్రంలో ముమ్మర గాలింపు

రామగిరి: నల్లగొండ జిల్లాకేంద్రంలోని పానగల్ ఉదయసముద్రంలో గల్లంతైనట్టు భావిస్తున్న విద్యార్థినుల కోసం గాలింపు ముమ్మరంగా సాగుతున్నది. మహబూబ్‌నగర్ జిల్లా ఆమనగల్‌కు చెందిన హబీబా ఉన్నీసా, యాదాద్రిభువనగిరి జిల్లా చిన్నకొండూరుకు చెందిన శ్రావణి గురువారం ఉదయసముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్‌నోట్లురాసి అదృశ్యమైన విషయం తెలిసిందే. వారికోసం ప్రత్యేక బృందాలు రిజర్వాయర్‌ను జల్లెడపట్టాయి. రిజర్వాయర్‌లో ఆత్మహత్యకు పాల్పడిఉంటే మృతదేహాలు లభించేవని పోలీసులు పేర్కొంటున్నారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్టు భావించేలా సూసైట్‌నోట్ రాసి ఎక్కడికైనావెళ్లారా.? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గాలింపుచర్యలను పర్యవేక్షించారు.

చెరువులో మునిగి మత్స్యకారుడి మృతి



గడ్డం అశోక్(ఫైల్)


నర్సంపేట రూరల్: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలో గడ్డం అశోక్ (34) అనే మత్స్యకారుడు శుక్రవారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. తాపీమేస్త్రిగా పని చేస్తున్న అశోక్ మరో ఇద్దరితో కలిసి శివారులోని దామెర చెరువులో చేపలకు వెళ్లాడు. చేపలు పడుతుండగా వల తట్టుకుని నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు.

ఐఐటీ విద్యార్థి బలవన్మరణం

హాస్టల్ భవనంపైనుంచి దూకి ఆత్మహత్య

సంగారెడ్డి రూరల్: అనుకున్న లక్ష్యాలు నెరవేరకపోవడతో మనస్తాపం చెందిన ఐఐటీ విద్యార్థి భవనంపై నుంచి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్ తిరుమలగిరికి చెందిన అనిరుద్య(23) సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీలో మెకానికల్ అండ్ ఏరోస్పేస్ విభాగంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కాగా గురువారం అర్ధరాత్రి అతడి స్నేహితుడు కన్షిక్‌రెడ్డికి ఈమెయిల్ పంపి ఆ వెంటనే హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తోటి విద్యార్థులు హుటాహుటిన అతడిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గోవాలో సిరిసిల్లవాసి మృతి



అంజిరెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన పొన్నాల అంజిరెడ్డి (52) గోవా బీచ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. వెంకటాపూర్‌కు చెందిన మరో నలుగురితో కలిసి అంజిరెడ్డి ఐదురోజుల కిందట గోవా టూర్‌కు వెళ్లాడు. గురువారం మిత్రుడు వెంకటేశ్‌తో కలిసి బీచ్‌కు వెళ్లాడు. అలలువేగంగా తాకడంతో అంజిరెడ్డి బోర్లాపడగా ముఖం ఇసుకలో కూరుకుపోయింది. ఆ వెంటనే గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

నెల రోజుల్లో 'భగీరథ' పనులు పూర్తి

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి



శుక్రవారం మహబూబ్‌నగర్‌లో అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నెలరోజుల్లో మిషన్ భగీరథ పనులు పూర్తిచేసి పట్టణంలోని వార్డుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పబ్లిక్ హెల్త్ ఈఎన్ సీథన్‌సింగ్‌తోకలిసి మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ట్యాంకులను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, పబ్లిక్‌హెల్త్ మున్సిపల్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో 14 ట్యాంక్‌ల నిర్మాణపనులు పూర్తవుతున్నాయన్నారు. నిజామాబాద్, నల్లగొండ, నాగ్‌పూర్, పూణే, బెంగాల్, పంజాబ్‌ల నుంచి 300 మంది నిపుణులు శనివారం నుంచి అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేక బృందాలు ఈ నెల 28 వరకు పనులు పర్యవేక్షిస్తారన్నారు. పట్టణంలో 310 కిలో మీటర్ల పైప్‌లైన్ ఉండగా, ఇప్పటికి 288 కిలో మీటర్ల పైప్‌లైన్ పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ దేవానంద, మున్సిపల్ కమిషనర్ సురేందర్, పబ్లిక్ హెల్త్ ఈఈ రమణమూర్తి, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, డీఈలు, ఏఈ ఉన్నారు.

'కాళేశ్వరం' పనుల్లో వేగం పెంచాలి


■ పెద్దపల్లి జిల్లా వేనూరు ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్లు శ్రీదేవసేన, సర్ఫరాజ్



నంది మేడారం 7వ ప్యాకేజీ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీదేవసేన

ధర్మారం: కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లు శ్రీ దేవసేన, సర్ఫరాజ్ ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం వేనూరు వద్ద కొనసాగుతున్న పనులను శుక్రవారం వేర్వేరుగా పరిశీలించారు. శ్రీదేవసేన ఆరోప్యాకేజీలోని అండర్ టన్నెల్ నుంచి నంది మేడారం చేరుకొని అక్కడి అండర్‌టన్నెల్, సర్జిపూల్, పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఏడో ప్యాకేజీని సందర్శించి, మల్లాపూర్ శివారులోని అండర్ టన్నెల్ పనులను ప్రాజెక్ట్ సీఈ నల్ల వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఆరో ప్యాకేజీలో పనుల పురోగతిపై ఆరా తీశారు. మరోవైపు కాళేశ్వరం 7, 8వ ప్యాకేజీలోని పలురకాల పనులను కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రూ.5 లక్షలదాకా పన్నుండదు



శ్లాబులు మారలేదు.. ఆదాయాన్ని ఆదా చేస్తేనే లబ్ధి
మధ్యతరగతి, వేతనజీవులకు ఊరట
మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన ఆర్థికమంత్రి గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికలకు ముందు సర్వజనాకర్షక బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది మోదీ సర్కారు. మధ్యతరగతి వర్గాలకు, ముఖ్యంగా వేతన జీవులకు భారీ ఊరటనిస్తూ ఆదాయం పన్ను (ఐటీ) మినహాయింపు పరిమితిని రెట్టింపు చేసింది. తద్వారా గత నాలుగేండ్లుగా వస్తున్న డిమాండ్లను చివరి ఏడాది మధ్యంతర బడ్జెట్‌లో నెరవేర్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను శుక్ర వారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించిన బడ్జెట్‌లో సగటు పన్ను చెల్లింపుదారులను ఆకట్టుకునే ప్రకటనలే ఉన్నాయి. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు దిగువన ఉన్నవారికే ఆదాయం పన్ను నుంచి మినహాయింపున్నది. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచారు. సెక్షన్ 87ఏ కింద పూర్తిస్థాయి పన్ను రిబేటునిచ్చారు. దీనివల్ల ఖజానాకు ఏటా రూ.18,500 కోట్ల ఆదాయం దూరం కానున్నది. రూ.5 లక్షలకు మించి వార్షిక ఆదాయం ఉన్నవారు ఇప్పుడున్న శ్లాబులు, రేట్ల ప్రకారమే పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

రూ.6.50 లక్షలున్నా..

వార్షిక ఆదాయం రూ.6.50 లక్షల వరకున్నవారు కూడా ఐటీ నుంచి మినహాయింపు పొందవచ్చని, పీపీఎఫ్ వంటి సేవింగ్స్‌లో రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులతో ప్రయోజనం అందుకోవచ్చని గోయల్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ నిర్ణయం 3 కోట్ల మంది స్వయం ఉపాధి కలిగిన, సీనియర్ సిటిజన్లకు లాభిస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా పెన్షన్, మెడిక్లెయిముల్లో పెట్టుబడులకు ఊతమివ్వగలదన్నారు. కాగా, స్టాండర్డ్ డిడక్షన్‌ను కూడా రూ.40,000 నుంచి 50,000లకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దీనివల్ల కూడా 3 కోట్ల మంది వేతన జీవులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

డిపాజిట్ల వడ్డీపై..

ఇక బ్యాంక్, పోస్టాఫీస్ డిపాజిట్లపై ఏటా పొందే వడ్డీ ఆదాయంలో రూ.40,000 వరకు పన్ను చెల్లించనక్కర్లేదని తాజా బడ్జెట్‌లో గోయల్ వరమిచ్చారు. ప్రస్తుతం ఈ మినహాయింపు రూ.10,000 వరకే ఉండటం గమనార్హం. ఈ నిర్ణయంతోనూ కోట్లాది మందికి లబ్ధి చేకూరనుండగా, బ్యాంకులు, తపాలా శాఖల్లో సురక్షిత పెట్టుబడులకు దోహదం చేయగలదని అటు ప్రభుత్వం, ఇటు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే గ్రాట్యుటీని రూ.10 లక్షలకు మించి అందుకున్నవారికి ఊరటనిచ్చిన కేంద్రం.. రూ.20 లక్షల వరకు పన్ను మినహాయింపునిచ్చారు.

నిర్మాణ రంగానికి జోష్

రియల్ ఎస్టేట్ డెవలపర్ల కోసం రెండేండ్లకుగాను అమ్ముడుకాని హౌజింగ్ యూనిట్ల నోషనల్ రెంటుపై పన్ను మినహాయింపును బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే నివాస గృహంపై పెట్టిన పెట్టుబడి నుంచి పొందే మూలధన లాభాల పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని ఇప్పుడు ఒకటి నుంచి రెండిండ్లకు పెంచారు. అయితే ఇలా వచ్చే లాభం రూ.2 కోట్లకు మించరాదు. అంతేగాక జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే ఈ మినహాయింపు లభిస్తుంది. ఇక వేర్వేరు చోట్ల అద్దెకుంటున్న వారికీ బడ్జెట్‌లో లాభం చేకూర్చారు. రెండు చోట్ల ఇండ్లను అద్దెకు తీసుకున్నవారు.. ఆ అద్దెల మొత్తాన్ని పన్ను మినహాయింపుల్లో పొందవచ్చు. అలాగే అద్దెపై టీడీఎస్ పరిమితి రూ.1.80 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెంచారు.

గెలిస్తే మరిన్ని ప్రయోజనాలు

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ తమ ప్రభుత్వానికే పట్టం కడితే పన్ను మరిన్ని ప్రయోజనాలను కల్పిస్తామని పీయూష్ గోయల్ ఈ సందర్భంగా సంకేతాలిచ్చారు. ప్రస్తుతం రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారికే ఐటీ మినహాయింపులను కల్పించామని, ఎన్నికల తర్వాత తిరిగి అధికారంలోకి వస్తే ఆపై ఆదాయం ఉన్నవారికీ లబ్ధి చేకూరుస్తామని పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ గోయల్ స్పష్టం చేశారు.

ఎవరేమన్నారు?

సమాజంలో మెజారిటీ వర్గాల ఆశలు నెరవేరాయి
-చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్

కోట్లాదిమంది మధ్యతరగతి ప్రజలకు, చిన్న వ్యాపారులకు ఊరట
-గౌతమ్ అదాని, అదాని గ్రూప్ చైర్మన్

మధ్యతరగతి, రైతాంగానికి లాభం చేకూరింది
-ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్

లక్ష గ్రామాలకు డిజిటల్ పరిధిలోకి తీసుకురానుండటంతో టెక్నాలజీ సేవలకు మరింత డిమాండ్ నెలకొననున్నది. కృత్రిమ మేధస్సును పెంపొందించడానికి జాతీయ సెంటర్‌ను ఏర్పాటు చేయడం మంచి పరిణామం.
-బీవీఆర్ మోహన్ రెడ్డి, సైయెంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్

అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం
-సంజీవ్ పూరి, ఐటీసీ ఎండీ

అన్ని వర్గాలు మెచ్చే బడ్జెట్
-సునీల్ దుగ్గల్, డాబర్ ఇండియా సీఈవో

ఎఫ్ఎంసీజీ రంగాభివృద్ధికి దోహదం
-వివేక్ గంభీర్, గోద్రెజ్ కన్జ్యూమర్ ఎండీ

బీమా రంగానికి దన్ను
-భార్గవ్ దాస్ గుప్తా, ఐసీఐసీఐ లాంబార్డ్

ఇక అందరికీ ఆరోగ్య, జీవిత బీమా
-పంకజ్ రజ్దాన్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్

అన్ని రంగాలకు ప్రాధాన్యం
-అన్నుమన్ మ్యాగజైన్, సీబీఆర్ఈ ఇండియా

ఆరోగ్య భారత్‌ను తీర్చిదిద్దే విధంగా ఉన్నది. గ్రామీణులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నది.
- సంగీతా రెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ ఎండీ

డిజిటల్, పునరుత్పాదక విద్యుత్‌తో దేశ ఆర్థిక వ్యవస్థ నూతన పుంతలు తొక్కనున్నది.
- సీపీ గుర్నానీ, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో

సన్నకారు రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేక స్కీంను ప్రకటించడం స్వాగతించతగినది. మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని రూ.5 లక్షల వరకు పన్ను రాయితీ కల్పించారు.
- రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్

పన్ను రాయితీల మతలబు ఇదే



అదిల్ శెట్టి

ఈ మధ్యంతర బడ్జెట్‌కు ముందు మధ్యతరగతి వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ఈసారి లాభాలను చేకూర్చగలదన్న అంచనాలు వ్యక్తమయ్యాయి. అందుకు అనుగుణంగానే కొత్త ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించినవి కొన్ని స్వాగతించదగిన విధంగానే ఉన్నాయి. ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేస్తున్నామని ప్రకటించినా.. శ్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో తాజా బడ్జెట్‌తో అల్పాదాయ వర్గాలకు మాత్రమే ప్రయోజనం కలిగినట్లైంది. లోతుగా గమనిస్తే ఆదాయం పన్నుపై రిబేటు మాత్రమే మారిందని చెప్పవచ్చు. ఉదాహరణకు మీ స్థూల ఆదాయం రూ.6.5 లక్షలైతే.. రూ.1.5 లక్షల వరకు పీపీఎఫ్ వంటి పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు పెట్టుకోవచ్చు. తద్వారా మీ వార్షిక ఆదాయాన్ని రూ.5 లక్షలకు తగ్గించుకోవచ్చు. దీంతో మీకు పన్నులు వర్తించవు. ఈ కొత్త రిబేటు గరిష్ఠంగా రూ.12,500. అంటే ఇప్పుడున్న శ్లాబుల ప్రకారం వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు దాటితే.. రూ.5 లక్షల వరకు పడుతున్న పన్ను మొత్తం అన్నమాట. ఇదిలావుంటే ట్యాక్స్ సేవింగ్స్‌ల్లో పెట్టుబడుల తర్వాత కూడా ఒకవేళ మీ ఆదాయం రూ.5 లక్షలకుపైగా ఉంటే.. మీకు ఈ రిబేటు రూపాయి కూడా రాదు. అంతేగాక శ్లాబుల ప్రకారం పన్నులు చెల్లించాల్సిందే. ఒక్కమాటలో చెప్పాలంటే మీ ఆదాయం రూ.6.50 లక్షలకు మించి ఒక్క రూపాయి ఉన్నా.. మునుపటిలాగే రూ.2.50 లక్షలు మించి ఉన్న మొత్తం ఆదాయానికి పన్నులు చెల్లించాల్సిందే. కాబట్టి అల్పాదాయ వర్గాలకు మాత్రమే ఈ నిర్ణయం ప్రోత్సాహకరం. ఇక స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.40,000 నుంచి 50,000లకు పెంచడంతో అదనంగా రూ.3,000 లాభం రానున్నది. అలాగే నిర్మాణ రంగంపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి ఎలాంటి మినహాయింపులు లేవు. దీంతో నిర్మాణ రంగం, ఇండ్ల కొనుగోలుదారులకు ఈ బడ్జెట్ పెద్ద ప్రయోజనాలను అందించలేదనే చెప్పొచ్చు. నిర్మాణ వ్యయం మితిమీరిన నేపథ్యంలో జీఎస్టీ భారం తగ్గాలని అటు రియల్టర్లు, ఇటు కొనుగోలుదారులు కోరుకున్నారు. కానీ వారి ఆశలు నెరవేరలేదు. అయితే వచ్చే ఏడాది మార్చి 31దాకా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ప్రయోజనాలను పొడిగించడం స్వాగతించదగ్గ పరిణామం. దీనివల్ల ఇండ్ల కొనుగోలుదారులకు కొంత ఊరటనే దక్కిందని అనుకోవచ్చు. స్థూలంగా చెప్పాలంటే ఈ బడ్జెట్ సీనియర్ సిటిజన్లకు, రైతులకు, అసంఘటిత కార్మికులకు లబ్ధి చేకూర్చింది.



పదిలక్షలపై పన్నుసున్నా ఇలా..

నరేంద్ర మోదీ సర్కార్ సామాన్యులనే కాదు..మధ్యతరగతి ప్రజలను కూడా కరుణించింది. సంవత్సరానికి రూ.5 లక్షల లోపు ఆదాయం కలిగిన వారు పన్ను రిబేట్ పొందవచ్చునని వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దీంతో పాటు రూ.6.5 లక్షల లోపు అర్హత కలిగిన పెట్టుబడులపై ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపు పొందవచ్చును. రూ.10 లక్షల వరకు సంపాదించిన వారు ఐటీ నుంచి మినహాయింపు పొందే అవకాశం కూడా ఉన్నది. ప్రస్తుత ఉన్న ఈ అవకాశాలను ఈ క్రింది పట్టికలో పరిశీలిద్దాం..

	మొత్తం ఆదాయం	అన్ని మార్గాల నుంచి వచ్చిన ఆదాయం	రూ.10,00,000
మినహాయింపు	ప్రామాణిక మినహాయింపు	16(ఐఏ) సెక్షన్ కింద తప్పనిసరిగా మినహాయింపు	రూ.50,000
	80సీ మినహాయింపు	గృహ రుణాలు, జీవిత బీమా, ఈఎల్ఎస్ఎస్, ఎన్ఎస్‌సీ, పీపీఎఫ్, ఈపీఎఫ్, మిగతా సంస్థగత పెట్టుబడులపై	రూ.1,50,000
	80డీ మినహాయింపు	60 ఏండ్లలోపు తల్లిదండ్రులకు వ్యక్తిగత ఆరోగ్య బీమా (రూ.25,000*2)	రూ.50,000
	ఎన్‌పీఎస్ మినహాయింపు	80సీసీడీ(1బీ) సెక్షన్ కింద చెల్లించేవారికి	రూ.50,000
	24బీ మినహాయింపు	గృహ రుణాలపై చెల్లించే గరిష్ఠ స్థాయి వడ్డీరేటు	రూ.2,00,000
పన్ను	పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం	అన్ని మినహాయింపులు పోను మిగిలిన ఆదాయం	రూ.5,00,000
	అసలు చెల్లించాల్సిన పన్ను	రూ.2.5లక్షల నుంచి రూ.5 లక్షలపై 5 శాతం	రూ.12,500
	రిబేట్	87ఏ సెక్షన్ కింద	రూ.12,500
	చెల్లించాల్సిన పన్ను	అసలు చెల్లించాల్సిన పన్ను - రిబేట్	రూ.00

- అదిల్ శెట్టి, బ్యాంక్‌బజార్.కామ్ సీఈవో

స్వాగతించిన ఎఫ్టాప్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 1: నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్టాప్సీ) స్వాగతించింది. వ్యవసాయ రంగానికి ఇప్పటికే పెద్దపీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు ఆర్థికంగా చేయూతనివ్వడానికి ప్రతియేటా రూ.6 వేల సహాయం ప్రకటించడం శుభసూచికమని ఎఫ్టాప్సీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కరుణేందర్ జాస్తి తెలిపారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.8 వేల చొప్పున ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్దిపొందనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆదాయ పన్ను పరిమితిని రెండింతలు పెంచడంతో సామాన్యులకు, వేతన జీవులకు భారీ ఊరట లభించినట్లు అయిందన్నారు. అలాగే రూ.6.5 లక్షల వరకు క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను విధించకపోవడంతో పెట్టుబడులకు ఊతమిచ్చినట్లు అవుతుందన్నారు. లక్ష గ్రామాలను డిజిటల్ పరిధిలోకి తీసుకురావాలనే నిర్ణయం టెక్నాలజీ సేవలకు మరింత డిమాండ్ నెలకొననున్నదని, తద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సంఘటిత కార్మికులతో పాటు అసంఘటిత కార్మికులకు కూడా పెన్షన్ అందించే బృహత్ కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టడం మంచిదని, తద్వారా పదవీ విరమణ చేసిన నాటి నుంచి నెలకు రూ.3 వేల చొప్పున పెన్షన్ రానుండటంతో వారికి ఆర్థికంగా చేయూతనిచ్చినట్లు అవుతున్నదని ఆయన పేర్కొన్నారు. పోస్టాఫీసుల్లో డిపాజిట్లపై విధించనున్న టీడీఎస్‌ను రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు పెంచడం పొదుపును ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. అమ్ముడిపోని ఇండ్లపై విధించే పన్ను కాలపరిమితిని ఏడాదికి బదులు రెండేండ్లకు పెంచడం రియల్ ఎస్టేట్ రంగానికి కలిసివచ్చే అంశమని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో జరుగబోతున్న సార్వత్రిక ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు అనిపిస్తున్నదని ఇతర పారిశ్రామిక వర్గాలు పేర్కొన్నారు. సామాన్యుడి పరంగా చూస్తే ఇది చాలా మంచి బడ్జెట్..కానీ పారిశ్రామిక పరంగా చూస్తే ఇది చెత్త బడ్జెట్ అని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఇండస్ట్రీ వర్గాలు ఇచ్చిన విజ్ఞప్తులను అసలు పట్టించుకోలేదని, ముఖ్యంగా పలు రాయితీలు ఇవ్వాలని కోరుకున్నప్పటికీ పెడచెవిన పెట్టారని పలువురు విమర్శించారు.

జీఎస్టీ లక్ష్యం 7.61 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో కేంద్రానికి దక్కేది రూ.7.61 లక్షల కోట్లపైనే ఉండాలని మోదీ సర్కారు నిర్దేశించుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో రూ.7.43 లక్షల కోట్లకుపైగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. దాన్ని రూ.6.43 లక్షల కోట్లకు సవరించింది. పన్నుల తగ్గింపు, మినహాయింపుల మధ్యే ఈ మేరకు మార్పు చేయడం జరిగింది. ఈ క్రమంలోనే ఈసారి జీఎస్టీ వసూళ్ల లక్ష్యాన్ని గతంతో పోల్చితే స్వల్పంగానే పెంచింది సర్కారు. ఇక కేంద్ర, రాష్ర్టాల జీఎస్టీ వసూళ్లు 2018-19లో రూ.13.48 లక్షల కోట్లుగా ఉంటాయని నిరుడు బడ్జెట్‌లో అంచనా వేశారు. అయితే ఏప్రిల్-జనవరి మధ్య వసూళ్లు రూ.9.71 లక్షల కోట్లుగానే ఉన్నాయి. ఈ మార్చి 31తో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిపోతుండగా, లక్ష్య సాధన అసాధ్యమే అవుతున్నది. ఇదిలావుంటే జీఎస్టీ సగటు నెలసరి వసూలు రూ.97,100 కోట్లకు చేరుకున్నదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

అదుపు తప్పిన ద్రవ్యలోటు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు అదుపు తప్పే అవకాశాలు కనిపిస్తున్నాయని గోయల్ పేర్కొన్నారు. 2018-19లో 3.4 శాతంగా ఉంటుందని అంచనావేసినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో దీనిని మించి నమోదుకానున్నదని తెలిపారు. అయినప్పటికీ వచ్చే ఏడాది మాత్రం జీడీపీలో ద్రవ్యలోటును 3.4 శాతానికి కట్టడిచేసేదానిపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. రైతులను ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది రూ.20 వేల కోట్ల నిధులను(సవరించబడిన అంచనా), వచ్చే ఏడాది రూ.75 వేల కోట్ల(సవరించబడిన అంచనా) నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించారు.

పీసీఏ ఆంక్షల నుంచి విముక్తి

బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలకు ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) నిబంధనల నుంచి విముక్తి లభించింది. ఈ మేరకు బడ్జెట్ సందర్భంగా గోయల్ వెల్లడించారు.

జోరుగా ప్రత్యక్ష పన్ను వసూళ్లు

ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) బడ్జెట్ అంచనాకు మించి ప్రత్యక్ష పన్ను వసూళ్లు జరిగాయి. నిరుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.11.50 లక్షల కోట్లుగా ప్రత్యక్ష పన్ను వసూళ్లను అంచనా వేసినప్పటికీ.. రూ.12 లక్షల కోట్లకు చేరాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను రూ.13.80 లక్షల కోట్ల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నది కేంద్రం.

అప్పు రూ.4.48 లక్షల కోట్లు

వచ్చే ఏడాది కేంద్ర ప్రభుత్వం అప్పులు మరింత పెరుగనున్నాయి. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.4.48 లక్షల కోట్ల మేర అప్పు చేయాల్సి ఉంటుందని గోయల్ తెలిపారు. వచ్చే రెండు నెలల్లో ముగియనున్న ఏడాదిలో చేయనున్న రూ.4.47 లక్షల కోట్లతో పోలిస్తే ఎక్కువ కానున్నది. సవరించిన అంచనా ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.4.07 లక్షల కోట్ల మేర అప్పు చేయాల్సి ఉందని ప్రకటించగా, కానీ ప్రస్తుతం ఇది రూ.4.47 లక్షల కోట్లకు చేరుకోనున్నదని అంచనా. గతంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లింపులు కలుపుకొని మొత్తం అప్పు రూ.7.1 లక్షల కోట్లకు చేరుకోనున్నది. గతంలో తీసుకున్న రుణాల్లో వచ్చే ఏడాది రూ.2.36 లక్షల కోట్ల మేర చెల్లింపులు జరుపనున్నట్లు గోయల్ తెలిపారు.

రూ.1.30 లక్షల కోట్ల నల్లధనం వెలుగులోకి



నల్లధనం వెలికితీతలో భాగంగా తీసుకున్న చర్యలతో దాదాపు రూ.1.30 లక్షల కోట్లు వెలుగులోకి వచ్చాయని శుక్రవారం గోయల్ బడ్జెట్ సందర్భంగా స్పష్టం చేశారు. రూ.1.30 లక్షల కోట్ల అప్రకటిత ఆదాయం పన్ను పరిధిలోకి వచ్చిందని వివరించారు. మరో రూ.50,000 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం, జప్తు చేశామన్నారు. పాత పెద్ద నోట్ల రద్దు సహా పలు సంస్కరణలతో పెద్ద ఎత్తున నగదు నిల్వలు చేసినవారిపై ఉక్కుపాదం మోపామని గుర్తుచేశారు. రూ.6,900 కోట్ల విలువైన బినామీ ఆస్తులు, 1,600 కోట్ల విలువైన విదేశీ ఆస్తులు జప్తు చేశామన్నారు. అంతేగాక 3,38,000 షెల్ కంపెనీలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లను తొలగించామని చెప్పారు.

ఆర్బీఐ మధ్యంతర డివిడెండ్ రూ.28 వేల కోట్లు!



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను మధ్యంతర డివిడెండ్ కింద రిజర్వు బ్యాంక్ మరో రూ.28 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. ఇప్పటికే ఈ ఏడాది ఆర్బీఐ రూ.40 వేల కోట్ల నిధులను చెల్లించినట్లు బడ్జెట్ సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ రూపంలో రూ.50 వేల కోట్లు చెల్లించిన రిజర్వు బ్యాంక్..మధ్యంతర డివిడెండ్ కింద మరో రూ.10 వేల కోట్లను చెల్లించింది.

అదుపులో ద్రవ్యోల్బణం



గత ప్రభుత్వాల భారిన పడి ఇబ్బందులు ఎదుర్కొన్న సామాన్యుడు, మధ్యతరగతి వారిని అన్ని రకాలుగా ఆదుకున్నామని, ముఖ్యంగా రెండంకెల స్థాయిలో దూసుకుపోయిన ద్రవ్యోల్బణాన్ని 4.6 శాతం స్థాయిలో కట్టడి చేయగలిగామని పీయూష్ గోయల్ స్పష్టంచేశారు. 2009-14 మధ్యకాలంలో సరాసరి ద్రవ్యోల్బణ సూచీ 10.1 శాతం స్థాయిలో కదలాడినట్లు వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడంలో గత ప్రధాని(మన్మోహన్ సింగ్) విఫలమయ్యారని, కానీ మేము దీనిని ఆధీనంలోకి తీసుకురాగలిగినట్లు చెప్పారు.

500 పాయింట్ల ఒడిదుడుకులు
చివరికి 212 పాయింట్ల లాభంతో సెన్సెక్స్
దేశీయ స్టాక్ మార్కెట్‌ను పరుగెత్తించిన ఆటో, వినియోగరంగ షేర్లు

మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనలతో తీవ్ర ఒడిదుడుకుల నడుమ ట్రేడ్ అయిన స్టాక్ మార్కెట్ చివరికి లాభాల్లో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ దాదాపు 500 పాయింట్ల మేర హెచ్చుతగ్గులకు లోనై చివరకు 212.74 పాయింట్ల లాభంతో ముగిసింది. నిఫ్టీ కూడా 62.70 పాయింట్ల లాభంతో 10,893.65 వద్ద స్థిరపడింది. వ్యవసాయరంగానికి , మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చే చర్యలను ప్రకటించడంతో కన్జ్యూమర్, ఆటో మొబైల్ రంగాల షేర్లు భారీ లాభాలతో ముగిశాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ. 5 లక్షలకు పెంచడంతో పాటు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ. 50 వేలకు పెంచడంతో వినియోగం పెరుగుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ద్రవ్యలోటును 3.4 శాతానికి పరిమితం చేయడంతో ప్రభుత్వ వ్యయాలు అదుపులో ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం అవుతున్నది.

ఎస్‌బీఐ లాభం రూ.4,709 కోట్లు

ముంబై, ఫిబ్రవరి 1: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఎట్టకేలకు లాభాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలలకాలంలో బ్యాంక్ రూ.4,709.15 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి రూ.1,886.57 కోట్ల నష్టాన్ని చవిచూసింది. సమీక్షకాలంలో ఆదాయం రూ.74,190.87 కోట్ల నుంచి రూ.84,350.11 కోట్లకు ఎగబాకినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. గడిచిన త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) విలువ అడ్వాన్స్‌లో 8.71 శాతానికి తగ్గడం లాభాల్లోకి రావడానికి ప్రధాన కారణమని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. గతేడాది ఇది 10.35 శాతంగా ఉన్నది. నికర ఎన్‌పీఏ 5.61 శాతం నుంచి 3.95 శాతానికి పరిమితమైంది. విలువ పరంగా చూస్తే స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.1,87,765 కోట్లకు తగ్గగా, నికర ఎన్‌పీఏ రూ.80.944 కోట్లకు చేరుకున్నాయి. మొండి బకాయిలను వసూలు చేయడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం, దివాలా చట్టం కింద చర్యలను వేగవంతం చేయడం సత్ఫలితాలను ఇచ్చిందని బ్యాంక్ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు రూ.14,143.74 కోట్లకు తగ్గడం లాభాల్లోకి రావడానికి ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు.

రెడ్డీస్ లాభంలో 45 శాతం వృద్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 1: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా ఉత్పత్తుల సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరిస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.485 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నమోదైన రూ.334 కోట్లతో పోలిస్తే 45 శాతం పెరుగుదల కనబరిచింది. సమీక్షకాలంలో ఆదాయం కేవలం ఒక్కశాతం మాత్రమే పెరిగి రూ.3,850 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, సీఎఫ్‌వో సౌమెన్ చక్రవర్తి తెలిపారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకోవడం, నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడం లాభాలు పెరుగడానికి దోహదం చేశాయన్నారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఉన్న ప్లాంట్లో తయారైన ఔషధాలకు డిమాండ్ నెలకొనడం కలిసొచ్చిందని చెప్పారు. ఉత్తర అమెరికా మార్కెట్లోకి నూతన ఔషధాలను విడుదల చేసినప్పటికీ అక్కడి ఆదాయంలో గండిపడిందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. సమీక్షకాలంలో ఉత్తర అమెరికా నుంచి రూ.1,480 కోట్ల ఆదాయం సమకూరగా, ఇండియా నుంచి రూ.670 కోట్లు, యూరప్ నుంచి రూ.200 కోట్లు లభించాయి.



2,216.92 కోట్లు

వచ్చే ఏడాది టోక్యోలో ఒలింపిక్స్ జరుగనున్న నేపథ్యంలో క్రీడల శాఖకు అదనంగా రూ.214.20 కోట్లను కొత్త బడ్జెట్‌లో కేంద్రం కేటాయించింది. గతేడాది క్రీడల బడ్జెట్ రూ.2002.72 కోట్లు కాగా.. పెంపుతో రూ.2,216.92 కోట్లకు చేరింది.

450 కోట్లు

ఈ ఏడాదికి గాను సాయ్‌కు అదనంగా రూ.55 కోట్లు కేటాయించారు. గతేడాది సాయ్ కేటాయింపులు రూ.395 కోట్లు.

601 కోట్లు

'ఖేలో ఇండియా' కార్యక్రమానికి ఈ ఏడాదీ పెద్దపీట దక్కింది. గతేడాది రూ.550.69 కోట్లను కేటాయించిన కేంద్రం ఈ ఏడాదికిగాను కూ.50.31 కోట్లను అదనంగా కేటాయించింది.

క్రీడలశాఖ

- భారత్‌లో క్రీడల మౌళికవసతుల కల్పన కోసం ఎన్‌డీఎస్‌ఎఫ్ పద్దును రూ.2కోట్ల నుంచి రూ.70 కోట్లకు పెంచింది.
- క్రీడాకారుల ప్రోత్సాహకాలను రూ.63 కోట్ల నుంచి రూ.89 కోట్లకు పెంచారు.
- క్రీడాకారులకు అవార్డులు, ప్రత్యేక పురస్కారాల కోసం అదనంగా మరో రూ.94.07 కోట్లను ఆర్థికమంత్రి గోయల్ ప్రకటించారు.



దోసా వాలీ

కెరీర్‌లో 200వ వన్డే ఆడిన మిథాలీ ▪ తొలి మహిళా క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు

రెండు దశాబ్దాల కెరీర్ పూర్తి చేసుకున్న నాలుగో క్రికెటర్

భారత మహిళల క్రికెట్‌లో ఇప్పటివరకు 263 వన్డేలు జరిగితే.. ఇందులో మిథాలీ రాజ్ ఆడిన మ్యాచ్‌ల సంఖ్య 200.. ఈ ఒక్క గణాంకం చాలు.. మహిళల క్రికెట్‌లో ఆమె పాత్ర ఏంటో చెప్పడానికి..! ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడున్న మహిళా క్రికెటర్లతో పోలిస్తే సుదీర్ఘమైన కెరీర్ ఈ హైదరాబాదీ సొంతం. లెక్కేసి పక్కాగా చెప్పాలంటే.. క్రికెటర్‌గా ఆమె ప్రస్థానం.. భారత మహిళల క్రికెట్ పురోగమనం సమాంతరంగా సాగాయి. 16 ఏండ్ల వయసులో ధరించిన టీమ్ఇండియా జెర్సీని.. పురుష క్రికెటర్లతో సమానంగా.. రెండు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న మిథాలీ ఆటకే ఓ అందం. ఆమె ఆడటమే ఓ అద్భుతం.. అందుకే క్రికెట్‌లో ఆమె అందుకోని ఘనతలు లేవు.. కొల్లగొట్టని రికార్డులూ లేవు. వన్డే కెరీర్‌లో 200ల మ్యాచ్‌తో ప్రపంచ రికార్డును కొల్లగొట్టి తన కీర్తి సామ్రాజ్యాన్ని మరింతగా విస్తరించుకున్న మిథాలీకి సలామ్ కొట్టాల్సిందే..!



కేక్ కట్ చేస్తున్న మిథాలీ

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ప్రపంచంలో మహిళల క్రికెట్ గురించి మాట్లాడాల్సి వస్తే.. హైదరాబాద్ స్టార్ ప్లేయర్ మిథాలీ రాజ్ పేరు లేకుండా మాట్లాడటం సాధ్యంకాదేమో..! ఆటతో అంతలా పెనవేసుకుపోయిన బంధం ఆమెది. ఆ బంధంలో ఎన్నో ఎత్తుపల్లాలు.. మరెన్నో ఒడిదుడుకులు.. కానీ ఏనాడూ వాటిని లెక్కచేయలేదు. 1999లో ఓ 16 ఏండ్ల స్కూల్ అమ్మాయి బ్యాట్ పడితే విమర్శించిన వాళ్లే ఎక్కువ. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తానంటే ముసిముసి నవ్వులు నవ్విన వాళ్లే ఎక్కువ. కానీ ఇవేమీ తన ఆటకు, తన ఎదుగుదలకు అడ్డంకి కాలేదని నిరూపించింది మిథాలీ తాజాగా మరో అరుదైన ఘనతను అందుకుంది.

మహిళ క్రికెట్‌లో మ్యాచ్‌ల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. ఒక్క సిరీస్ ఆడిందంటే మరో సిరీస్‌కు జట్టులో చోటు ఉంటుందో లేదో కూడా తెలియని పరిస్థితి. అంగబలం, ఆర్థిక బలం బాగా ఉంటే మహా అయితే 100, 120 మ్యాచ్‌లు ఆడితేనే గొప్ప కెరీర్‌గా ఊహించుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మన మిథాలీ ఏకంగా 200 వన్డేలు ఆడేసింది. ప్రపంచ మహిళల క్రికెట్‌లో ఇది ప్రపంచ రికార్డు. గతంలో ఎవరూ ఈ ఘనత సాధించలేదు. శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డే సందర్భంగా అరుదైన ఫీట్‌ను అందుకున్న తొలి క్రికెటర్‌గా మిథాలీ రికార్డులకెక్కింది. భారత మహిళల క్రికెట్‌లో ఇప్పటివరకు 263 వన్డేలు జరిగితే ఇందులో 70 శాతం మ్యాచ్‌ల్లో ఆమె బరిలోకి దిగడం మరో ఘనత.

అత్యధిక పరుగుల రారాణి

అందంతోనే కాదు.. ఆటతోనూ ప్రపంచ క్రికెట్ అభిమానులను మంత్రముగ్ధులను చేసే మిథాలీ.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడటంలోనూ దిట్టే. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లాంటి మేటి జట్లపై.. భారత్‌కు ఒంటిచేత్తో విజయాలు అందించింది. అందుకే తన కెరీర్‌తో పాటు భారత మహిళల క్రికెట్ ప్రస్థానాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లింది. 1978లో మొదలైన భారత వన్డే క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేకంగా ఓ పేజీని లిఖించుకుంది. మిథాలీ కంటే ముందు జార్జి బెనర్జీ, నీలిమా, రునా బసు, లోప ముద్ర భట్టాచార్య, డయానా ఎడుల్జీ, అంజుమ్ చోప్రా, పూర్ణిమా చౌదరిలాంటి 55 మంది క్రికెటర్లు అరంగేట్రం చేసినా.. ఆటపై తనలా ముద్ర వేసిన వారు లేరంటే అతిశయోక్తి కాదు. మౌలిక వసతులు లేకపోయినా.. ఆర్థికంగా ఆదుకునే వారు లేకపోయినా... సహజసిద్ధమైన తన నైపుణ్యానికి మెరుగులు పెట్టుకుంటూ పరుగుల వరద పారించింది. అందుకే 50 ఓవర్ల ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రారాణిగా రికార్డు పుటల్లో చోటు సంపాదించింది. 36 ఏండ్ల మిథాలీ 200ల వన్డేల్లో 51.33 సగటుతో 6622 పరుగులు చేసి తొలి స్థానంలో నిలిచింది. ఇందులో 7 సెంచరీలు, 52 అర్ధసెంచరీలు చేసింది. 51సార్లు నాటౌట్‌గా నిలువడంతో పాటు 6సార్లు డకౌటయ్యింది. అప్పుడప్పుడు బౌలింగ్‌కు దిగే ఈ హైదరాబాదీ 8 వికెట్లు కూడా తీసింది. ఇక 2002లో టెస్ట్ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన మిథాలీ 10 మ్యాచ్‌లు ఆడింది. 51 సగటుతో 663 పరుగులు చేసింది. బరిలోకి దిగిన మూడో టెస్ట్‌లోనే ఇంగ్లండ్‌పై 214 పరుగులు చేసి ప్రపంచ రికార్డును నెలకొల్పింది. 85 టీ20ల్లో 37.42 సగటుతో 2283 పరుగులు సాధించింది. అత్యధిక స్కోరు 97 కాగా, 17 అర్ధసెంచరీలు చేసింది. కెప్టెన్‌గానూ తనదైన ముద్ర వేసిన మిథాలీ టీమ్ఇండియాకు అత్యధిక విజయాలు అందించిన సారథిగానూ రికార్డు సృష్టించింది. ఆమె సారథ్యంలో భారత్ 122 మ్యాచ్‌లు ఆడితే 75సార్లు విజయం సాధించింది.

> ### ఇది నంబర్ మాత్రమే..
>
> నా వరకైతే 200ల వన్డే కేవలం నంబర్ మాత్రమే. కానీ ఇది అందుకున్నందుకు సంతోషంగా అనిపిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా మహిళల క్రికెట్‌లో ఎదురైన ఎన్నో సంధి దశలను చూశా. అంతర్జాతీయ మహిళా క్రికెట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నేను అరంగేట్రం చేశా. అది అలా రూపాంతరం చెందుతూ ఇప్పుడు ఐసీసీ గొడుగులోకి వచ్చింది. ఈ మధ్యకాలంలో చాలా ఎత్తుపల్లాలను చవిచూశాం. సుదీర్ఘకాలంగా భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది. నేను ఆట మొదలుపెట్టినప్పుడు ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. టీమ్ఇండియాలో ఓ సభ్యురాలిగా భారత త్రివర్ణాన్ని ధరించాలన్నది నా మొట్టమొదటి లక్ష్యం. కానీ ఇంతకాలం కెరీర్ కొనసాగిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఇంతకాలం నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.
>
> -మిథాలీ

ఆ ముగ్గురి వెనుక..

1999లో ఐర్లాండ్‌పై అరంగేట్రం చేసిన మిథాలీ... 20 ఏండ్లుగా అంతర్జాతీయ కెరీర్‌లో కొనసాగుతున్నది. ఇది కూడా ఓ రికార్డే. మహిళా క్రికెటర్లలో ఇంత సుదీర్ఘకాలం కెరీర్ కొనసాగించిన వారు ఎవరూ లేరంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పాతతరం క్రికెటర్లు కూడా 15 ఏండ్ల కంటే ఎక్కువగా కెరీర్‌ను కొనసాగించలేదు. పురుష క్రికెటర్లలో బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, జయసూర్య (శ్రీలంక), జావేద్ మియాందాద్ (పాకిస్థాన్) తర్వాత అత్యధిక కాలం కెరీర్ కొనసాగించిన క్రికెటర్ మిథాలీయే. అంటే ఓవరాల్ జాబితాలో ఆమెది నాలుగో స్థానం. కెరీర్‌లో అరుదైన ఘనత సాధించిన మిథాలీకి.. హైదరాబాద్ మాజీ ప్లేయర్ వీవీఎస్ లక్ష్మణ్, ఇతర సహచరులతో పాటు బీసీసీఐ, ఐసీసీ అభినందనలు తెలిపింది.

ఆఖరి ఆటలో ఓటమి

మూడో వన్డేలో న్యూజిలాండ్ గెలుపు

2-1తో సిరీస్ టీమ్ఇండియా సొంతం

హామిల్టన్: హామిల్టన్ పిచ్ అమ్మాయిలకు కూడా కలిసిరాలేదు. మూడో మ్యాచ్ గెలిచి న్యూజిలాండ్‌ను క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న భారత మహిళల క్రికెట్ జట్టు ఆశలు నెరవేరలేదు. శుక్రవారం జరిగిన మూడో వన్డేలో మిథాలీసేన 8 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. దీంతో సిరీస్‌ను 2-1తో ఖాతాలో వేసుకుంది. టీమ్ఇండియా నిర్దేశించిన 150 పరుగుల లక్ష్యాన్ని కివీస్..29.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. సుజీ బేట్స్(57), సాథర్‌వైట్(66 నాటౌట్) అర్ధసెంచరీలతో కివీస్ మరో 124 బంతులు మిగిలుండగానే విజయాన్నందుకుంది. 22 పరుగులకే డౌన్(10) వికెట్ కోల్పోయిన కివీస్ ఇన్నింగ్స్‌ను బేట్స్, సాథర్‌వైట్ చక్కదిద్దారు. వీరిద్దరు కలిసి రెండో వికెట్‌కు 84 పరుగుల భాగసామ్యం నెలకొల్పారు. పూనమ్ యాదవ్(1/31)కు ఒక వికెట్ దక్కింది. అంతకుముందు అన్నా పీటర్సన్(4/28), తుహుహు(3/26)ధాటికి భారత్ 44 ఓవర్లలో 149 పరుగులకు కుప్పకూలింది. దీప్తిశర్మ(52) అర్ధ సెంచరీ మినహా మిగతావారు ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. 13 పరుగులకే ఓపెనర్లు జేమ్స్ రోడ్రిగ్స్(12), స్మృతి మందన(1) వికెట్లు కోల్పోయిన భారత్..దీప్తి అర్ధసెంచరీతో గౌరవప్రదమైన స్కోరు అందుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్(24)..దీప్తికి తోడుగా నిలువడం స్కోరింగ్ పరంగా కలిసొచ్చింది. మంచి ఫామ్‌లో ఉన్న మందన, కెప్టెన్ మిథాలీ రాజ్ విఫలం కావడం..జట్టు అవకాశాలపై దెబ్బకొట్టింది. ఆరుగురు బ్యాట్స్‌వుమెన్ సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కావడంతో కివీస్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించలేకపోయింది. నాలుగు వికెట్లతో భారత్‌ను కుప్పకూల్చిన పీటర్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఈనెల 6 నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ మొదలవుతుంది.


ట్రోఫీతో భారత మహిళల జట్టు

సంక్షిప్త స్కోర్లు : భారత్: 44 ఓవర్లలో149 ఆలౌట్(దీప్తిశర్మ 52, హర్మన్‌ప్రీత్‌కౌర్ 24, పీటర్సన్ 4/28, తుహుహు 3/26), **న్యూజిలాండ్:** 29.2 ఓవర్లలో 153/2 (సాథర్‌వైట్ 66 నాటౌట్, బేట్స్ 57 నాటౌట్, పూనమ్ యాదవ్ 1/31).

17 ఏండ్లకే ప్రపంచ రికార్డు

నేపాల్ క్రికెటర్ సందీప్ అరుదైన ఫీట్

న్యూఢిల్లీ: నేపాల్ క్రికెటర్ల రికార్డుల పర్వం కొనసాగుతున్నది. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో అతిపిన్న వయసులో అర్ధసెంచరీ చేసిన రోహిత్ పౌడెల్(16 ఏండ్ల 146 రోజులు) రికార్డు మరిచిపోకముందే..మరో యువ క్రికెటర్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అరంగేట్రం అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో అర్ధసెంచరీ కొట్టిన పిన్న వయసు (17 ఏండ్ల 103 రోజులు) క్రికెటర్‌గా సందీప్ జోరా రికార్డు పుస్తకాల్లోకెక్కాడు. యూఏఈతో గురువారం జరిగిన టీ20 మ్యాచ్‌లో సందీప్ 43 బంతుల్లో 53 పరుగులతో అజేయంగా నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో సందీప్ మూడు ఫోర్లు, ఓ భారీ సిక్స్‌తో చెలరేగాడు. ఈ కుర్రాడు అర్ధసెంచరీతో రాణించినా.. యూఏఈ చేతిలో నేపాల్ 21 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. సందీప్‌కు సంబంధించిన అరుదైన ఫీట్‌ను ఐసీసీ తమ అధికారిక ట్విట్టర్‌లో పొందుపరుస్తూ అభినందనలు తెలిపింది.





హెడ్, బర్న్స్ శతక మోత

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 384/4

కాన్‌బెర్రా: బాల్ ట్యాంపరింగ్ ఉదంతంతో పరువు కోల్పోయి ఇంటాబయటా ఓటములు ఎదుర్కొన్న ఆస్ట్రేలియా జట్టు ఎట్టకేలకు గాడిలో పడింది. రెండో టెస్ట్‌లో శ్రీలంకపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడింది. జో బర్న్స్(243 బంతుల్లో 172 నాటౌట్, 26 ఫోర్లు), ట్రావిస్ హెడ్(204 బంతుల్లో 161, 21ఫోర్లు, సిక్స్) సెంచరీలతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 384/4 స్కోరు చేసింది. ఫెర్నాండో(3/99) ధాటికి 28 పరుగులకే హ్యారిస్(11), ఖవాజ(0), లాబుచాంగె(6) వికెట్లను కోల్పోయిన ఆసీస్‌ను బర్న్స్, హెడ్ ఆదుకున్నారు. వీరిద్దరు సెంచరీలతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. గతేడాది అక్టోబర్‌లో పాకిస్థాన్‌పై ఖవాజ సెంచరీ తర్వాత ఇన్ని రోజులకు టెస్ట్‌ల్లో ఆసీస్‌కు ఇది మొదటి శతకం కావడం విశేషం. లంక బౌలర్లను ఆటాడుకుంటూ దాదాపు ఓవర్‌కో బౌండరీ బాదుతూ స్కోరుబోర్డును పరిగెత్తించారు. ఈ ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 308 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 2017 డిసెంబర్ తర్వాత ఆసీస్‌కు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. బర్న్స్‌తో పాటు ప్యాటర్‌సన్(25) క్రీజులో ఉన్నారు. లక్మల్ వెన్నునొప్పితో వైదొలుగడంతో లంక తరఫున కరుణరత్నె అరంగేట్రం చేశాడు.

తొలిరోజు భారత్‌కు నిరాశ

రెండు సింగిల్స్‌లోనూ ఇటలీదే విజయం

డేవిస్‌కప్ అర్హత మ్యాచ్

కోల్‌కతా: గ్రాస్‌కోర్టుపై ఇటలీ బలహీనతను సొమ్ము చేసుకోవాలనుకున్న భారత జట్టు ఆశలు ఆవిరయ్యాయి. డేవిస్‌కప్ అర్హత మ్యాచ్‌లో భాగంగా కోల్‌కతాలో శుక్రవారం ఇటలీతో తలపడిన ఆతిథ్యజట్టుకు ఏదీ కలిసిరాలేదు. తొలిరోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత జట్టు ఓటమితో ఇటలీ జట్టు 2-0 ఆధిక్యంతో తిరుగులేని ఆధిక్యాన్ని అందుకుంది. విజయంతో డేవిస్‌కప్ ఫైనల్స్ గ్రూప్‌లో చోటు ఖాయం చేసుకునేలా ప్రత్యేక ప్రణాళికతో భారత్ బరిలోకి దిగినా మైదానంలో మాత్రం ఇటలీదే ఆధిపత్యమైంది. తొలిసింగిల్స్‌లో భాగంగా ఇటలీ జట్టులోని సీనియర్ ఆటగాడు ఆండ్రియాస్ సెప్పి 6-4,6-2 స్కోరుతో వరుససెట్లలో భారత నంబర్ టూ ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్‌పై గెలిచి 1-0తో శుభారంభం అందించాడు. భారత్ ఎన్నో ఆశలు పెట్టుకున్న నంబర్‌వన్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ రెండో సింగిల్స్‌లో ఇటలీ యువ ఆటగాడు మాట్టే బెరెట్టినితో తలపడ్డాడు. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండోరౌండ్ చేరి అద్భుత ఫాంలో కనిపించిన ప్రజ్నేశ్ ఈ మ్యాచ్‌లో మాత్రం పూర్తిగా తేలిపోయాడు. బెరెట్టిని 6-4,6-3 స్కోరుతో వరుస సెట్లలో విజయాన్నందుకుని భారత ఆశలపై నీళ్లు జల్లాడు.

ఇటీవలి కాలంలో అంతర్జాతీయ సర్క్యూట్‌లో సింగిల్స్‌లో సంచలన విజయాలు సాధిస్తున్న భారత ఏస్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్, రామ్‌కుమార్ రామనాథన్ ఇద్దరూ ఓడిపోవడంతో దాదాపు భారత జట్టుకు గెలుపు ఆశలు మిగల్లేదు. భారత్ విజయం సాధించాలంటే శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌తోపాటు చివరి రెండు రివర్స్ సింగిల్స్‌లోనూ విజయం సాధించాలి. కాగా, ఇటలీ మాత్రం మరో విజయాన్ని సాధిస్తే డేవిస్‌కప్ మెయిన్ డ్రాకు చేరుకుంటుంది.


ప్రజ్నేశ్


రామ్‌కుమార్

పుంజుకుంటాం: భూపతి

ఆసియా ఓసియానా గ్రూప్ మ్యాచ్‌లో భాగంగా చైనాతో జరిగిన మ్యాచ్‌లోనూ 2-0తో వెనుకబడి చివరకు 3-2తో గెలిచామని మహేశ్‌భూపతి గుర్తుచేశాడు. శనివారం జరిగే మ్యాచ్‌లను గెలుచుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశాడు. 'దేశం తరపున ఆడే సమయంలో ఎలాంటి ఒత్తిడి ఉంటుందో నాకు తెలుసు. ఇటలీ ఆటగాళ్లు చాల అనుభవజ్ఞులు. చైనాలో జరిగినట్లుగానే శనివారం ఆధిక్యత దక్కుతుందని భావిస్తున్నాను. చైనాతో పోల్చితే ఇటలీ చాలా పటిష్ఠమైన జట్టు. మా ఆటగాళ్లపై నాకు నమ్మకముంది' అని భూపతి అన్నాడు. డబుల్స్‌లో రోహన్ బోపన్న, దివిజ్ శరణ్ గెలుపు అందించగలిగితే చివరి రెండు రివర్స్ సింగిల్స్‌లో యువ ఆటగాళ్లు అద్భుతం చేసే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా, డబుల్స్ జోడీగా మార్కో ఎచ్చినాటో, సిమోన్ బొలెల్లి ఇటలీ తరపున బరిలోకి దిగుతున్నారు. ఎచ్చినాటో సింగిల్స్‌లో ప్రపంచ టాప్ 20లో కొనసాగుతుండగా.. బొలెల్లి 2015 ఏడాదిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. దీంతో భారత్ ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించడం కష్టమే.

లంక తొలి రౌండ్ కూడా దాటదు

బోర్డులో అవినీతి పెరిగిందన్న రణతుంగ

కొలంబో: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక జట్టుకు ఘోర పరాభవం తప్పదని మాజీ సారథి అర్జున రణతుంగ హెచ్చరించారు. బోర్డు అధికారుల్లో అవినీతి ఎక్కువైందన్నారు. ఆటగాళ్లలో క్రమశిక్షణ కొరవడిందన్నాడు. 'మెగా ఈవెంట్‌లో లంక తొలి రౌండ్ దాటడం కూడా కష్టమే. బోర్డులో అవినీతి రాజ్యమేలుతున్నది. ఆటగాళ్లలో బృంద స్ఫూర్తి కొరవడింది. క్రికెటర్లు బహిరంగంగానే ఒకరినొకరు తిట్టిపోసుకుంటున్నారు. మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణాలతో ఐసీసీ వరుసగా దర్యాప్తులు చేస్తున్నది' అని రవాణశాఖ మంత్రిగా పని చేస్తున్న రణతుంగ పేర్కొన్నారు. ప్రస్తుతం జట్టు పేలవ ప్రదర్శనకు బోర్డుతో పాటు కొంత మంది ఆటగాళ్లే కారణమని పరోక్షంగా విమర్శించారు. క్రికెటర్లలో క్రమశిక్షణ పెంపొందించేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఏదేమైనా ఆటగాళ్లలో మానసిక పరివర్తన తీసుకొచ్చి బలంగా తయారు చేయాలన్నారు. దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆడుతున్న ఆటగాళ్లను తరిమి కొట్టాలని సూచించారు. లంక టీ20 కెప్టెన్ మలింగ, తాత్కాలిక సారథి తిసారా పెరీరా సామాజిక మాధ్యమాల్లో తిట్టుకుంటుండటంతో రణతుంగ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా పని చేస్తున్న రణతుంగ.. లంక బోర్డు పగ్గాలు చేపట్టాలని గట్టి ప్రయత్నాలు మొదలుపెట్టారు.





శుక్రవారం కొచ్చి నగరం బ్యాక్ వాటర్స్ వద్ద ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ట్రోఫీని ఆవిష్కరించిన ఆరు జట్ల కెప్టెన్లు. కొచ్చి బ్లూ స్పైకర్స్, యుముంబా వోలీ మధ్య మ్యాచ్‌తో నేడు పీవీఎల్ మొదలవుతుంది.

ఆర్థికవృద్ధిలో దూసుకుపోతున్నాం



హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్‌అలీకి జ్ఞాపికను అందజేస్తున్న ఐసీఏఐ అధ్యక్షుడు నవీన్ గుప్తా, మాజీ అధ్యక్షుడు దేవరాజారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రఫుల్లా ప్రేంశర్ తదితరులు

- సంస్థల ఆర్థిక ప్రగతిలో సీఏలది కీలకపాత్ర
- ఐసీఏఐ స్నాతకోత్సవంలో హోంమంత్రి మహమూద్‌అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆర్థికవృద్ధిరేటులో దూసుకుపోతున్నదని హోంశాఖమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. శుక్రవారం హైటెక్‌సిటీలోని శిల్పకళావేదికలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన సీఏ పట్టభద్రుల స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిననాటినుంచి 2017 వరకు ఆర్థికవృద్ధిరేటు 17 శాతం ఉండగా, 2018లో 29.9శాతంగా నమోదవుతున్నదన్నారు. చిన్నరాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయనడానికి తెలంగాణే మంచి ఉదాహరణ అని చెప్పారు. సంస్థలు, కంపెనీలు, వ్యాపారాలకు సీఏలు వెన్నుముక వంటివారన్నారు. సీఏ లేకుండా ఏ వ్యాపారంలోనైనా విజయాలు సాధ్యంకావన్నారు. నూతనంగా ఉద్యోగాల్లోకి అడుగుపెడుతున్న యువత దేశ ఆర్థిక ప్రగతికి మరింత దోహదపడాలని సూచించారు. ఐసీఏఐ ఉత్తమ సీఏలను దేశానికి అందించడం అభినందనీయమన్నారు. ఏపీ, తెలంగాణ విడిపోయినా.. తెలుగువారంతా అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడి జాతీయ స్థాయిలో మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఐసీఏఐ అధ్యక్షుడు నవీన్ ఎన్డీ గుప్తా, మాజీ అధ్యక్షుడు దేవరాజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లోనూ సీఏలకు పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రఫుల్ల ప్రేంశర్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

16 నుంచి ఆర్థిక నేరాలు-సవాళ్లపై జాతీయ సదస్సు

రాష్ట్రం నుంచి పాల్గొననున్న ముగ్గురు జడ్జీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'ఆర్థిక నేరాలు- ఎదురవుతున్న సవాళ్లు, పరిణామాలు' అనే అంశంపై ఈ నెల 16, 17 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జాతీయ సదస్సు జరుగనున్నది. ఈ సదస్సుకు తెలంగాణ నుంచి ముగ్గురు జడ్జీలను ఎంపికచేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ సుమలత, సిటీ సివిల్‌కోర్టు రెండో అదనపు చీఫ్ జడ్జి టీ పాపిరెడ్డి, ఆర్థిక నేరాల ప్రత్యేక జడ్జి, అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్ విక్టర్ ఇమ్మాన్యుయేల్ పాల్గొననున్నారు.

కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి తనిఖీలా?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటిని ధిక్కరించి కరీంనగర్ నగరంలోని పుష్పాంజలి రిసార్ట్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించడంపై శుక్రవారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. పదేపదే సోదాలు చేయడం వెనుక కరీంనగర్ పోలీసుల ఉద్దేశమేమిటని ప్రశ్నించింది. రిసార్ట్‌కు చట్టబద్ధమైన అనుమతులు తీసుకున్నామని, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేసి వ్యాపారం చేస్తుండగా పోలీసులు దాడులు చేస్తున్నారంటూ పుష్పాంజలి రిసార్ట్ యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 15వ తేదీకి వాయిదా వేసింది.

మిషన్ భగీరథతో సత్ఫలితాలు

- ఇది ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యనిధి
- ప్రజలు జాగ్రత్తగా వినియోగించుకోవాలన్న మిషన్ భగీరథ కార్యదర్శి స్మితాసబర్వాల్



శుక్రవారం హైదరాబాద్‌లో మిషన్ భగీరథపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో పాల్గొన్న మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథతో వెలకట్టలేని 'ఆరోగ్యనిధి'ని భావితరాలకు ప్రభుత్వం అందిస్తున్నదని మిషన్ భగీరథ కార్యదర్శి స్మితాసబర్వాల్ పేర్కొన్నారు. ఈ నీటితో ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిలో మార్పులొస్తాయని చెప్పారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఇంటి ముందుకే తాగునీటిని తీసుకొస్తున్నామని, ప్రజలు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నిర్వహణ పాలసీ, మార్గదర్శకాలపై నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో రెండోరోజు శుక్రవారం ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, ఇంజినీర్లు, సిబ్బంది అంకితభావంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి శుద్ధ తాగునీరు సరఫరా అవుతున్నదన్నారు. ప్రస్తుతం మనిషికి రోజుకు గ్రామాల్లో 100లీటర్లు, పట్టణాల్లో 135 లీటర్లు, నగరాల్లో 150 లీటర్లు సరఫరా అవుతున్నట్టు చెప్పారు. యునిసెఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల్లో శుద్ధజలం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సర్వే చేశామని, మిషన్ భగీరథతో అవన్నీ పరిష్కారమవుతాయన్న నమ్మకం ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, ఆస్కీ డైరెక్టర్ శ్రీనివాసాచారి, చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్‌రెడ్డి, విజయప్రకాశ్, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయప్రకాశ్, వినోభాదేవి, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, కన్సల్టెంట్లు నర్సింగరావు, జగన్, మనోహర్‌బాబు, స్మార్ట్ బిడ్రా స్టాఫ్ ప్రతినిధి గోకుల్ కృష్ణ, డీ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ టీవీ మాజీ చైర్మన్ హత్య

- నందిగామ సమీపంలో మృతదేహం లభ్యం
- కుటుంబసమస్యలు, ఆర్థికలావాదేవీలే కారణమా?
- సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు



కృష్ణాజిల్లా నందిగామ సమీపంలో కారులో లభ్యమైన జయరామ్ మృతదేహం.. హతుడి కారు.. (ఇన్‌సెట్) జయరామ్ (ఫైల్)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎక్స్‌ప్రెస్ టీవీ మాజీ చైర్మన్ చిగురుపాటి జయరామ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శుక్రవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామ మండలం ఐతవరం దగ్గర హైవే పక్కన ఓ గోతిలో కారు కనిపించడంతో.. స్థానికులు దగ్గరకు వెళ్లి పరిశీలించారు. వెనుక సీట్లో మృతదేహం ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. మృతుడు జయరామ్‌గా గుర్తించారు. ఘటనాస్థలంతోపాటు హైవేపై ఉన్న టోల్‌గేట్లలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. మృతుడి తలపై గాయాలు, చేతులు నలుపురంగంలోకి మారడంతో విషప్రయోగం చేసి, దాడిచేసి హత్యచేసినట్టు అనుమానిస్తున్నారు. జయరామ్ రెండ్రోజుల కిందట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి ఒంటరిగా కారులో బయలుదేరి.. తొలుత దసపల్లా హోటల్‌కు వెళ్లి, అక్కడి నుంచి విజయవాడకు బయలుదేరినట్టు పోలీసువిచారణలో తేలింది. ఆయన కారు జనవరి 31న రాత్రి 8.30 గంటలకు పంతంగి టోల్‌ప్లాజాను, 10.22 గంటలకు చిల్లకల్లు టోల్‌ప్లాజాను క్రాస్ చేసినట్టు గుర్తించారు. పతంగి టోల్‌గేట్ వద్ద వేరే వ్యక్తి ఫీజు చెల్లించినట్టు సీసీటీవీలో రికార్డవడంతో, అతడు మార్గమధ్యంలో కలిసి ఉండొచ్చని భావిస్తున్నారు. చిల్లకల్లు, సూర్యాపేట చెక్‌పోస్ట్‌ల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా తెల్లచొక్కా వేసుకున్న వ్యక్తి కారు నడిపినట్టు తేల్చారు. తెనాలిలో ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన జయరామ్ అనతికాలంలోనే పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఔషధాలు, కండ్లద్దాల తయారీ కంపెనీలు నిర్వహించారు. హైదరాబాద్‌లో జెనోటెక్ ఫార్మా కంపెనీతోపాటు ఇతర వ్యాపారాలు నిర్వహించారు. ఎక్స్‌ప్రెస్ టీవీని ప్రారంభించారు. కృష్ణా జిల్లాలో సహకార బ్యాంకును ఏర్పాటుచేశారు. కొంతకాలంగా కంపెనీలు నష్టాల్లో నడుస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ టీవీ మూతబడింది. అమెరికాలోని ఓ బ్యాంకులో భాగస్వామిగా ఉన్నారు. ఆయనకు అక్కడి పౌరసత్వం కూడా ఉంది. జయరామ్ కుటుంబం అమెరికాలో ఉండగా, ఆయన నెల క్రితమే అమెరికా నుంచి వచ్చారు.

ఆస్తి తగాదాలే కారణమా..?

జయరామ్‌కు భార్యతో విభేదాలున్నట్టు తెలుస్తున్నది. తల్లి చనిపోయిన తర్వాత ఆస్తి విషయంలో కుటుంబ కలహాలున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ కలహాలే హత్యకు కారణమా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. హత్యకు హైదరాబాద్‌లోనే కుట్ర జరిగినట్లు భావిస్తున్నారు. కుటుంబసభ్యులు, కోస్టల్ బ్యాంక్ సిబ్బందిని, కారు డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఆయన మేనకోడలు శిఖా చౌదరిని కూడా ప్రశ్నించనున్నారు. కారులో మద్యం సీసాలు లభించాయి. జయరామ్‌కు మద్యం తాగేఅలవాటు, రాత్రి పూట ప్రయాణాలు చేసే అలవాటు లేదని డ్రైవర్ చెప్తున్నారు. మొత్తం నలుగురు ప్రయాణించారని అనుమానిస్తున్నారు. వారెవరో తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

వివిధ రంగాలకు కేటాయింపులు

రంగం	కేటాయింపులు (కోట్లలో)
పెన్షన్లు	1,75,300
రక్షణ రంగం	3,05,296
ప్రధాన సబ్సిడీలు	2,96,684
వ్యవసాయం, అనుబంధ రంగాలు	1,49,981
విద్య	93,848
ఇంధన రంగం	44,101
ఆరోగ్యరంగం	63,538
హోంశాఖ	1,03,927
వడ్డీలు	6,65,061
గ్రామీణాభివృద్ధి	1,38,962
సాంఘిక సంక్షేమశాఖ	49,337
ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్	1,17,285
రాష్ట్రాలకు బదిలీ	1,66,883
రవాణావ్యవస్థ	1,56,187
పట్టణాభివృద్ధి	48,032
ఇతర రంగాలు	75,822

మహిళలకు ప్రాధాన్యం

- బేటీ పడావో —బేటీ బచావోకు రూ.290 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్రం బడ్జెట్‌లో మహిళ, శిశు సంక్షేమానికి పెద్దపీట వేసింది. రానున్న ఆర్థిక సంవత్సరానికి ప్రసూతి ప్రయోజనాలు, శిశు సంరక్షణ సేవల కోసం 20 శాతం పెరుగుదలతో రూ.29,000 కోట్లు కేటాయించింది. ప్రసూతి ప్రయోజనం కోసం ప్రారంభించిన ప్రధానమంత్రి మాతృవందన యోజన (పీఎంఎంవీవై) కార్యక్రమానికి గతంలో కేటాయించిన రూ.1,200 కోట్ల మొత్తాన్ని రెండింతలుగా చేసి రూ.2,500 కోట్లు ఇచ్చారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఈ కార్యక్రమం కింద ఒక్కొక్కరికీ రూ.6వేలు అందిస్తారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ప్రోగ్రాంకు రూ.1,500 కోట్లు కేటాయించారు. బేటీ పడావో-బేటీ బచావో కార్యక్రమానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.290 కోట్లు ఇచ్చారు. జాతీయ న్యూట్రిషన్ మిషన్ కింద పోషకాల లేమి, రక్తహీనత సమస్య, తక్కువ బరువుతో శిశువుల జననం వంటి వాటి నివారణకుగాను రూ.3,400 కోట్లు కేటాయించారు. మహిళా శక్తి కేంద్రాలకు ఇప్పటివరకు జరిగిన కేటాయింపులను రూ.115 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పెంచారు. నేషనల్ క్రెచ్ స్కీంకు నిధులను రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్లకు పెంచారు.

ఓటు బడ్జెట్!

మూడోపేజీ తరువాయి...

స్వయం ఉపాధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు రూ.5 లక్షల వరకు ఆదాయానికి పన్ను రిబేటు ఇవ్వడం బడ్జెట్‌లోని మరో కీలకాంశం. మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్టు తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ సంప్రదాయాలకు విరుద్ధంగా చివరికి పూర్తిస్థాయి బడ్జెట్‌కు మించి ప్రతిపాదనలు చేశారు. ప్రజాకర్షక పథకాలను ప్రకటించే సమయంలో హిందీలో వివరిస్తూ దేశంలో అత్యధిక ఓటర్లకు తమ రాయితీల సందేశం చేరేలా ప్రయత్నించారు. ఇటీవల పలురాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో గోయల్ చేసిన ప్రతిపాదనలన్నీ ఓటు బ్యాంకును ఆకర్షించే దిశగానే సాగాయి. కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద మూడు విడుతల్లో రూ.2 వేల చొప్పున ఒక్కో రైతుకు చెల్లిస్తారు. వ్యవసాయ సర్వే ప్రకారం దేశంలో రెండు హెక్టార్లు (ఐదెకరాలు) లోపు కమతాలున్న రైతులు 86.21 శాతం ఉన్నారని, దేశంలో జరుగుతున్న వ్యవసాయంలో వీరి వాటా 47.34 శాతం ఉన్నదని పీయూష్ గోయల్ చెప్పారు. చేపలు, పశువుల పెంపకం చేసేవారికి తోడు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీని కల్పించారు. సకాలంలో వడ్డీ చెల్లించే రైతులకు రుణాలపై 3 శాతం వడ్డీ సాయం అందించే ప్రతిపాదనచేశారు. 2017-18 డాటా ప్రకారం రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారులు 3,53,88,404 మంది ఉన్నారు. వీరందరికీ రిబేటు రూపంలో పన్ను నుంచి మినహాయింపు లభించింది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.18,500 భారం పడుతుంది. పన్ను రిబేటుతోపాటు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు డిపాజిట్లు ఇతర వడ్డీ ఆదాయాలపై టీడీఎస్ మినహాయింపును రూ.10 వేల నుంచి రూ.40 వేలకు పెంచడం ద్వారా స్థిరాదాయంపై ఆధారపడే సీనియర్ సిటిజన్లతోపాటు పొదుపుచేసే వేతన జీవులందరికీ ఉపశమనం కలిగించారు. నెలకు వంద రూపాయలతో 60 ఏండ్లు నిండిన తర్వాత నెలకు రూ.3 వేల పింఛన్ అందేలా అసంఘటితరంగ కార్మికులకు కనీస ఆదాయ భద్రత కల్పించారు. హౌజింగ్ రంగానికి ఊతమిచ్చేందుకు రెండో ఇంటి కొనుగోలు పన్ను ఎత్తివేశారు. అద్దె ఆదాయంపై టీడీఎస్ మినహాయింపును రూ.1.8 లక్షల నుంచి రూ.2.4 లక్షలకు పెంచారు. స్థిరాస్తి అమ్మకం ద్వారా వచ్చిన రూ.2 కోట్ల వరకు వచ్చే సొమ్ముతో ఏడాదిలోగా రెండు నివాసగృహాలను కొనుగోలుచేస్తే క్యాపిటల్‌గెయిన్ ట్యాక్స్ నుంచి మినహాయించారు. గతంలో ఇది ఒక ఇంటికే పరిమితంగా ఉంది. ఆదాయం పన్ను ప్రతిపాదనలను పూర్తిస్థాయి బడ్జెట్‌లో ప్రతిపాదించడం ఆనవాయితీ అయినప్పటికీ, మధ్యతరగతి ఉద్యోగులు, పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లు వారి పన్ను చెల్లింపుల్లో స్పష్టత కావాలని కోరుకుంటున్నందునే పన్ను రాయితీ ప్రతిపాదనలు చేసినట్టు ఆర్థికమంత్రి గోయల్ వివరణ ఇచ్చుకున్నారు. రాయితీల కారణంగా గత ఏడాది నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యాలను పెంచుకోవాల్సి వచ్చింది. గత బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న జీడీపీలో 3.1 శాతం ద్రవ్యలోటును 3.4 శాతానికి పెంచుకోవాల్సివచ్చింది. రక్షణ బడ్జెట్‌ను 7 శాతం పెంచుతూ తొలిసారిగా రూ.3 లక్షల కోట్లకు ప్రతిపాదించారు. సబ్సిడీల బిల్లు రూ. 2.66 లక్షల కోట్ల నుంచి రూ. 2.97 లక్షల కోట్లకు పెరిగింది. ప్రభుత్వరంగ సంస్థల డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని రూ.80,000 నుంచి రూ.90,000 కోట్లకు పెంచారు. అయితే.. గత ఏడాది లక్ష్యం రూ.80,000 కోట్ల లక్ష్యాన్ని ఇప్పటివరకు చేరుకోకపోవడం గమనార్హం. రిజర్వ్ బ్యాంక్, ఇతర బ్యాంకుల నుంచి రూ.82,900 డివిడెండ్‌ను ఆశిస్తున్నట్టు గోయల్ తెలిపారు.

రాజ్యసభలో బడ్జెట్: లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తదుపరి ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ రాజ్యసభలోనూ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం పురావస్తు ప్రదేశాలు, ప్రాచీన చారిత్రక ప్రదేశాలకు సంబంధించి సెలెక్ట్ కమిటీ నివేదికను సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత రాజ్యసభను సోమవారానికి వాయిదావేస్తున్నట్టు చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటించారు.

సాధికార శాఖకు నిధులు అరకొరే!

వెనుకబడిన వర్గాలు, దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేసే సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖకు ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు మాత్రం పెంచి, రూ.7,800 కోట్లు కేటాయించింది. దివ్యాంగుల సాధికారత కోసం గత బడ్జెట్‌లో రూ.1,070 కోట్లు కేటాయించగా, ఈసారి 1,144.90 కోట్లు కేటాయించారు. ఎస్సీ, బీసీ, సఫాయి కర్మచారీలతోపాటు మొత్తం ఐదు జాతీయ కమిషన్లకు రూ.39.87 కోట్లు కేటాయించారు. ఎస్సీలు, బీసీలు, ఈబీసీలకు నేషనల్ ఫెలోషిప్ కింద ఇచ్చే కేంద్ర స్కాలర్‌షిప్‌లు, ఎస్సీలు, ఓబీసీలకిచ్చే ప్రవాస భారతీయ స్కాలర్‌షిప్‌ల నిధులకు భారీగా కోత విధించారు. వీటి కోసం గత బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో దానిని రూ.390.50 కోట్లకు తగ్గించింది.


బడ్జెట్ పదనిసలు

- సభకు ముందు ప్రవేశించిన కేంద్రమంత్రులు గడ్కరీ, ఉమాభారతి, బీజేపీ సీనియర్ నేత, ఎంపీ శాంతకుమార్ పాదాలకు గోయల్ నమస్కరించారు.
- ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతున్నందున, ప్రసంగం మొదట్లో 'శ్రీ జైట్లీజీ గైర్హాజరు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది' అని గోయల్ చెప్పారు.
- ప్రసంగానికి కొందరు అడ్డుతగులడంతో సభ రామ్‌లీలా మైదానాన్ని తలపిస్తున్నదని చమత్కరించారు.
- బడ్జెట్ సమర్పణ సందర్భంగా రాహుల్‌గాంధీ కొద్దిసేపు సభ నుంచి బయటకు వెళ్లారు. దీనిపై బీజేపీ సభ్యులు కొందరు.. రాహుల్ బాబా భాగ్ గయే (రాహుల్ బాబా పారిపోయారు) అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించటం కనిపించింది.

వచ్చే ఐదేండ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే ఐదేండ్లలో దేశఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశమున్నదని గోయల్ తెలిపారు. ఆ తదుపరి ఎనిమిదేండ్లలో ఇది 10 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం గత ఐదేండ్లలో తదుపరి తరానికి చెందిన పలు సంస్థాగత సంస్కరణలను ప్రారంభించిందని, దీంతో రానున్న దశాబ్దాల్లో దేశం గణనీయ వృద్ధి సాధించేందుకు రంగం సిద్ధమైందని చెప్పారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలకు భారత ఆర్థిక వ్యవస్థ చుక్కానిలా కొనసాగుతున్నదని, గత ఐదేండ్లలో దేశ స్థూల ఆర్థిక స్థిరత ఉత్తమంగా ఉన్నదని తెలిపారు. ప్రపంచంలో వేగవంతంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ముందున్నదని, గత ఐదేండ్లలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) మునుపెన్నడూ లేనంత అధిక స్థాయిలో వృద్ధి చెందిందన్నారు. 2013-14 నాటికి ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 11వ స్థానంలో నిలిచిన భారత్ ఇప్పుడు 6వ స్థానానికి చేరుకున్నదని, ప్రభుత్వం అధిక వృద్ధిరేటును సృష్టించడంతోపాటు రెండంకెల ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసి ఆర్థిక సమతూకాన్ని పునరుద్ధరించిందని గోయల్ తెలిపారు.

మోదీ హర్షం-రాహుల్ ముభావం!



లోక్‌సభలో గంభీరంగా ఉండే ప్రధాని మోదీ.. బడ్జెట్ సమయంలో పలుమార్లు హర్షం వ్యక్తంచేస్తూ కనిపించారు. వేతనజీవులకు ఊరట కల్పిస్తూ రూ.5 లక్షల వార్షికాదాయాన్ని పన్ను మినహాయింపు పరిధిలోకి తీసుకొస్తున్నట్టుగా మంత్రి పీయూష్‌గోయల్ ప్రకటించినప్పుడు అధికారపక్ష సభ్యులు బల్లలను చరుస్తూ మోదీమోదీ అంటూ నినాదాలిచ్చారు. ప్రధాని కూడా బల్ల చరుస్తూ హర్షం వ్యక్తంచేశారు. గోయల్ వివిధ రంగాలకు సానుకూల నిర్ణయాలను ప్రకటించినప్పుడల్లా, ప్రభుత్వ విజయాలను తెలియజేసినప్పుడు ప్రధాని బల్లనుచరిచారు. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మాత్రం ఆదాయం పన్ను పరిమితి పెంపుపై బీజేపీ సభ్యుల హర్షాతిరేకంతో సభ దద్దరిల్లినప్పటికీ.. స్పందన లేకుండా ముభావంగా కనిపించారు.

హౌ ఈజ్ ద జోష్

సర్జికల్ స్ట్రైక్స్ ఆధారంగా రూపొందించిన 'యురి' సినిమా, దాంట్లోని 'హౌ ఈజ్ ద జోష్' డైలాగ్ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా లోక్‌సభలో ప్రస్తావనకు వచ్చింది. పీయూష్ గోయల్ తన ప్రసంగం మధ్యలో..'యురి చూశాను. ఆ సినిమాలో మస్తు జోష్ ఉంది' అని చెప్పారు. దీంతో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తోపాటు పలువురు సభ్యులు 'హౌ ఈజ్ ద జోష్' అంటూ యురి డైలాగ్‌ను చెప్పటం కనిపించింది. గోయల్ రెండుసార్లు జోష్ పదాన్ని వాడారు. కశ్మీర్‌లోని యురి ఉగ్రవాదులు దాడిచేసి సైనికులను పొట్టనపెట్టుకున్న నేపథ్యంలో.. 2016లో పీవోకేలో ఉగ్రవాద శిబిరాలపై సైన్యం (సర్జికల్ స్ట్రైక్స్‌ను) చేపట్టిన విషయం తెలిసిందే.



ఇటీవలే కేంద్ర ఎన్నికల సంఘం అవార్డు స్వీకరించిన వికలాంగుల సంక్షేమశాఖ సంచాలకురాలు శైలజ శుక్రవారం సచివాలయంలో సీఎస్ ఎస్కే జోషిని కలిశారు. ఈ సందర్భంగా సీఎస్ ఆమెను అభినందించారు. -నమస్తే తెలంగాణ, హైదరాబాద్



హైటెక్స్‌లో పరికరాల పనితీరును పరిశీలిస్తున్న ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

అందుబాటులో ఆధునిక సాంకేతికత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆక్వాఎక్స్‌పో ఇండియా- 2019 వంటి పెద్ద సదస్సులద్వారా మత్స్యకారులకు వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునాతన సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వస్తాయని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు పేర్కొన్నారు. మాదాపూర్ హైటెక్స్‌లో జరుగుతున్న ఆక్వాఎక్స్‌పో ఇండియా- 2019 ప్రదర్శనను శుక్రవారం మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ సువర్ణలతో కలిసి సందర్శించారు. పరికరాల పనితీరును తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో చేపలపెంపకం, మత్స్యకారులకు ఉపాధితోపాటు వ్యాపార అవకాశాలను పెంచేందుకు సహకరిస్తున్నదని తెలిపారు.



తెలంగాణ భవన్‌లో ఐకేపీ, వీవోఏల సంఘం ఆవిర్భావసభలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్

తెలంగాణ ప్రభుత్వంలోనే వీవోఏలకు గుర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐకేపీ, వీవోఏలకు తెలంగాణ ప్రభుత్వంలోనే గుర్తింపు వచ్చిందని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన ఐకేపీ, వీవోఏల సంఘం ఆరో ఆవిర్భావసభకు ఆయన హాజరై మాట్లాడారు. వీవోఏల సమస్యను గుర్తించిన సీఎం కేసీఆర్ వారి వేతనాన్ని రూ.5 వేలుగా ఖరారుచేశారన్నారు. సమావేశంలో టీఆర్ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్ష్య,కార్యదర్శులు రాంబాబుయాదవ్, నారాయణ, ఐకేపీ వీవోఏల సంఘం అధ్యక్షుడు కోటేశ్వర్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, మారయ్య, ప్రధాన కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ విత్తన సదస్సు పోస్టర్‌ను శుక్రవారం అర్జెంటీనాలో ఆవిష్కరిస్తున్న తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు

ఖండాంతరాలకు తెలంగాణ విత్తన ఖ్యాతి

- తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు వెల్లడి
- అర్జెంటీనాలో ఓఈసీడీ టెక్నికల్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి భారత్ తరపున హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ ద్వారా తెలంగాణ విత్తనం ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ (ఓఈసీడీ) భాగస్వామ్య దేశాల్లో విత్తనోత్పత్తి ఏ విధంగా జరుగుతున్నది? ఎగుమతులను ప్రోత్సహించడానికి చేపట్టవలసిన ప్రణాళికలు, విత్తన ధ్రువీకరణ పద్ధతులకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై చర్చించేందుకు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఏయిర్స్‌లో జనవరి 29 నుంచి శుక్రవారం వరకు జరిగిన ఓఈసీడీ టెక్నికల్ వర్కింగ్ గ్రూపు సమావేశానికి భారతదేశం తరపున తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు హాజరయ్యారు. భారత వ్యవసాయ స్థితిగతులు, అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణలో సాధించిన పురోగతి, తెలంగాణ విత్తనోత్పత్తి తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆసియాలో తొలిసారిగా జూన్‌లో హైదరాబాద్‌లో జరుగనున్న అంతర్జాతీయ విత్తన సదస్సు (ఐఎస్‌టీఏ-ఇస్టా) పోస్టర్, బ్రోచర్లను ఓఈసీడీ మేనేజర్ కాస్పాగాస్టర్, టెక్నికల్ కమిటీ చైర్మన్ పెడ్రోలవింగ్లీ, ఇస్టా సెక్రటరీ జనరల్ ఆండ్రీస్‌తో కలిపి విడుదల చేశారు.

బోధన్ నకిలీ చలాన్ల స్కాం.. త్వరలో చార్జిషీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్మును నకిలీ చలాన్లతో కొల్లగొట్టిన బోధన్ కుంభకోణం దర్యాప్తు కొలిక్కి వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేసేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ప్రధానసూత్రధారి శివ్‌రాజ్‌కు చెందిన భవనంలో ఉన్న నకిలీ చలాన్లలో ఐదువేలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా.. అవన్నీ నకిలీవేనని నివేదిక వచ్చింది. ఇప్పటికే శివ్‌రాజ్‌తోపాటు తొమ్మిదిమంది సీటీవోలను సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి సేకరించిన సమాచారంతోపాటు శాస్త్రీయ ఆధారాలు, నివేదికల సేకరణ పూర్తికావడంతో చార్జిషీట్ వేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. 2014కు ముందు లెక్కలపైనా ఆరాతీసి అవసరమైతే అనుబంధ చార్జిషీట్ వేస్తామని అధికారులు చెప్తున్నారు.

ఏసీబీ వలలో జీహెచ్‌ఎంసీ అవినీతి చేప

మాదన్నపేట: బిల్లులు విడుదల చేసేందుకు కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకొంటూ జీహెచ్‌ఎంసీ సహాయక ఇంజినీర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. హఫీజ్‌బాబానగర్‌లో సీసీరోడ్డు పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు రూ.40 వేలు ఇవ్వాలని ఏఈ వెంకట్రాములు డిమాండ్‌చేశారు. దాంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. శుక్రవారం కంచన్‌బాగ్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద లంచం తీసుకొంటుండగా వెంకట్రాములును పట్టుకొన్నారు. రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకొన్నారు.

'ఓటుకు నోటు'లో వేం నరేందర్‌రెడ్డికి ఈడీ నోటీసు?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటుకు నోటు కేసులో కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అనుచరుడు వేం నరేందర్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసు జారీ చేసినట్టు తెలిసింది. అధికారులు శుక్రవారం గచ్చిబౌలిలోని నరేందర్‌రెడ్డి ఇంటికివెళ్లి నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ఈ కేసులో రూ.50 లక్షలపై వారంలోగా హాజరై వివరణఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం.

మనకు అరకొరే!

మూడోపేజీ తరువాయి...

కేటాయించింది. కాజీపేట-బల్హార్షా మూడోలైన్‌కు రూ.265కోట్లు, సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులకు రూ.200కోట్లు మంజూరుచేసింది. కేంద్ర బడ్జెట్‌పై ఆర్థికశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కేంద్రం నుంచి పన్నుల వాటా ఎంత వచ్చింది? ఎంత గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ వచ్చింది? అనే లెక్కలు వేస్తున్నారు. మరో వైపు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు సీఎం కేసీఆర్‌ను కలిసి బడ్జెట్ తదనంతర పరిస్థితిని వివరించినట్టు తెలిసింది.



ఉత్తరాది రాష్ట్రాల ప్రజలను చలి వణికిస్తున్నది. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాకు సమీపంలోని కుఫ్రీలో 10 సెం.మీ. మంచు కురిసింది. కుఫ్రీలో శుక్రవారం మంచు కప్పిన రహదారిపై వాహనాలు నెమ్మదిగా కదులుతున్న దృశ్యం.మంచు కురవడంతో జమ్ము- శ్రీనగర్ రహదారిని రెండో రోజు మూసివేశారు.



అమెరికాలోని మిడ్‌వెస్ట్ ప్రాంతంలో గురువారం మైనస్ 49 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తీవ్ర చలిగాలులకు అమెరికాలో ఇప్పటివరకు 21 మంది మరణించారు. షికాగోలోని మిచిగాన్ సరస్సు గడ్డకట్టిన దృశ్యమిది.

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ..

కేఎంఎస్ఎస్ కార్యకర్తల నగ్న ప్రదర్శన



గువహటి, ఫిబ్రవరి 1: వివాదాస్పద పౌరసత్వ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తూ క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి (కేఎంఎస్ఎస్)కి చెందిన ముగ్గురు కార్యకర్తలు శుక్రవారం అసోంలో నగ్న ప్రదర్శనకు దిగారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే అసెంబ్లీ, సచివాలయం ఉన్న ప్రాంతాల్లో వారు అకస్మాత్తుగా నిరసనకు దిగడం సంచలనం సృష్టించింది. కారులో వచ్చిన ముగ్గురు కేఎంఎస్ఎస్ కార్యకర్తలు సచివాలయం సమీపంలో దిగిన వెంటనే దుస్తులు విప్పడం ప్రారంభించారని డీసీపీ అమన్‌జిత్ కౌర్ చెప్పారు. పౌరసత్వ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోదీ, అసోం సీఎం సర్బానంద సొనోవాల్, రాష్ట్ర ఆర్థికమంత్రి హిమంత బిస్వా శర్మలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున వారు నినాదాలు చేసినట్లు వెల్లడించారు. పోలీసులు వెంటనే దుప్పట్లతో వారిని కప్పేసి, అనంతరం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 'కేఎంఎస్ఎస్ కార్యకర్తలు నగ్నంగా సచివాలయం వైపునకు వెళ్లే ప్రధాన గేటువైపునకు దూసుకువచ్చారు. దీంతో ప్రధాన ద్వారాన్ని వెంటనే మూసివేసి వారిని అదుపులోకి తీసుకున్నాం' అని డీసీపీ పేర్కొన్నారు.

కుప్పకూలిన మిరేజ్ శిక్షణ విమానం

ఇద్దరు వాయుసేన పైలట్లు మృతి.. బెంగళూరులో ఘటన



బెంగళూరు, ఫిబ్రవరి 1: భారతీయ వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన శిక్షణా విమానం మిరేజ్-2000 శుక్రవారం బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ విమానాశ్రయం వద్ద కుప్పకూలింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు పైలట్లు మృతి చెందారని రక్షణశాఖ అధికారి తెలిపారు. విమానం భారీ పేలుడుతో కూలిపోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో బయటకు దూకేయడానికి విఫలయత్నం చేసిన పైలట్లు మంటల్లో చిక్కుకున్నారు. మృతులను సమీర్ అబ్రోల్, సిద్ధార్థ నేగిగా గుర్తించినట్లు ఐఏఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రమాద కారణంపై దర్యాప్తునకు ఆదేశించామన్నారు. ఒకరి మృతదేహం పూర్తిగా మంటల్లో దగ్ధం కాగా, మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. గాయాల పాలైన పైలట్‌ను చికిత్స కోసం దవాఖానకు తరలించగా, మృతి చెందినట్లు ఆ ఐఏఎఫ్ అధికార ప్రతినిధి చెప్పారు. ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం విమానం కుప్పకూలుతుండగానే చెలరేగిన మంటలతో దట్టమైన పొగ పరిసర ప్రాంతాలను కమ్మేసిందన్నారు. దీంతో పరిసర ప్రాంత వాసులు, పాదచారులు భయంతో పరుగులు తీశారు. అగ్నిమాపక దళం, విమానాశ్రయ సిబ్బంది విమానంలో మంటలు ఆర్పివేసి, పైలట్లను కాపాడేందుకు ప్రయత్నించారు.



మూడోరోజుకు

హజారే నిరాహార దీక్ష

పెరిగిన బీపీ, షుగర్ లెవెల్స్

అహ్మద్‌నగర్: లోక్‌పాల్, లోకాయుక్త ఏర్పాటుతో పాటు రైతు సమస్యల పరిష్కారం కోసం సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చేస్తున్న నిరాహార దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. దీంతో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. బీపీ, షుగర్ లెవెల్స్ భారీగా పెరిగాయని తెలిపారు. రైతాంగాన్ని గట్టెక్కించేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని హజారే డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు హజారేకు మద్దతుగా స్థానికులు భారీ సంఖ్యలో దీక్షాస్థలికి తరలివచ్చారు.

'నరబలి'కి అనుమతించండి

బెగుసరాయి: బీహార్‌లోని బెగుసరాయి జిల్లా మోహన్‌పూర్-పహాడ్‌పూర్ గ్రామ వాసి, తాంత్రికుడైన సురేంద్రప్రసాద్ సింగ్ తన ఆరాధ్య దేవతను ప్రసన్నం చేసుకునేందుకు నరబలికి అనుమతించాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇంజినీర్ అయిన తన కొడుకును బలి ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అయితే అలాంటి దరఖాస్తు తమకు అందలేదని, తాంత్రికుడి కోసం గాలిస్తున్నామని సంబంధిత అధికారి తెలిపారు.

తాత్కాలిక డైరెక్టర్ వద్దు

- తక్షణమే రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించండి
- సుదీర్ఘ కాలం తాత్కాలిక డైరెక్టర్‌ను కొనసాగించడం మంచిది కాదు
- కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ప్రధాని నేతృత్వంలో రెండోసారి సమావేశమైన అత్యున్నతస్థాయి కమిటీ
- నిర్ణయం లేకుండానే వాయిదా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు తక్షణమే రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. సీబీఐ డైరెక్టర్ పదవి సున్నితమైనది, ముఖ్యమైనదని పేర్కొంది. సుదీర్ఘ కాలం పాటు తాత్కాలిక డైరెక్టర్‌ను కొనసాగించడం మంచిది కాదని అభిప్రాయపడింది. ఇప్పటివరకు రెగ్యులర్ డైరెక్టర్‌ను ఎందుకు నియమించలేదని కేంద్రాన్ని ప్రశ్నించింది. అయితే కొత్త డైరెక్టర్ నియామకం విషయమై ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని అత్యున్నతస్థాయి కమిటీ శుక్రవారం సమావేశం కానుందని కేంద్ర తరపున అటార్నీ జనరల్ (ఏజీ) కే వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు. దీనికి కోర్టు స్పందిస్తూ... 'తక్షణమే సీబీఐ డైరెక్టర్‌ను నియమించాలని ఆదేశిస్తున్నాం. ఇన్‌చార్జి వ్యవహారం ఇక వద్దు' అని వ్యాఖ్యానించింది. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. స్వచ్ఛంద సంస్థ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. గత రెండు వారాల్లో సీబీఐలో 40 మంది అధికారులను బదిలీ చేసినట్లు వివరించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ... తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు తీసుకున్న నిర్ణయాలతో పాటు మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ రెండు రోజులపాటు డైరెక్టర్‌గా తిరిగి నియామకం అయిన సమయంలో తీసుకున్న నిర్ణయాలను కూడా కొత్తగా నియమితులయ్యే డైరెక్టర్ తప్పనిసరిగా పరిశీలించేలా చూడాలని ఏజీని ఆదేశించింది. నాగేశ్వరరావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించే ముందు అత్యున్నత కమిటీ ఆమోదం తీసుకున్నామని ఏజీ కోర్టుకు తెలియజేశారు. ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ... సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించే అధికారం కేంద్రానికి లేదని, అత్యున్నత కమిటీ సిఫార్సుల ఆధారంగానే ఈ నియామకం జరగాలని ఆయన కోర్టుకు తెలిపారు. దీంతో ఏకీభవించిన కోర్టు..'ఇప్పటివరకు రెగ్యులర్ డైరెక్టర్‌ను ఎందుకు నియమించలేదు. సీబీఐ డైరెక్టర్ పోస్టు చాలా సున్నితమైనది. అక్టోబర్ నుంచి ఈ వ్యవహారం నడుస్తున్నది. అలోక్‌వర్మ జనవరిలో రిటైర్ అవుతారని మీకు ముందే తెలుసు. మీరు ఇప్పటికే డైరెక్టర్‌ను నియమించాల్సింది' అని అభిప్రాయపడింది. ఈ విషయం కోర్టులో పెండింగ్‌లో ఉండిందని, గత నెలలో తీర్పు వెలువడిందని ఏజీ కోర్టుకు తెలిపారు. అత్యున్నత కమిటీ ఇదివరకే సమావేశమైందని, శుక్రవారం కూడా మరోసారి సమావేశమైందని వివరించారు. దీనిపై కోర్టు స్పందిస్తూ... సుదీర్ఘ కాలంపాటు 'తాత్కాలిక' పద్ధతి మంచిదికాదని స్పష్టం చేసింది. కాగా, నాగేశ్వరావు నియామకాన్ని జనవరి 8న సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని పారదర్శకంగా చేపట్టేలా చూడాలని ఆయన కోర్టును కోరారు. అయితే 'ముందు నియామకం జరుగనివ్వండి. ఈ ప్రక్రియలో పారదర్శకత లేదనిపిస్తే.. అప్పుడు మీరు సవాల్ చేయండి' అని ధర్మాసనం ఆయనకు సూచించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. మరోవైపు సీబీఐ చీఫ్ నియామకంపై అత్యున్నత స్థాయి కమిటీ శుక్రవారం రెండోసారి సమావేశమైంది. అయితే ఈ భేటీలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

బస్సీ బదిలీపై వివరణ ఇవ్వండి

పోర్టు బ్లయర్‌కు తనను బదిలీ చేయడాన్ని సవాల్ చేస్తూ డీఎస్పీ ఏకే బస్సీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆరు వారాల్లోగా సమాధానమివ్వాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దురుద్దేశంతో తనను బదిలీ చేశారని, సీబీఐ మాజీ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా అవినీతి కేసు విచారణపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ బస్సీ ఈ నెల 21న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



నిర్మాణ దశకు 'రామ మందిరం'

ఆరు నెలలు ఆగాలి: ఆరెస్సెస్ చీఫ్

అలహాబాద్, ఫిబ్రవరి 1: అయోధ్యలో రామ మందిరం నిర్మాణం అంశం నిర్ణయాత్మక దశకు చేరుకున్నదని ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్ పేర్కొన్నారు. రామ మందిరం నిర్మాణం కోసం వేచి చూస్తున్న వారు కొద్ది నెలల పాటు వేచి చూడాల్సి ఉన్నదని సూచించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో కుంభ్‌మేళా వద్ద విశ్వహిందూ పరిషత్ (వీహెచ్పీ) రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'ధర్మ సంసద్'లో శుక్రవారం చివరి రోజు ఆయన మాట్లాడుతూ.. 'రామ మందిరం నిర్మాణ దశకు చేరుకున్నది. కనుక మనమంతా ఆచితూచి ముందుకు వెళ్లాలి' అని అన్నారు. రామ మందిరం కోసం ప్రచారోద్యమం చేపడుతున్న వారు లక్ష్యం నుంచి పక్కదారి పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో ఆరు నెలల పాటు వేచి చూడాలని, తదుపరి మందిర నిర్మాణ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. మందిర నిర్మాణం కోసం ఏ ఆందోళన చేపట్టినా త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందన్నారు.

నిర్మాణం జరిగే వరకు విశ్రమించం

అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తయ్యే వరకు హిందువులు విశ్రమించబోరని వీహెచ్పీ ధర్మసంసద్ తీర్మానాన్ని ఆమోదించింది. వివాదాస్పద స్థలం కాక మిగిలి ఉన్న భూమిని రామ జన్మభూమి న్యాస్‌కు అప్పగించాలని సుప్రీంకోర్టును కేంద్రం కోరడాన్ని సంసద్ అభినందించింది. కేంద్రం అంచనాలకు అనుగుణంగానే పని చేస్తున్నదని సదస్సులో పాల్గొన్న సాధువులు పేర్కొన్నారు.

200 మంది విద్యార్థుల అరెస్ట్

మూడోపేజీ తరువాయి...

చేరారు. వీరిలో అత్యధికులు చదువుకునే ఉద్దేశంతో చేరినవారు కాదు. కనీసం క్లాసులకు హాజరైన రికార్డు కూడా వీరికి లేదు. ఈ కుట్రలో భాగస్వాములైన వారందరికీ ఈ వర్సిటీలో అధ్యాపకులు లేరని, తరగతులు జరుగవని ముందే తెలుసు' అని పేర్కొన్నారు. వీసా గడువు ముగిసినా సుమారు 600 మంది విదేశీ విద్యార్థులు అమెరికాలోనే ఉండేందుకు సహకరించిన ఎనిమిది మంది తెలుగు విద్యార్థులను మిషిగాన్ పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో ఆరుగురిని డెట్రాయిట్‌లో, ఇద్దరిని వర్జీనియా, ఫ్లోరిడాలో అరెస్టుచేశారు. వీరిపై వీసా అక్రమాలకు పాల్పడడం, తప్పుడు ధ్రువపత్రాల సమర్పణ, లాభాపేక్ష కోసం విదేశీయులకు అక్రమంగా ఆశ్రయం కల్పించడం వంటి అభియోగాలు మోపారు. ఈ మేరకు సంబంధిత పత్రాలను న్యాయవాదులు కోర్టుకు సమర్పించారు. 'నిందితులు ఉద్దేశపూర్వకంగా, లాభాపేక్షతోనే విదేశీ విద్యార్థుల నుంచి డబ్బులు వసూలుచేసి వారికి అక్రమంగా ఆశ్రయం కల్పించారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3.5 లక్షల నుంచి రూ.14.25 లక్షల వరకు వసూలు చేశారు' అని సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారు. అభియోగాలు రుజువైతే నిందితులకు గరిష్ఠంగా ఐదేండ్ల వరకు జైలు శిక్షపడే అవకాశం ఉంది. మరోవైపు డెట్రాయిట్‌లో అరెస్టయిన ఆరుగురు తెలుగు విద్యార్థులను సంకెళ్లతో గురువారం స్థానిక కోర్టుకు తీసుకువచ్చారు. అయితే, వీరికి బెయిల్ ఇచ్చేందుకు న్యాయమూర్తి నిరాకరించి, కేసు విచారణను సోమవారానికి వాయిదా వేశారు. కాగా, తాజాగా అరెస్టయిన విద్యార్థుల్లో పలువురికి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. వారు 60 మైళ్ల పరిధిని దాటిపోకుండావారికి జీపీఎస్ ట్యాగ్ తగిలించారు. అరెస్టు కానివారు ఫిబ్రవరి 5లోగా దేశం వదిలి వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరించారు. కాగా, ఇమ్మిగ్రేషన్ జడ్జిల డేట్స్ దొరకకపోవడంతో ఈ కేసు మరో రెండు వారాలు కొనసాగే అవకాశం ఉందని సమాచారం.

విద్యార్థులను ఆదుకుంటాం

అరెస్టయిన భారతీయ విద్యార్థులను ఆదుకుంటామని అమెరికా తెలుగు అసోసియేషన్ న్యాయ సహాయ విభాగమైన 'సేవా' చైర్‌పర్సన్ శివకుమార్ చెప్పారు. భారత రాయబారి హర్షవర్ధన్ సింగ్లాను ఇప్పటికే కలిసి విద్యార్థులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. భారత విదేశాంగ శాఖ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మాట్లాడుతూ... వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న కాన్సులేట్స్ నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. భారతీయ విద్యార్థులకు సహకారం అందించేందుకు సంబంధిత అమెరికా అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు.

న్యాయపరమైన సహకారాన్ని అందిస్తున్నాం

ఆటా అధ్యక్షుడు పరమేశ్ భీంరెడ్డి



'అమెరికాలో వీసా సమస్యల కారణంగా అరెస్టయిన విద్యార్థులకు అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) న్యాయపరమైన సహకారాలన్నీ అందిస్తున్నది. ఆ వర్సిటీలో అడ్మిషన్‌పొందిన తెలుగు విద్యార్థులంతా అరెస్టయ్యారనేది అవాస్తవం. 50-100 మంది వరకు మాత్రమే అరెస్టు అయ్యారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో అరెస్టుచేసిన 14 మందిని విడిచిపెట్టారు. వారు తిరిగి భారత్‌కు వెళ్లేందుకు అనుమతించారు. వివిధ సెంటర్లలో ఉన్న వారిని ఇంకా విడిచిపెట్టలేదు. వారిని జడ్జి ముందు ప్రవేశడుతారు'.

వీసా సమస్యలపై భయం లేదు

- అండగా నిలుస్తున్న టీఆర్ఎస్ అమెరికా సభ్యులు
- వీసా సమస్యలున్నవారికి ప్రత్యేకంగా అటార్నీల నియామకం
- కస్టడీ కేంద్రం వద్దకువెళ్లి బాధితులకు సహాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అమెరికాలో వీసా సమస్యల కారణంగా అరెస్టయిన విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరంలేదని, వారికి అండగా తాము ఉంటామని టీఆర్ఎస్ అమెరికా సభ్యులు భరోసా ఇస్తున్నారు. అరెస్టయిన విద్యార్థులకు ఓవైపు చట్టపరమైన ప్రక్రియలు పూర్తిచేస్తూ.. మరోవైపు వారిని వ్యక్తిగతంగా కలుసుకొని ధైర్యం నింపుతున్నారు. టీఆర్ఎస్ అమెరికా సభ్యులు మహేశ్ తన్నీరు, నవీన్ జలగం, నర్సింహారావు నాగులవంచ 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. 'ఇప్పటికే అరెస్టయినవారిని బయటకు తీసుకురావడం, మిగిలినవారిని రక్షించడం ఎలా అనే అంశంపై టీఆర్ఎస్ తరపున కృషిచేస్తున్నాం. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నాయి. స్వదేశంలోని వారి తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరంలేదు. అరెస్టయిన విద్యార్థుల్లో ప్రతి ఒక్కరికీ అటార్నీని నియమించి వారిని కస్టడీలోనుంచి బయటకు తెచ్చేందుకు కృషిచేస్తున్నాం. ఏ విధమైన నేరానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశంపై ఒకట్రెండురోజుల్లో స్పష్టత వస్తుంది. మెజార్టీ విద్యార్థులను స్వదేశానికి పంపించడం మినహా చట్టపరమైన చర్యలు తీసుకోకపోవచ్చు. ఫిబ్రవరి 5 తర్వాత అరెస్టయినవారు పది, పదిహేనేండ్లపాటు అమెరికా రాకుండా నిషేధం విధిస్తారు. గతంలో కొందరికి ఇలాంటి పరిణామాలు ఎదురైనా.. భవిష్యత్‌లో సరైన పత్రాలతో మళ్లీ వచ్చారు. వీరికీ అలాంటి అవకాశం ఉంటుంది' అని తెలిపారు. అమెరికాలో ఉన్న విద్యార్థుల్లో కాలేజీలకు హాజరుకానివారు అటార్నీని కలిసి తమ ఇమిగ్రేంట్ స్టేటస్‌ను వెరిఫై చేసుకోవాలని సూచించారు.

బలవంతంగా ముక్కు గొట్టాల ద్వారా ఆహారం

సిబ్బంది వేధింపుల తాళలేక డిటెన్షన్ సెంటర్లలో భారతీయుల నిరాహార దీక్ష

వాషింగ్టన్, ఫిబ్రవరి 1: అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి ఇప్పటికే వివిధ డిటెన్షన్ సెంటర్లలో ఉన్న భారతీయులతో పాటు ఇతర విదేశీయుల పరిస్థితి దయనీయంగా ఉంది. అక్కడి సిబ్బంది వేధింపుల తాళలేక వారు నిరాహార దీక్షకు దిగుతున్నారు. వీరి దీక్షను భగ్నం చేసేందుకు అధికారులు ముక్కు గొట్టాల ద్వారా ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. దేశం నుంచి వెళ్లగొడతామని బెదిరించడమే కాకుండా, తమ కేసులను తేల్చకుండా సిబ్బంది మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. టెక్సాస్‌లోని ఎల్‌పాసో సెంటర్‌లో దీక్ష చేస్తున్న 11 మందిలో ఆరుగురికి బలవంతంగా ఫ్లూయిడ్స్ ఎక్కించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో భారతీయులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఈ చర్యపై భారతీయ అమెరికన్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టెక్సాస్ సెంటర్‌లో అదుపులో ఉన్న ఇద్దరు భారతీయుల లాయర్ అయిన రూబీ కౌర్ మాట్లాడుతూ.. తమ క్లయింట్లు దక్షిణ సరిహద్దు ద్వారా ఆరు నెలల కిందట దేశంలోకి ప్రవేశించారని, వారే స్వయంగా అధికారుల ఎదుట లొంగిపోయారని చెప్పారు. వారిద్దరూ కూడా నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. అయితే వారికి ఇష్టం లేకపోయినా బలవంతంగా ముక్కు ద్వారా ఫ్లూయిడ్స్ ఎక్కించారని విమర్శించారు. గురువారం వారిద్దరూ తనకు ఫోన్ చేశారని, ముక్కు దగ్గర రక్తస్రావం అవుతున్నదని, వాంతులు కూడా అవుతున్నట్లు చెప్పారన్నారు. ఫ్రీడమ్ ఫర్ ఇమ్మిగ్రెంట్స్ అనే స్వచ్ఛంద సంస్థ కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిస్టినా ఫియాల్హో మాట్లాడుతూ... ఎల్‌పాసో డిటెన్షన్ సెంటర్‌లో 30 మంది వరకు నిరాహార దీక్ష చేస్తున్నారని, అయితే ఐసీఈ అధికారులు మాత్రం ఈ సంఖ్యను తగ్గించి చెబుతున్నారని ఆరోపించారు. బలవంతంగా ఫ్లూయిడ్స్ ఎక్కించడం క్రూరమైన చర్యగా ఆమె అభివర్ణించారు. ఎల్‌పాసో సెంటర్‌లో 11 మంది భారతీయులు నిరాహార దీక్ష చేస్తున్నారని నార్త్ అమెరికన్ పంజాబీ అసోసియేషన్ ఓ ప్రకటనలో వెల్లడించింది. బాధితులకు బలవంతంగా ఆహారం అందించడం మానవ హక్కుల ఉల్లంఘనే అని మండిపడింది. కొంత మంది 30 రోజులుగా నిరహార దీక్ష చేస్తున్నారని తెలిపింది.

7 శాతం వృద్ధిరేటు ఎలా సాధ్యం?

గరిష్ఠస్థాయిలో నిరుద్యోగిత రేటు ఉన్నా ఎలా నమోదైందన్న కాంగ్రెస్ నేత చిదంబరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీడీపీ గణాంకాలపై కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ చిదంబరం అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగిత రేటు 45 ఏండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుంటే, సగటు ఆర్థిక వృద్ధిరేటు మాత్రం 7 శాతం ఎలా సాధ్యమైందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జీడీపీ గణాంకాలను సవరించినప్పుడు, నిరుద్యోగిత గణాంకాలను కూడా సవరించాలన్న విషయాన్ని గుర్తించలేకపోయిందని ఎద్దేవా చేశారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ)కు సంబంధించిన లేబర్ ఫోర్స్ సర్వేపై గురువారం మీడియాలో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే ఈ సర్వేను ఇంకా ఫైనలైజ్ చేయలేదని కేంద్రం గురువారం తెలిపింది. ఈ సర్వే వివరాల ప్రకారం... దేశంలో నిరుద్యోగిత రేటు 2017-18లో 45 ఏండ్ల గరిష్ఠానికి (6.1 శాతం) చేరుకుంది. కాగా, ఉద్యోగ వివరాలపై కొత్త నివేదికను రూపొందించనున్నట్లు ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారు బిబేక్ డెబ్రాయ్ వెల్లడించారు. ఉద్యోగాల్లో గణనీయ వృద్ధి సాధించినట్లు ఆ నివేదిక ద్వారా తెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.



నమస్తే తెలంగాణ

జిందగీ

శనివారం 2 ఫిబ్రవరి 2019

WWW. NTNEWS.COM /nt.zindagi

జనవరి 26.. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు.. మువ్వన్నెల జెండా రెపరెపలు.. వేలాది ప్రజల అభివాదాల మధ్య సైనిక కవాతు.. మరోవైపు త్రివిధ దళాల సైనిక వందనం.. శకటాల ప్రదర్శన.. సైనికుల బూట్ల చప్పళ్లతో రోమాలు నిక్కపొడుస్తున్న సందర్భమది. అంతమందిలో ఆసక్తిగా ఎదురు చూస్తున్నదో కుటుంబం. ఇంతలోనే 144 మంది పురుష సైనికులకు నాయకత్వం వహిస్తూ.. ఓ మహిళా లెఫ్ట్‌నెంట్ ముందుకు వచ్చారు. ఆ కుటుంబం కళ్లలో ఆనందభాష్పాలు. ఊపిరినంతా బిగబట్టి.. ఉబికి వస్తున్న ఆనంద భాష్పాలతో లెఫ్ట్‌నెంట్‌కు సెల్యూట్ చేశారు. ఆ రోజు కోసం.. ఆ కుటుంబం ఎంత కష్టడిందో తెలుసా?

దేశం తర్వాతే కుటుంబం!

కన్నతల్లి కలలు, తాతయ్య, అమ్మమ్మల ఆశలు.. ఆ లెఫ్ట్‌నెంట్ ఆశయాలు పరిసమాప్తమైన రోజది. ఆర్మీ లెఫ్ట్‌నెంట్ భావన కస్తూరి కుటుంబం.. తమ ఇంటి ఆడబిడ్డ ఎదుగుదలను 'జిందగీ'తో ఇలా పంచుకున్నారు.



తాతయ్య జయంత్ బాబు, అమ్మమ్మ జ్యోతి, తల్లి శశిరేఖ

ఓ కాగితానికి దారం కట్టి ఎగురవేస్తే.. మనకు అందనంత ఎత్తుకు వెళ్తుంది. చూసేవారికి అది గాలిపటం. అంత ఎత్తులో ఉన్న ఆ పటానికి తెలుసు.. తాను ఓ దారంపై ఆధారపడ్డానని. ఆ దారానికి తెలుసు.. ఆ కాగితం ఎప్పటికైనా గాలిపటమై అందనంత ఎత్తుకు ఎదుగుతుందని. ఎందుకంటే ఆ మాటల్లో ఇరువురి కష్టం, ఇష్టం ఉన్నాయి కాబట్టి. అలాంటిదే ఈ సందర్భం. ఎంతకష్టమైనా ఇష్టంతో పనిచేసి లెఫ్ట్‌నెంట్ ఆఫీసర్ స్థాయికి చేరుకుంది భావన కస్తూరి. ఆదే స్ఫూర్తితో 144మంది పురుష సైనిక బృందానికి నాయకత్వం వహించి.. 23 సంవత్సరాల చరిత్రను తిరగరాసింది. ఆమె మన తెలంగాణ ముద్దుబిడ్డ. అచ్చమైన హైదరాబాదీ. స్వశక్తితో, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో తెలంగాణ సత్తాను ఢిల్లీలో చాటిచెప్పిన ధీరవనిత. భావన ఈ స్థాయికి రావడానికి ఎంత కష్టపడిందో కొందరికే తెలుసు. ఎన్ని అడ్డంకులను ధైర్యంతో ఎదుర్కొన్నదో తనకు, తన కుటుంబానికే తెలుసు. వాటిని ఆవిష్కరించే ప్రయత్నమిది.

అమ్మ స్టెనోగ్రాఫర్: సంప్రదాయబద్ధమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది భావన. ఆడపిల్ల ఇంటికే పరిమితమవ్వాలనే తత్వానికి ఆ కుటుంబం వ్యతిరేకం. అందుకే భావన తాతయ్య జయంత్ బాబు తన బిడ్డలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అంతే స్వేచ్ఛను తన కూతురికి ఇచ్చారు తల్లి శశిరేఖ. అందుకే భావన అంటే ఏంటో ఇప్పుడు దేశానికి తెలిసింది. భావన తల్లి శశిరేఖ హైదరాబాద్‌లోని కార్మిక న్యాయస్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తుంది. భావన చిన్నతనంలోనే తండ్రి తన తల్లి నుంచి దూరమయ్యాడు. అయినా శశిరేఖ కృంగిపోలేదు. తన కూతురి కోసమే జీవించింది. కుటుంబ ఖర్చులకు సరిపడేంత వేతనమే వచ్చినా.. కూతురి ఇష్టాయిష్టాలను ఎప్పుడూ కాదనలేదు.అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్న భావన.. తన తాహతుకు మించి ఎప్పుడూ ఏదీ కుటుంబాన్ని కోరలేదు. ఉన్నదాంట్లోనే అన్నీ సరిపెట్టున్నారు. తాతయ్య జయంత్ బాబు, అమ్మమ్మ జ్యోతి, తల్లి శశిరేఖ.. వీరే తన ఆనందం. కూచిపూడి, యోగ, సంగీతం, పాటలు పాడడం ఇవే తన ప్రపంచం.

ఆమెలో మరో కోణం..



- భావన యోగాలో మూడుసార్లు రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా నిలిచారు. • కర్రసాములోనూ ప్రావీణ్యం సంపాదించారు. • ఎన్‌సీసీలో బెస్ట్ క్యాడెట్‌గా ప్రతిభా పాటిల్ నుంచి మెడల్ అందుకున్నారు. • 2013లో హెచ్‌ఆర్‌డీ స్కాలర్‌గా ఎంపికైంది. సౌత్ ఇండియా నుంచి ఎంపికైంది భావన ఒక్కరే. • గ్రాడ్యుయేషన్‌లో కాలేజ్ టాపర్‌గా నిలిచి, ఓయూలో మైక్రోబయాలజీ డిస్టింక్షన్‌లో పాసయ్యారు. • కూచిపూడిలో చాలా ప్రావీణ్యం ఉన్నది. మన దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో, మలేషియా, సింగపూర్, దుబాయ్ దేశాల్లో కూచిపూడి ప్రదర్శన ఇచ్చారు. • పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి సంగీతం, డ్యాన్స్‌లో డిప్లొమా పొందారు. • కర్ణాటక వోకల్ సంగీతంలో చక్కగా పాటలు పడుతారు. • గుర్రపుస్వారీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఈత, రాకెట్ లాంచింగ్, ఫైరింగ్, రోప్ పుషింగ్ వంటి శిక్షణల్లో ఆరితేరారు భావన. • పరేడ్, పరుగుల్లో పురుష జవాన్లతో సమానంగా పాల్గొంటారు. • తన బ్యాచ్‌లో 250 మంది ఉంటే అమ్మాయిల సంఖ్య 30. అంతమందిలోనూ అన్ని శిక్షణల్లో ఒక్క దెబ్బ తగలకుండా మెరిట్ సాధించిన ఏకైక జవాను భావన. • శిక్షణ పూర్తయ్యేసరికి అకాడమీలో టాప్–5లో నిలిచి.. బిపిన్ రావత్ నుంచి అభినందన అందుకున్నారు. • తన మొదటి పోస్టింగ్ కార్గిల్‌లో ఇచ్చారు.



దారి చూపిన ఎన్‌సీసీ: చిక్కడపల్లిలోని అరోర డిగ్రీ కాలేజ్‌లో చదువుతున్నప్పుడు ఎన్‌సీసీలో జాయిన్ అయ్యారు భావన. చురుగ్గా పాల్గొంటూ మంచి క్యాడెట్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్నో క్యాంపుల్లో సుపీరియర్స్‌తో శెభాష్ అనిపించుకున్నారు. 2010లో ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికయ్యారు భావన. అక్కడ సైనికుల కవాతు, దేశ సేవలో వారి త్యాగాలు ఆమెలో స్ఫూర్తిని రగిలించాయి. అప్పుడే ఆర్మీ ఆఫీసర్ అవ్వాలని దృఢంగా నిశ్చయించుకున్నారు. తన లక్ష్యాన్ని, ఆశయాన్ని ఇంట్లో చెబితే.. వారు కూడా అంగీకరించారు. ఎందుకంటే భావన అంటే ఒక విశ్వాసం. తాను ఏం చేసినా ఆలోచించే నిర్ణయం తీసుకుంటుందని కుటుంబసభ్యుల నమ్మకం. అందుకే తన నిర్ణయానికి అడ్డుచెప్పలేదు. అప్పటి నుంచి దేశ సేవే తన ప్రపంచంగా మలుచుకున్నారు భావన. ఈ క్రమంలో ఇష్టమైన లక్ష్యం కోసం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. రేయింబవళ్లు శ్రమించి, తన శరీరాన్ని ఆర్మీ నిబంధనలకు తగ్గట్లు మలుచుకున్నారు. రాత్రిళ్లు పది నుంచి అర్ధరాత్రి వరకు చదువుకునేవారు. మూడు విఫలయత్నాల తర్వాత.. ఆర్మీ సర్వీస్ కారప్స్ విభాగంలో ఉద్యోగం సంపాదించి తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. అప్పటి నుంచి 'దేశం తర్వాతే కుటుంబం' అంటూ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టారు.

వారందరికీ సమాధానం చెప్పింది: 'ఆర్మీ శిక్షణ అంటే చాలా కష్టం. నువ్ ఆడపిల్లవి. నీ వల్ల కాదు..' అనే మాటలు ఒకవైపు నుంచి వినబడుతుంటే.. 'చక్కగా నాట్యం నేర్చుకున్నావ్. సంగీతం బాగావచ్చు. ప్రయత్నిస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వస్తుంది. నీ భవిష్యత్తు చాలా బాగుంటుంది. పెండ్లి చేసుకోక ఈ తిప్పలన్నీ నీకెందుకు' అనే మాటలు మరోవైపు వినపడుతున్నాయి. ఇలా చెప్పేవాళ్లంతా బంధువులు, స్నేహితులు, తెలిసినవాళ్లే. అయినా తల్లి అవేం పట్టించుకోలేదు. కూతురి ఇష్టానికే వదిలేసింది. తర్వాత భావన ఆర్మీకి వెళ్లడం ఇష్టంలేని బంధువులంతా.. రిపబ్లిక్ డే పరేడ్‌లో తనను చూసి గర్వంగా చెప్పుకుంటున్నారు. చాలామంది ఫోన్ చేసి శుభాకాంక్షలు చెబుతున్నారు. 'అప్పుడు నేను వాళ్ల మాటలు విని ఉంటే.. నేడు నా కూతురు దేశానికి సేవ చేసేది కాదు' అంటూ నాటి సంఘటనను చెప్పుకొచ్చారు భావన తల్లి శశిరేఖ. ఇప్పుడు తనకు మంచి కుటుంబం దొరికింది. భర్త కూడా ఆర్మీలో డాక్టర్.

మరిచిపోలేని సంఘటన: చిన్నవయసులోనే తండ్రి దూరమవడంతో అమ్మమ్మ, తాతయ్యల వద్దనే పెరిగారు భావన. ఆమె అంటే వారికి ప్రాణం. ఐదో యేట నుంచే కూచిపూడిలో శిక్షణ ఇప్పించారు. అంత చిన్న వయసులో ముద్దులొలికే మోముతో.. బుడిబుడి అడుగులతో నృత్యం చేస్తుంటే మురిసిపోయేవారు తాతయ్య. తండ్రి దూరమైన భావనను తన మూడో కూతురిలా పెంచాను అంటున్నారు తాతయ్య జయంత్ బాబు. ఆర్మీ శిక్షణ తీసుకుంటున్న కొత్తలో ఓసారి.. 'తాతయ్య నా కాళ్లకు బొబ్బలు వచ్చాయి. సాక్సులు కూడా పట్టడం లేదు. అయినా మీరేం బాధపడకండి నేను బాగానే ఉన్నా. ఎలాగైనా దేశ సేవ చేయాల్సిందే' అని భావన చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు జయంత్ బాబు. అలాంటి కష్టాలను ఎన్నో అనుభవించారు భావన. ఎంత కష్టమొచ్చినా తల్లికి చెప్పుకునేది కాదు భావన. ఆమెతో కేవలం సంతోషాన్నే పంచుకునేది. 'అయినా నా మనవరాలికేమండి.. బంగారం. తను ఇంకా ఉన్నతస్థానాలను అధిరోహిస్తుంది. మాకు ఆ నమ్మకం ఉంది' అని చిరునవ్వుతో చెబుతున్నారు. ఎందుకంటే ఆమె ప్రతి విజయంలోనూ, అపజయంలోనూ వీరంతా వెన్నంటి ఉన్నారు కాబట్టే అంత నమ్మకం.

...డప్పు రవి

పరుగులో జీవకారుణ్య



మారథాన్ రన్నింగ్ రేస్‌లో పాల్గొనడమే ఒక సాహసం. అలాంటిది చిన్న కుక్కపిల్లని చేతిలో పట్టుకొని 30 కిలోమీటర్లు పరుగు తీసిందో మహిళ . ఇంతకూ ఎవరామె? అసలు చేతిలో కుక్కపిల్లనెందుకు పట్టుకున్నది?

అది థాయ్‌లాండ్.. రాచువబురిలోని మారథాన్ రన్నింగ్‌రేస్. అందరూ పరుగులు తీస్తున్నారు. 42 కిలోమీటర్ల దూరం ఉన్న రన్నింగ్ రేస్‌లో ఖెమ్‌జిరా క్లోంగ్సనున్ కూడా ఉంది. వీరంతా పరుగు పరుగున వెళుతున్నారు.. ఇంతలో ఒక చిన్న కుక్కపిల్ల బిక్కుబిక్కుమంటూ రోడ్డు మీదకి వచ్చింది. ఎవరూ పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఖెమ్‌జిరా కూడా అలాగే వెళుతుంది అనుకున్నారంతా ఆమె పరుగును చూసి. కానీ మెరుపు వేగంతో ఆ కుక్కపిల్లను అందుకున్నది ఆమె. మధ్యలో వదిలేయలేని పరిస్థితి. లక్ష్యం చేరే వరకు దాన్ని వదల్లేదు. చివరిలైన్ దాటిన తర్వాత 'చోంబుంగ్' అనే పిల్లాడు వచ్చాడు. ఆ కుక్కపిల్ల తనదే అని తీసుకెళ్లాడు. అయితే.. కుక్కపిల్లను వెంట పెట్టుకొని పరిగెత్తే వీడియో ఇపుడు సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతున్నది. అసలు పరుగెత్తడమే కష్టమనుకుంటే చేతిలో కుక్కపిల్లను పట్టుకొని 30 కిలోమీటర్లు దాటి అది కూడా లక్ష్యం చేరుకోవడం అనేది అద్భుతం అని నెటిజన్లు పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

అందంగా ఉండాలంటే!



శుభ్రత : అందానికి మొదటి మెట్టు శుభ్రత. శరీరం లోపలా, బయట శుభ్రంగా ఉండాలి. తినే ఆహారం జీర్ణం అయ్యేలా చూసుకోవాలి. లేదంటే ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి.

నోటి ఆరోగ్యం : దంతాల గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. నోటి దుర్వాసన లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిఒక్కరికీ నడక చాలా అవసరం. నడకతో పాటు చిన్న వ్యాయామాలు చేయడం మంచిది.

డైటింగ్ : వ్యర్థ పదార్థాలు తినకుండా పోషకాహార విలువలు కలిగిన ఆహారం అందానికి మంచి మార్గం. శరీరానికి శుభ్రతని, పుష్టిని ఇచ్చే కూరగాయలు, పండ్లు, మజ్జిగ వంటి పదార్థాలు తీసుకుంటే చర్మం మృదువుగా మెరిసిపోతుంది.

విశ్రాంతి : ఎక్కువ ఆందోళనలు, భయాలు కలిగించే పనులకు కొంచెం దూరంగా ఉండాలి. వినోదం, సంగీతంతో మెదడుకి విశ్రాంతి కలిగించాలి. మానసిక ప్రశాంతత ముఖానికి కాంతిని, ఆకర్షణని ఇస్తుంది.

మెడికల్ చెకప్స్ : ఎంత ఉత్సాహంగా ఉన్నా నెలకి ఒకసారి మెడికల్ చెకప్ చేయించుకోవాలి. అనారోగ్యం లేకుండా జాగ్రత్త పడాలి.

ఈ మొక్కలు వద్దు



చాలామందికి మొక్కలంటే చాలా ఇష్టం. రకరకాల మొక్కల్ని ఇంట్లో పెంచుకుంటారు. కానీ, కొన్ని మొక్కల్ని ఇళ్లల్లో పెంచడం వల్ల ఇంటికి నెగెటివ్ ఎనర్జీ వస్తుంది.

- కాక్టస్ దాని సంబంధిత మొక్కలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంట్లో ఉంచుకోకండి. అవి ఇంట్లో ఉంటే దరిద్రం మిమ్మల్ని పట్టి పీడిస్తుందని అనుభవజ్ఞులు చెప్తారు. అయితే గులాబీ మొక్క కూడా కాక్టస్ జాతికి చెందినదే అయినా సమస్య ఉండదు. ఆ మొక్క తప్ప కాక్టస్ జాతికి చెందిన ఏ మొక్కయినా ఇంట్లో ఉంచుకోకండి.
- బోన్సాయ్ మొక్కలను చాలామంది ఇంట్లో పెంచుకుంటూ ఉంటారు. వాటిని ఇంట్లో పెంచుకోవడం అంత మంచిది కాదు. బోన్సాయ్ మొక్కల్ని ఇంటిముందు ఖాళీ స్థలంలో లేదంటే గార్డెన్‌లో పెంచుకుంటే మంచిది.
- చింత, గోరింటాకు చెట్లను ఎట్టిపరిస్థితుల్లో ఇంటి ప్రాంగణంలో పెంచకూడదు. అవి ఇంటికి కాస్త దూరంలో ఉంటే మంచిది. ఇంటికి దగ్గర్లో చింత, గోరింటాకు చెట్లు ఉంటే దరిద్రం అంటారు.
- చాలామంది ఇళ్లలో చనిపోయిన మొక్కలు కుండీలలో దర్శనమిస్తుంటాయి. వాటిని అలానే వదిలేయకండి. ఫలితంగా దురదృష్టం పట్టి పీడిస్తుందని పెద్దలు అంటారు. అందుకూ అలాంటి మొక్కల్ని వీలైనంత వరకు తీసిపారేయండి.

వంట చిట్కాలు



- గుడ్లు ఉడికించేటప్పుడు కొద్దిగా చింతపండు వేస్తే కుక్కర్ నల్లగా అవ్వకుండా ఉంటుంది.
- అల్లంవెల్లుల్లి పేస్ట్ ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే ఉప్పు, పసుపు కలిపి పెట్టుకోవాలి.
- ముదురుగా ఉండి మటన్ ముక్క ఉడక్కపోతే చిన్న పచ్చి బొప్పడి ముక్క వేయాలి.
- గోరువెచ్చని పాలలో కొంచెం ఉప్పువేసి నిమ్మరసం పిండితే మజ్జిగలా తయారవుతుంది.
- కూరల్లో ఉప్పు ఎక్కువైతే రెండు చెంచాల పాల మీగడ కలిపితే రుచిగా ఉంటాయి.
- బొబ్బట్లు సరిగా రాకుంటే చెంచాడు గోధుమరవ్వ కలిపితే బాగా వస్తాయి.
- కాచేటప్పుడు పాలల్లో కొంచెం తినేసోడా వేస్తే పాలు విరగవు.

ఆర్గానిక్ సాగులో ఆమె ఆదర్శం!







ఎకరాల కొద్దీ భూమి ఉన్నవాళ్లే వ్యవసాయం చేసి పంటలు పండిస్తారా? ఆలోచనే పెట్టుబడి అయితే మిద్దెపై కూడా చిన్నపాటి తోటవేసి మంచి లాభాలు గడించొచ్చు అని నిరూపించారు భోపాల్‌కు చెందిన డాక్టర్ అర్చన. ఆర్గానిక్ వ్యవసాయంలో ఆమె ఎలా రాణించింది? ఆదర్శవంతంగా ఎలా నిలిచింది? తెలుసుకుందాం.

అర్చనకు గార్డెనింగ్ అంటే ఇష్టం. ఏదో సరదా కోసం కాకుండా పంటలు పండించాలని అనుకున్నది. కానీ ఆమెకు వ్యవసాయం తెలియదు. అందులోనూ మిద్దెపై సాగు చేసే పని కాబట్టి ఎలా అనుకున్నది. తన ఆలోచనను భర్త భార్గవతో పంచుకొని టెర్రస్ గార్డెనింగ్ కోర్సు చేసింది. మొదట్లో టెర్రస్‌పై నాలుగైదు పంటలు పండించేది. కష్టం అనుకున్న పని ఈజీ అని తెలిశాక విస్తరింపజేయాలనుకున్నది. ఎలాంటి రసాయనాలు వాడకుండే పండించే కూరగాయలపై అధ్యయనంచేసింది. పంటల రకాలను.. సాగు విధానాలను విస్తరింపజేసింది. ప్రస్తుతం 40– 50 రకాల కూరగాయలు సాగుచేస్తున్నది. బచ్చలికూర.. కరేవేపాకు.. టమాట.. కాలీఫ్లవర్.. క్యాబేజీ.. అడవి క్యాబేజీ.. పాలకూర.. బంగాళదుంప.. స్ట్రాబెరీ.. ద్రాక్ష వంటివి పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది. ఆవుపేడను ఎరువుగా వాడిన ఆమె తర్వాత కంపోస్ట్ ఎరువును తయారుచేస్తూ ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నది. బోపాల్‌లో ఇప్పుడామె అందరికీ ఆర్గానిక్ అర్చనగా సుపరిచితురాలు. పట్టణ ప్రాంతాల్లో ఉండేవాళ్లు కూడా ఇలాంటి పనులు చేసి సంపాదించవచ్చు అనే కొత్త పనిని అక్కడివాళ్లకు అలవాటు చేసిన ఘనత ఆమెదే.

II.
నమస్తే తెలంగాణ
నిధి
[కరీంనగర్]
శనివారం 2 ఫిబ్రవరి 2019

ఐటీ మినహాయింపు పొందడం ఎలా..

మరో రెండు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసిపోనున్న నేపథ్యంలో ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి సమయం ఆసన్నమైంది. రోజు రోజుకు పెరుగుతున్న ఖర్చులు, మరోవైపు పన్నుల రూపంలో తడిసి మోపెడు అవుతున్న సామాన్యుడినికి ఊరటనిస్తూ నరేంద్ర మోదీ సర్కార్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. దీంతోపాటు ఈ పన్ను నుంచి మినహాయింపు పొందడానికి ఎన్నో అవకాశాలున్నాయి. వీటిలో ఈక్విటీతో అనుసంధానం కలిగిన పొదుపు పథకాలు(ఈఎల్ఎస్ఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్), ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్)ల ద్వారా ఆదాయ పన్ను నుంచి మినహాయింపు పొందవచ్చును. ఆదాయ పన్ను చట్టం 80సీ ప్రకారం పన్ను చెల్లింపులు జరిపేవారు తమ పెట్టుబడులపై పన్ను రాయితీ పొందే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ముందుగా పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని లెక్కించాలి. అలాగే ప్రస్తుతం పన్ను శ్లాబులు, పన్ను వసూళ్ల గురించి నిశితంగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. వీటి ఆధా



రంగా పన్ను ఎంతమేర చెల్లించేదానిపై చార్టర్డ్ అకౌంటెంట్ల నుంచి సమాచారం సేకరించుకొని ఆ తర్వాత ఐటీ చెల్లింపులు జరుపాల్సి ఉంటుంది. ఉదాహరణకు రమేష్ అనే వ్యక్తి సంవత్సరానికి రూ.10 లక్షలు సంపాదిస్తున్నారనుకో. నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం రూ.5 లక్షల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత సంపాదించిన దానిపై లెక్కించి పన్ను విధించడం జరుగుతున్నది. దీంట్లో కూడా ఇంటి ఖర్చు, పిల్లలు ఉంటే వారి విద్యకోసం పెట్టే ఖర్చు, వ్యవసాయం, బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలు, ఇతర ఖర్చులను చూపించుకొని పన్ను మినహాయింపు పొందవచ్చును. వీటితోపాటు ట్యాక్స్ లయబిలిటీ కింద పన్ను ప్రయోజనాలు పొందాలంటే పన్ను పొదుపులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా పన్ను ప్రయోజనాలు పొందవచ్చును. పన్ను కింద వచ్చే ఆదాయం గురించి నిశితంగా పరిశీలిద్దాం..

మీకు ఏయే రూపంలో వచ్చే ఆదాయాన్ని ఒక్క జాబితాను రూపొందించుకోవాలి..వీటిలో వేతనం, బ్యాంక్ డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రెంటల్ ఆదాయం లాంటివి

ఒకవేళ వేతన జీవులైతే..బేసిక్ జీతం, కరువు బత్తెం(డీఏ), కమీషన్, బోనస్, ఇంటి అద్దె అలవెన్స్(హెచ్ఆర్ఏ) వంటివి. వీటితోపాటు దివాలీ బోనస్, వార్షిక బోనస్ లాంటి ద్వారా కూడా ఐటీ మినహాయింపు పొందవచ్చును. ఆదాయ పన్ను చట్టం 80 సీ ప్రకారం రూ.1.5 లక్షల వరకు ఐటీ పన్ను మినహాయింపు కింద క్లెయిం చేసుకోవచ్చును. తాము సంపాదించిన మొత్తం ఆదాయంలో ఈ లక్షన్నర రూపాయలను క్వాలిఫైడ్ సెక్షన్ 80సీ కింద నేరుగా తగ్గించుకునే అవకాశం పన్ను చెల్లింపుదారులకు ఉంటుంది. అలాగే వేతన జీవులు..ఇంటి అద్దె అలవెన్స్(హెచ్ఆర్ఏ)ను దాఖలు చేసి పన్ను క్లెయిం పొందవచ్చును. మొత్తం ఆదాయం–(హెచ్ఆర్ఏ మినహాయింపు+80సీ సెక్షన్ కింద పెట్టిన పెట్టుబడులు)= పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రానున్నది. పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం గురించి తెలుసుకున్న తర్వాత ఏయే శ్లాబులు ఎంతమేర పన్ను చెల్లించేదానిపై ప్రస్తుతం తెలుసుకుందాం...

2019-20 ఆర్థిక సంవత్సరానికి విధించనున్న పన్ను..

ఆదాయం	పన్ను(%)
రూ.5 లక్షల వరకు	0
రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు	5
రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు	20
రూ.20 లక్షలకు పైగా ఆదాయంపై	30

వీటితోపాటు ఆరోగ్య, విద్య సెస్ కింద మరో 4 శాతం చెల్లించాల్సి ఉంటుంది. రూ.5 లక్షలతోపాటు మరో రూ.1.5 లక్షల లోపు ఆదాయం కంటే ఎక్కువ సంపాదించిన దానిపై కచ్చితంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ మిగులు ఆదాయం పన్ను నుంచి మినహాయింపు పొందే అవకాశాలు మాత్రం లేవు. కానీ కొన్ని అత్యవసర సమయాల్లో మినహాయింపు పొందేందుకు ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం బిల్లు(సెక్షన్ 80డీ), చికిత్స కోసం పెట్టే ఖర్చుపై(సెక్షన్ 80డీడీ), మెడికల్ ట్రిట్‌మెంట్(సెక్షన్ 80డీడీబీ), ఉన్నత చదువుల నిమిత్తం తీసుకున్న రుణాలపై చెల్లించే వడ్డీ(సెక్షన్ 80ఈ), పలు చారిటబుల్ ట్రస్టులు, దేవాలయాలకు ఇచ్చే విరాశాల ద్వారా పన్ను మినహాయింపు పొందవచ్చును.

సుడోకు

డైలీ సుడోకు 54 సమాధానం

6	3	1	2	9	4	8	7	5
2	4	8	7	5	1	3	6	9
7	5	9	6	8	3	1	2	4
3	1	5	9	2	6	4	8	7
4	6	7	5	1	8	2	9	3
9	8	2	3	4	7	6	5	1
8	2	3	4	7	9	5	1	6
5	9	4	1	6	2	7	3	8
1	7	6	8	3	5	9	4	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -55

	6					4	5	
		3		1		6		
9								
		8	4		1	5		2
1			8		5	3	7	9
					7			
	2	1		7	3		8	
				6				
7								

బీమా.. ఇది ఉంటే ప్రతి ఒక్కరికీ ఓ ధీమా. బీమా ప్రయోజనాలు అన్నీఇన్నీ కావంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా కుటుంబానికి పెద్ద దిక్కు దూరమైతే.. ఆ వ్యక్తి బీమా మిగతా కుటుంబ సభ్యులకు ఎంత ఆసరాగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే దయనీయ పరిస్థితుల్లో ఆర్థిక రక్షణను అందించేదే బీమా. ఆరోగ్య బీమాతో ఆర్థిక భరోసాతోపాటు ఆస్పత్రి ఖర్చులూ అందుతున్నాయి. జీవిత బీమాతో చనిపోయినవారిపై ఆధారపడినవారికి భద్రత లభిస్తున్నది. అయితే బీమాల క్లెయింల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. కొన్ని సమయాల్లో క్లయిములు తిరస్కరణకు గురవుతున్నాయి. దీనివల్ల అసలే ఇబ్బందుల్లో ఉన్నవారికి ఆర్థిక సమస్యలు చుట్టుముడుతున్నాయి. కాబట్టి ఎందుకిలా జరుగుతున్నది అన్నది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఒక్కసారి వాటిని తెలుసుకుందామా..



బీమా పాలసీ తీసుకుంటున్నారా?

ఈ పొరపాట్లు చేయొద్దు

జీవిత లేదా ఆరోగ్య బీమా కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు.. బీమా సంస్థలు మీ వివరాలన్నింటిని తీసుకుంటాయి. ఈ సమయంలో మీరు తప్పుడు వివరాలనుగానీ, అసత్య సమాచారాన్నిగానీ ఇచ్చినట్లయితే బీమా క్లెయింల సమయంలో ఇబ్బందులు తప్పవు. చాలామంది ప్రీమియాన్ని తగ్గించుకోవడానికి తమ గురించిన తప్పుడు వివరాలను బీమా ఏజెంట్లకు ఇస్తూంటారు. వయసు, ఆరోగ్య సమాచారం ఇలాంటి వాటిల్లో అబద్ధాలు బీమా సొమ్మును రాబట్టుకోవడంలో ప్రధాన అడ్డంకిగా నిలుస్తాయన్నది మరువరాదు. మీరిచ్చిన సమాచారం అవాస్తవం అని బీమా సంస్థ గుర్తిస్తే..క్లెయింలను తిరస్కరిస్తుంది. కాబట్టి బీమా వివరాలను జాగ్రత్తగా చదివి.. సరైన సమాచారం ఇవ్వడం ప్రధానం. ఒకవేళ దరఖాస్తు ఫారాల్లో అడిగినది మీకు సంబంధించినది కానట్లయితే అప్పుడు 'NA' అనిగానీ లేదంటే 'X' గుర్తునుగానీ పెట్టండి. దీనివల్ల ఆ తర్వాత అక్కడ ఎవరైనా తప్పుడు సమాచారం నింపడానికి అవకాశం ఉండదు. అన్నీ పూర్తయ్యాక మీరు నింపిన ఫారాన్ని ఓ ఫోటో తీసి భద్రపరుచుకోండి. రేపటి రోజుల్లో సమస్యలు వస్తే అది ఉపయోగపడగలదు.

పాలసీ బకాయిలు



బీమా పాలసీలు తీసుకున్నప్పుడు వాటి ప్రీమియం చెల్లింపుల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గడువులోగా నిర్ణీత చెల్లింపులు చేసినట్లయితే పాలసీ సజావుగా సాగుతుంది. అలాకాకుండా సక్రమంగా చెల్లించకపోతే పాలసీ ప్రయోజనాలు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి బీమా ప్రీమియం చెల్లింపులు ఎప్పుడూ కూడా ఆలస్యం కాకుండా, బకాయిలు పడకుండా చూసుకోవడం ఉత్తమం. సాధారణంగా బీమా సంస్థలు.. ప్రీమియం చెల్లింపులకు 15 లేదా ఒక నెల రోజులదాకా గ్రేస్ పీరియడ్ ఇస్తూంటాయి. డ్యూ డేట్‌పై ఇది వర్తిస్తుంది. అయితే ఈ వెసులుబాటునూ మీరితే ఆలస్యపు జరిమానాలు చెల్లించకతప్పదు. ఇలా కొనసాగుతూపోతే బీమా లాభాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. కనుక బీమా పాలసీలు కొనేటప్పుడే మీమీ ఆర్థిక స్థోమతను దృష్టిలో పెట్టుకుని లేదంటే మీమీ ఆదాయ వనరులను పరిగణనలోకి తీసుకుని ప్రీమియం చెల్లింపుల కోసం నెలసరి లేదా త్రైమాసిక లేదంటే అర్థవార్షిక, వార్షిక వాయిదాలను నిర్ణయించుకోండి. దీనివల్ల ప్రీమియం పేమెంట్లలో ఇబ్బందులను అధిగమించవచ్చు.

వ్యాధులను దాచొద్దు



ఆరోగ్య బీమా పాలసీ కింద అప్పటికే ఉన్న వ్యాధులు తరచూ నిర్దేశిత వ్యవధి ల్యాప్సైన తర్వాతగానీ కవరేజీలోకి రావడం లేదు. పాలసీ నిబంధనల ప్రకారం అది 3 లేదా 4 ఏండ్లైనా కావచ్చు. కాబట్టి ఒకవేళ మీరు మీకున్న వ్యాధుల గురించి బీమా పాలసీలు కొన్నప్పుడే దరఖాస్తు ఫారాల్లో పేర్కొనకపోతే.. ఆ వివరాలను నిర్దేశిత వెయిటింగ్ పీరియడ్ లోపుగానీ, తర్వాతగానీ క్లెయిం చేసినా ఫలితం ఉండకపోవచ్చు. బీమా సంస్థలు మీ విజ్ఞప్తిని తిరస్కరించే అవకాశాలే ఎక్కువ. ఇక బీమా సంస్థలు పాలసీని అమ్మే వేళ మీ ఆరోగ్య పరీక్షల వివరాలను కోరినట్లైతే అన్ని పరీక్షలను చేయించుకుని, ఆ వివరాలను సమర్పించండి. దీనివల్ల అప్పటికే మీకున్న వ్యాధులకు బీమా ప్రయోజనం తప్పకుండా అందే వీలుంటుంది. బీమా సంస్థలు సైతం మీ క్లయిములను తిరస్కరించే వీలుండదు. దరఖాస్తుల్లో ముందే పేర్కొన్నాం కాబట్టి మన వాదనే చెల్లుతుంది. అంతేగాక ఆరోగ్యం విషమించినప్పుడు, ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నప్పుడు బీమా ఉందన్న ధీమా మీకు కలుగుతుంది. ఇది మీరు త్వరగా కోలుకోవడానికి ఎంతగానో దోహదపడుతుంది.

అలవాట్లనూ చెప్పండి



బీమా పాలసీల్లో ఏ చిన్న విషయాన్నీ దాచకూడదు. దానివల్ల భవిష్యత్తులో పెద్ద మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వస్తుంది. చివరకు మీకున్న అలవాట్లనూ దాయడం మంచిది కాదు. ఉదాహరణకు పొగ త్రాగడం, మద్యం సేవించడం వంటి అలవాట్లున్నా వాటిని పాలసీ దరఖాస్తు ఫారాల్లో పేర్కొనండి. అలాగే ఆదాయం వివరాలనూ మరుగున పెట్టాలని చూడకండి. జీవిత బీమా పాలసీల కొనుగోలు సమయంలో ఇది చాలాచాలా ముఖ్యం. దీనివల్ల మీ ఆదాయానికి తగ్గ పాలసీలను ఎంచుకుని, తగిన ప్రతిఫలం పొందే అవకాశం ఉంటుంది. ఒక్కో పాలసీ ప్రయోజనం ఒక్కోలా ఉంటుందన్న విషయం తెలిసిందే. ఇకపోతే మరో బీమా సంస్థ నుంచి మీకు గతంలోనే పాలసీ ఉన్నట్లైతే ఆ వివరాలనూ కొత్త పాలసీ కొనుగోలు సమయంలో పేర్కొనండి. అంతేగాక మీ ఎత్తు, బరువు, వయసు, చిరునామా, నామినీ ఇలాంటి వివరాలనూ సరిగ్గా ఇవ్వండి. దీనివల్ల క్లయిములు త్వరగా కావడానికి వీలుంటుంది. కాబట్టి ఏ చిన్న విషయం మరిచినా.. ఆ తర్వాత అది పెద్ద సమస్యనే సృష్టిస్తుందన్నది మాత్రం మరువరాదు.

క్లెయింల్లో ఆలస్యం



బీమా క్లయిములను ఆలస్యంగా దాఖలు చేసినా అవి తిరస్కరణకు గురయ్యే వీలున్నది. సాధారణంగా జీవిత బీమా సంస్థలు.. బీమా పొందిన వ్యక్తులు చనిపోతే, అందు కు సంబంధించిన సరైన సమాచారాన్ని రాబట్టుకోవడం కోసం తక్షణ విచారణను చేపడుతాయి. కాబట్టి క్లెయింల్లో ఆలస్యం లేనిపోని అనుమానాలకు దారితీస్తుంది. మోసాలకు తావుందా? అన్న కోణంలో బీమా సంస్థలు ఆలోచిస్తాయి. దీనివల్ల బీమా సొమ్ము చేతికి రావడం ఆలస్యమవుతుంది. కనుక వీలైనంత త్వరగా క్లెయింలను దాఖలు చేసుకోవడమే మంచిది. అలాగే ఆరోగ్య బీమా సంస్థలు సాధారణంగా 48 గంటల్లోగా ఆస్పత్రుల చికిత్స వివరాలను కోరుతాయి. ఈ గడువులోగా సంబంధిత వివరాలను అందించనట్లైతే సెటిల్మెంట్లలో జాప్యం జరిగి ఖర్చులు మనమీదే పడే అవకాశాలుంటాయి. ఒకవేళ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాలనుకుంటే.. ఆ సమాచారాన్ని ముందుగానే బీమా సంస్థలకు తెలియజేయడం ఉత్తమం. దీనివల్ల క్లెయింల తిరస్కరణ, ఆలస్యం వంటి సమస్యల్ని సులభంగా అధిగమించినవారమవుతాం.

అదిల్ శెట్టి
సీఈఓ, బ్యాంక్ బజార్ డాట్ కామ్



మ్యూచువల్ ఫండ్లు రాబడికి రారాజు




కన్స్యూమరిజమే ప్రధానంగా మారిన నేటి సమాజంలో వ్యయాలు అంతకంతకు పెరిగిపోయాయి. గ్లోబలైజేషన్, మార్కెటింగ్ మాయాజాలంతో మన ఖర్చుచేసే పద్ధతులూ మారిపోయాయి. మన పెద్దలు భవిష్యత్ కోసం పొదుపుచేయడమే కాదు పిల్లలనూ గల్లా గురిగిల్లో పొదుపు చేసేలా ప్రోత్సహించారు. కానీ, ఇప్పటి కాలం వేరు. సంప్రదాయ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం, ప్రాపర్టీ ఇప్పుడు ఆకర్షణీయంగా ఉన్నాయా? ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు ఇవి సామాన్యున్ని ఆదుకుంటున్నాయా? ఇవి కాల క్రమేణా ప్రభావాన్ని కోల్పోతున్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వడ్డీ తగ్గిపోయింది. బంగారం, ప్రాపర్టీలలో లిక్విడిటీ సమస్యలున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో మ్యూచువల్ ఫండ్స్‌కు ఆదరణ పెరుగుతున్నది.

ఇప్పటికీ చాలా మందికి మ్యూచువల్ ఫండ్స్‌మీద అవగాహన తక్కువే. నష్టపోతామన్న భయం మ్యూచువల్ ఫండ్స్‌కు చాలా మందిని దూరంగా ఉంచుతున్నది. నిజానికి ఏ మదుపు సాధనమైనా సరే కొన్ని రిస్క్‌లను కలిగివుంటుంది. మనం భరించగల రిస్క్‌లకు తగ్గట్టుగా పొదుపు లేదా మదుపు వ్యూహం ఉంటే సంపదను సృష్టించడంతో పాటు భవిష్యత్‌కు భద్రతను కల్పించవచ్చు. దీర్ఘకాలంలో మ్యూచువల్ ఫండ్లు మంచి రిస్క్ పోగా మంచి రాబడులను అందిస్తాయి. మదుపు చేయడానికి మ్యూచువల్ ఫండ్స్‌పై ఉన్న అపోహలను పక్కన పెట్టడానికి ఇదే మంచి తరుణం. మనందరికి జీవితంలో చాలా లక్ష్యాలుంటాయి. ఆ లక్ష్యాలను చేరుకోవడానికి సరైన ఆర్థిక ప్రణాళిక అవసరం. మదుపు చేయడానికి స్టాక్ మార్కెట్‌పై అవగాహన చాలా అవసరం. మ్యూచువల్ ఫండ్లు నిపుణులు మీ తరపున మదుపును నిర్వహిస్తారు. వారు నిరంతరం మార్కెట్ కదలికలను గమనిస్తూ అందుకనుగుణంగా పోర్టుఫోలియోలో మార్పులు చేర్పులు చేస్తూ ఉంటారు.

మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం ద్వారా నిపుణులపై భరోసాతో ఉండవచ్చు. గత రెండు మూడు సంవత్సరాలుగా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్న మొత్తం (ఏయుఎం) గణనీయంగా పెరిగింది. మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన కోసం అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) చేస్తున్న ప్రచారంతో ప్రజల్లో మార్పు కనిపిస్తున్నది. అయితే షేర్లలో, మ్యూచువల్ ఫండ్ల మదుపు చేసే వారి సంఖ్య అమెరికాతో పోల్చితే మన దేశం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. మ్యూచువల్ ఫండ్లు అందిస్తున్న ఫ్లెక్సిబిలిటీ కారణంగా చాలా మందిని ఇప్పుడు ఆకర్షిస్తున్నాయి. ద్రవ్యోల్బణంతో పోల్చితే ఫిక్స్‌డ్ డిపాజిట్లమీద వచ్చే రాబడి చాలా తక్కువ. దీర్ఘకాలానికి మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తే రాబడి ఆకర్షణీయంగా ఉంటుంది. మ్యూచువల్‌ఫండ్లు ఈక్విటీలు, బాండ్లు తదితర మదుపు సాధానాల్లో మదుపు చేస్తాయి కనుక రిస్క్ కూడా వివిధీకరణ జరుగుతుంది. మ్యూచువల్ వ్యక్తిగత అవసరాలకు తగ్గట్టుగా సొల్యూషన్స్‌ను మ్యూచువల్ ఫండ్లు అందిస్తున్నాయి. కొంత మంది ఎక్కువ రిస్క్‌ను మరికొంత మంది చాలా తక్కువ రిస్క్‌ను తీసుకోగల సామర్థ్యాన్ని కలిగి ఉంటారు వారి వారి రిస్క్ సామర్థ్యానికి తగ్గట్టు మ్యూచువల్ ఫండ్లు స్కీమ్‌లను రూపొందించాయి. రిస్క్ తీసుకోగలిగిన వారు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో ఎక్కువ మొత్తాన్ని రిస్క్ తక్కువగా ఉండాలనుకునే వారు డెట్ ఫండ్లలో మదుపు చేయవచ్చు. వివిధ రకాల రిస్క్ సామర్థ్యాలకనుగుణంగా మ్యూచువల్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయి.

మ్యూచువల్ ఫండ్లలో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) ద్వారా రూ. 500 కనీస మొత్తాన్ని కూడా మదుపు చేసే అవకాశాలున్నాయి. నీటి చుక్కలే సముద్రం అయినట్టుగా చిన్న చిన్న మొత్తాలను క్రమంగా మదుపు చేస్తూ పోతూ ఉంటే మంచి సంపదను సృష్టించే అవకాశం ఉంది. 10 నుంచి 15 ఏండ్ల కాలానికి ఎస్ఐపీల ద్వారా మదుపు చేస్తూ ఉంటే దీర్ఘకాలానికి మిగతా అన్ని సాధనాల కన్నా అధిక రాబడిని పొందవచ్చు. బ్యాంకు అకౌంట్లను అనుసంధానం చేస్తూ ఆటో డెబిట్ పద్ధతిలో ఎస్ఐపీల్లో మదుపు చేయవచ్చు. ఎస్ఐపీల్లో మదుపు ఫిక్స్‌డ్ డిపాజిట్ల కన్నా అధికంగా వస్తుందని గత అనుభవాలు చెబుతున్నాయి. ఇన్సూరెన్స్ కంపెనీలు, పెన్షన్ ఫండ్లు, రిటైర్మెంట్ ఫండ్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్లు ఈక్విటీ మార్కెట్‌లో అధికంగా మదుపు చేస్తున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల ప్రాబల్యం చాలా తగ్గిపోయింది. ఈ సంస్థాగత ఇన్వెస్టర్లంతా దీర్ఘకాలానికి మదుపు చేస్తున్నారు. స్వల్పకాలిక ఒడిదుడుకులను పట్టించుకోకుండా దీర్ఘకాల రాబడులే లక్ష్యంగా మదుపు చేస్తున్నాయి. ఒడిదుడుకుల తక్కువగా ఉన్న సమయంలో ఎక్కువ మొత్తాన్ని మదుపు చేయడం వల్ల మ్యూచువల్ మిగతా మదుపు సాధనాల కన్నా అధికంగా రాబడులను అందిస్తాయి. గత పదేండ్ల కాలంలో అత్యధిక రాబడులను అందించిన మ్యూచువల్ వివరాలు కింద టేబుల్‌లో అందిస్తున్నాం. ఇవన్నీ సగటున ఏటా 25 శాతం కన్నా ఎక్కువ రాబడిని అందించినవే.

డి జయంత్ కుమార్
నేషనల్‌హెడ్, థర్డ్‌పార్టీ ప్రొడక్ట్స్
కార్వీ స్టాక్‌బ్రోకింగ్



Scheme	Sector	10Yr Returns	Inv Date	NAV	Inv Amt	Units	Cur Date	Cur NAV	Cur Value	Gain
Canara Robeco Emerging Equities	Large&Mid cap	27.3	27/01/2009	7.84	1 00 000	12755.102	24/01/2019	87.82	11 20 153	10 20 153
DSP Small Cap Fund	Small Cap	26.26	28/01/2009	4.98	1 00 000	20080.3213	24/01/2019	52.14	10 46 928	9 46 928
ICICI Pru Technology Fund	Sectoral	25.97	27/01/2009	6.01	1 00 000	16638.9351	24/01/2019	59.16	9 84 359	8 84 359
UTI Transportation and Logistics Fund	Sectoral	25.97	27/01/2009	9.59	1 00 000	10427.5287	24/01/2019	96.18	10 02 971	9 02 971
Principal Emerging Bluechip Fund	Large&Mid cap	25.27	27/01/2009	10.58	1 00 000	9451.7958	24/01/2019	98.57	9 31 664	8 31 664
SBI Focused Equity Fund	Focused	25.15	27/01/2009	13.83	1 00 000	7230.658	24/01/2019	129.3	9 34 931	8 34 931
Franklin Smaller Companies Fund	Small Cap	25.07	27/01/2009	5.57	1 00 000	17938.5068	24/01/2019	51.74	9 28 162	8 28 162
Aditya Birla SL MNC Fund	Thematic	24.85	27/01/2009	80.57	1 00 000	1241.1568	24/01/2019	735.09	9 12 362	8 12 362
HDFC Mid-Cap Oppo. Fund	Mid Cap	24.63	27/01/2009	5.74	1 00 000	17415.5347	24/01/2019	51.85	9 03 065	8 03 065
Invesco India Mid Cap Fund	Mid Cap	24.62	27/01/2009	5.19	1 00 000	19267.8227	24/01/2019	46.88	9 03 276	8 03 276
Invesco India Multicap Fund	Multi Cap	24.4	27/01/2009	5.08	1 00 000	19685.0394	24/01/2019	45.36	8 92 913	7 92 913

III.
నమస్తే తెలంగాణ
సంపద
[కరీంనగర]
శనివారం 2 ఫిబ్రవరి 2019



బడ్జెట్.. భలే ప్రోత్సాహం

అమ్మకాల్లేక కునారిల్లుతున్న దేశీయ నిర్మాణ రంగానికి ఊరటనిచ్చేలా కేంద్ర ఆర్థిక మంత్రి తాజా బడ్జెట్‌లో పలు ప్రోత్సాహకాల్ని ప్రకటించారని భారత డెవలపర్లు అభిప్రాయపడుతున్నారు. అందుకే, 2019 బడ్జెట్‌ను స్వాగతిస్తుమని ముక్తకంఠంతో చెబుతున్నారు.

అందుబాటు గృహాలను నిర్మించే డెవలపర్లకిచ్చే పన్ను రాయితీని మరో ఏడాది దాకా పొడిగించారు. నిర్మాణం పూర్తయ్యాక అమ్మకాల్లేక ఉన్న గృహాలపై పన్నును మరో రెండేండ్ల వరకూ పెంచారు. దీర్ఘకాలిక మూలధనంపై రూ.2 కోట్ల దాకా పన్ను లాభాన్ని గతంలో ఒక ఇల్లును మాత్రమే కొనుగోలు చేయడానికి అనుమతినిచ్చేవారు. ఇప్పుడా పరిమితిని రెండు ఇండ్లకు పొడిగించారు. రెండో ఇల్లును కొనుగోలు చేస్తే పన్ను మినహాయింపును కల్పించారు. జీవితకాలంలో లభించే ఇదో గొప్ప అవకాశంగా ఇండ్ల కొనుగోలుదారులు భావించే అవకాశముంది. నిర్మాణం పూర్తయ్యాక అమ్మకుండా ఉన్న ఇండ్లపై వసూలు చేసే పన్ను ప్రయోజనాన్ని కేవలం ఏడాది వరకే ఉండేది. ఇప్పుడు దీన్ని రెండేండ్లకు పెంచడం సానుకూలాంశం. ఎందుకంటే, దేశవ్యాప్తంగా అమ్ముడుకాని ఇండ్లు దాదాపు ఆరు నుంచి ఏడు లక్షల దాకా ఉంటాయని సమాచారం. ప్రాజెక్టు పూర్తయ్యే తేదీ నుంచి వ్యవధిని లెక్కిస్తారు.

- మనదేశంలో అనేక మంది మధ్యతరగతి వేతనజీవులు, ఉద్యోగ నిమిత్తం లేదా పిల్లల ఉన్నత విద్య కోసమో రెండు ప్రాంతాల్లో నివసిస్తుంటారు. ఇలాంటి వారికి గల రెండో ఇంటిపై ఆదాయ పన్ను రాయితీని బడ్జెట్‌లో కల్పించారు. అద్దెలపై టీడీఎస్ పరిమితిని రూ.1.80 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెంచారు. నిర్మాణంలో ఉన్న ఇండ్ల నుంచి జీఎస్టీని 12 శాతం వసూలు చేస్తున్నారు. అందుబాటు గృహాలైతే 8 శాతం తీసుకుంటున్నారు. ఈ జీఎస్టీని తగ్గించాలని దేశీయ నిర్మాణ రంగమంతా కోరుతున్నది. దీంతో, మంత్రుల బృందం అందజేసే సిఫార్సుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. రెరా, బినామీ లావాదేవీల నియంత్రణ చట్టం వల్ల నిర్మాణ రంగంలో మరింత పారదర్శకత నెలకొన్నదని అన్నారు. 2016లో ప్రవేశపెట్టిన సెక్షన్ 80- ఐబిఏను 2017లో రద్దు చేశారు. మళ్లీ దీన్ని ప్రవేశపెడుతూ.. ప్రాజెక్టుల్ని పూర్తి చేసే వ్యవధిని మూడేండ్ల నుంచి ఐదేండ్లకు పెంచడం స్వాగతించాల్సిన విషయం.

2022 నాటికి అందరికీ ఇండ్లు



నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఆర్థికమంత్రి నిర్ణయాలు తీసుకున్నందుకు ధన్యవాదాలు. దీర్ఘకాలిక మూలధన లాభంపై పన్ను విధించే విషయంలో మంచి ప్రోత్సాహాన్ని అందించారు. ఇప్పటివరకూ ఒక ఇల్లు విక్రయించడం ద్వారా వచ్చే సొమ్మును మరో ఒక ఇంటిని కొనుగోలు చేస్తేనే పన్ను ప్రయోజనం ఉండేది. ఇప్పుడీ పరిమితిని రెండు ఇండ్లకు పొడిగించారు. టీడీఎస్‌ను 2.40 లక్షలకు పొడిగించడం, అమ్ముడుకాని ఇండ్లపై పన్ను రాయితీని రెండేండ్లకు పెంచడం వంటివి ఆహ్వానించదగ్గ నిర్ణయాలని చెప్పొచ్చు.

– జక్సే షా, అధ్యక్షుడు, క్రెడాయ్ నేషనల్

పీఎంఏవై పథకం ఊసే లేదు..



సామాన్య వేతనజీవులకు ఊరటనిచ్చే నిర్ణయాన్ని కేంద్రం తీసుకున్నది. రూ.5 లక్షల వరకూ ఆదాయ పన్ను రాయితీని కల్పించడం స్వాగతించాల్సిన విషయం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని మూడు, నాలుగేండ్ల దాకా పొడిగిస్తారని ఆశించాను. అయితే, రానున్న కొత్త బడ్జెట్‌లోనైనా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాను. దేశవ్యాప్తంగా భూముల విలువ పెరిగిన నేపథ్యంలో.. వడ్డీ రాయితీని రూ.2.5 లక్షల నుంచి కొంతమేరకు పెంచాలి. అదేవిధంగా, ఈ పథకాన్ని మరికొంత కాలం పొడిగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. డెవలపర్ల కోణంలో చూస్తే.. అందుబాటు గృహాల ప్రాజెక్టులకు పన్ను మినహాయింపును కల్పించడం మంచి నిర్ణయం.

– కె.రవీందర్‌రెడ్డి, ఛైర్మన్, జనప్రియ ఇంజినీర్స్

రెండేండ్లకు పెంపుదల



అందుబాటు గృహాల ప్రాజెక్టులపై సెక్షన్ 80 ఐబీఏ కింద పన్ను ప్రయోజనం కేవలం ఒక్క ఏడాదికే ఉండేది. ఇప్పుడీ అవకాశాన్ని రెండేండ్లు పొడిగించారు. దీని వల్ల అందుబాటు గృహాల్ని నిర్మించడానికి అనేక మంది డెవలపర్లు ముందుకొస్తారు. వ్యక్తిగత ఆదాయ పన్ను రాయితీని రూ.5 లక్షలకు పెంచడం వల్ల, ప్రజలు సొంతింటి కొనుగోలును చేయడానికి ముందుకొచ్చే అవకాశం ఉంటుంది.

– గుమ్మి రాంరెడ్డి, అధ్యక్షుడు, క్రెడాయ్ తెలంగాణ

దేశప్రగతికి చక్కటి బాట



2019 బడ్జెట్‌లో విప్లవాత్మక నిర్ణయాల్ని తీసుకున్నందుకు ఆర్థికమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నాను. ఈసారి బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరిచేలా ఉంది. నిర్మాణ రంగానికీ ఎంతో ప్రోత్సాహకరంగా ఉండటం విశేషం. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 'విజన్ 2030' వల్ల సరికొత్త భారత్ సాక్షాత్కరించే అవకాశముంది. ఇది దేశ ఆర్థిక ప్రగతికి చక్కటి బాట వేస్తుంది.

– గీతాంబర్ ఆనంద్, ఛైర్మన్, క్రెడాయ్ నేషనల్

నేడు, రేపు..
ఈస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ షో..

తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్.. ఎస్‌బీఐ బ్యాంకుతో కలిసి నేడు, రేపు ఉప్పల్ డిపో చేరువలోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో ఈస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నది. శనివారం ఉదయం జరిగే ప్రారంభోత్సవానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెరా ఛైర్మన్ రాజేశ్వర్ తివారీ, ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డిలు పాల్గొంటారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో దాదాపు ముప్పయ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈస్ట్ హైదరాబాద్‌లో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావించేవారికి ఇదో చక్కటి అవకాశమని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అంటున్నది.



- తూర్పు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పలువురు బిల్డర్లు, డెవలపర్లు చేపడుతున్న వెంచర్లు, అపార్టుమెంట్లు, విల్లా ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ ప్రాపర్టీ షోలో లభిస్తాయి. ఉప్పల్, బోడుప్పల్, నారపల్లి, పోచారం, ఘట్‌కేసర్, రాంపల్లి, అన్నోజిగూడ, పీఅండ్‌టీ కాలనీ వంటి ప్రాంతాల్లో నిర్మాణ పనుల్ని జరుపుకుంటున్న అపార్టుమెంట్ల వివరాలను ఈ ప్రదర్శనలో సందర్శకులు తెలుసుకోవచ్చు. ఘట్‌కేసర్, యాదాద్రి, ఆలేరు వంటి ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న వెంచర్ల వివరాలను కనుక్కోవచ్చు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, వైటీడీఏ వంటి సంస్థల నుంచి అనుమతి లభించిన వెంచర్లకు ఎస్‌బీఐ గృహరుణం కూడా మంజూరు చేస్తుంది. కాబట్టి, ఈ అవకాశాన్ని ఇండ్ల కొనుగోలుదారులు వినియోగించుకోవాలని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ జక్కా వెంకట్‌రెడ్డి కోరారు. ఈ రెండు రోజుల ప్రదర్శనకు దాదాపు పదివేలకు పైగా సందర్శకులు విచ్చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అతిత్వరలో.. ఆన్‌లైన్ ఫిర్యాదులు!



తెలంగాణ రెరా ఛైర్మన్ రాజేశ్వర్ తివారీ

తెలంగాణ రాష్ట్రంలో.. ప్రమోటర్లు నిర్ణీత గడువులోపు ప్రాజెక్టును పూర్తి చేయకున్నా.. చెప్పిన నాణ్యత ప్రకారం ఫ్లాటను నిర్మించకున్నా.. ఇండ్ల కొనుగోలుదారులు దిగులు చెందనక్కర్లేదు. అతిత్వరలో రెరా వెబ్‌సైటులోనే ఫిర్యాదులను నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం.. డెవలపర్లు, కొనుగోలుదారుల మధ్య నెలకొనే సమస్యల్ని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలంగాణ రెరా అథారిటీ ఛైర్మన్ రాజేశ్వర్ తివారి తెలిపారు. ఇండ్ల కొనుగోలుదారుల సమస్యలను పరిష్కరించడం మీదే అధిక దృష్టి సారిస్తామని నమస్తే సంపదకు ప్రత్యేకంగా వివరించారు. సారాంశం ఆయన మాటల్లోనే..

'రెరా ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారిస్తుంది. 500 చదరపు మీటర్లు కంటే అధిక విస్తీర్ణం లేదా ఎనిమిది ఫ్లాట్లను మించి అభివృద్ధి చేసే ప్రతి ప్రాజెక్టు రెరా వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. ఆయా ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయించే ఏజెంట్లు సైతం రెరా వద్ద నమోదు కావాల్సిందే. ప్రమోటర్లు, ఏజెంట్లతో ఎలాంటి సమస్యలొచ్చినా.. రెరా అథారిటీ వాటిని పరిష్కరిస్తుంది. మన రాష్ట్రంలో 2018 సెప్టెంబరు 1 నుంచి రెరా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించాం. ఇక్కడి నిర్మాణ సంఘాల నుంచి అపూర్వమైన స్పందన లభించింది. క్రెడాయ్, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, ట్రెడా వంటి సంఘాలకు చెందిన డెవలపర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ముందుకొస్తున్నారు. కనీసం 5000 ప్రాజెక్టులు నమోదవుతాయని అంచనా వేస్తున్నాం. ఇప్పటివరకూ పదిహేను వందల రిజిస్ట్రేషన్లు అయ్యాయి. రెరాలో నమోదు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ప్రమోటర్లు ఎవరినీ కలవకుండానే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సెప్టెంబరు 1 నుంచి మొదటి మూడు నెలల దాకా ఉచితంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించాం. డిసెంబరు 1 నుంచి అపరాధ రుసుమును వసూలు చేస్తున్నాం. ఈ నెల 15 వరకూ 2 లక్షల దాకా అపరాధ రుసుమ చెల్లించి రెరాలో నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాం. ఇంకా ఆలస్యం చేసే వారిపై తీసుకునే చర్యలపై తదుపరి చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రెరాలో నమోదు కాకుండా ఏ ప్రమోటరూ తమ ప్రాజెక్టులను విక్రయించడానికి వీల్లేదని రెరా చట్టం చెబుతున్నది. కనీసం ప్రకటన కూడా చేయవద్దు. అలా చేస్తే వారి నుంచి జరిమానా వసూలు చేస్తాం.

రెరా అనుమతి ఉంటేనే ఓకే..

తమ ప్రాజెక్టుల గురించి ప్రాపర్టీ షోలలో ప్రదర్శనకు పెడతామని కొందరు మా వద్దకు వచ్చారు. రెరా అనుమతి లేకుండా, ఏ ఒక్కరూ అలా చేయడానికి వీల్లేదు. రెరా నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకుండా ప్రాపర్టీ షోలలో వెంచర్లు, ప్రాజెక్టుల సమాచారాన్ని కొనుగోలుదారులకు ఎట్టి పరిస్థితుల్లో ప్రదర్శించకూడదు. రెరాలో అనుమతి లేకుండా పేపర్ ప్రకటనలు, బ్రోచర్లు ముద్రించినా, హోర్డింగులు పెట్టినా జరిమానా వసూలు చేస్తాం. ఇప్పటికే పద్నాలుగు మంది ప్రమోటర్లకు షోకాజ్ నోటీసులను జారీ చేశాం. ఉత్తర భారతంలోని నొయిడా, గుర్గావ్‌లను చూస్తే బడా బిల్డర్లు సైతం ఊచలు లెక్కపెడుతున్నారు. అట్టి పెద్ద నిర్మాణ సంస్థల ప్రాజెక్టులను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని కొనుగోలుదారులకు న్యాయం చేస్తోంది. అదృష్టవశాత్తు, మన వద్ద అలాంటి ప్రతికూల పరిస్థితుల్లేవు. కొన్ని నిర్మాణ సంస్థలు తప్పితే, ఇక్కడి సంస్థలు పారదర్శకంగా నిర్మాణాలు చేపడుతున్నాయి.

- తెలంగాణ రాష్ట్రంలో డెవలపర్లు పూర్తి స్థాయి పారదర్శకంగా వ్యవహరించాలి. రెరాలో నమోదు అయిన తర్వాత, ప్రతి మూడు నెలలకోసారి ప్రాజెక్టులకు సంబంధించిన పురోగతిని రెరా వెబ్‌సైటులో పొందుపర్చాలి. ఒకవేళ, ఎవరైనా ఇంటి కొనుగోలుదారులు నిర్మాణ పనుల్లో వేగం లేదని ఫిర్యాదు చేసినా, డెవలపర్‌ని పిలిచి ప్రశ్నిస్తాం. స్ట్రక్చర్‌లో ఐదేండ్ల పాటు ఎలాంటి లోపాలున్నా ప్రమోటర్లదే బాధ్యత. చిన్న చిన్న నిర్వహణ సమస్యలుంటే రెరా పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కానీ, నిర్మాణ నాణ్యతపై తప్పనిసరిగా దృష్టి సారిస్తాం.

తూర్పు, ఉత్తరం అభివృద్ధి చెందాలి..

వ్యక్తిగతంగా చెప్పాల్సి వస్తే.. దక్షిణ హైదరాబాద్‌లో ఈమధ్య కొంత రియల్ కదలికలు మొదలయ్యాయి. పశ్చిమం అయితే ఊహించిన దానికంటే అధికంగా అభివృద్ధి చెందింది. ఇక తూర్పు, ఉత్తర హైదరాబాద్‌లు కొంత వెనకబడ్డాయి. అవి అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు రాకతో.. నగరం నాలుగు వైపులా సమానమైన రీతిలో వృద్ధి చెందే అవకాశమున్నది.

ఫిర్యాదు వస్తే షోకాజ్ నోటీసు..

కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదు రాగానే.. ముందుగా డెవలపర్‌కు షోకాజ్ నోటీసును జారీ చేస్తాం. ఇద్దరినీ హియరింగ్‌కు పిలుస్తాం. బిల్డర్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలా? లేక జరిమానా విధించాలా? అనే విషయాన్ని రెరా అథారిటీ నిర్ణయిస్తుంది. ఇండ్ల కొనుగోలుదారుల నుంచి బిల్డర్‌పై ఫిర్యాదులొస్తే చాలు.. తక్షణమే పరిష్కరిస్తాం. ఇప్పటి వరకూ హైదరాబాద్ నిర్మాణ రంగంలో డెవలపర్ ఎవరో కొనుగోలుదారులకు తెలిసేది కాదు. కానీ, రెరా వచ్చాక డెవలపర్ ఎవరో ప్రతిఒక్క కొనుగోలుదారుడికి తెలిసిపోతుంది. రెరా అమల్లోకి వచ్చాక నిర్మాణ సంస్థల్లోనే కాదు.. ఇండ్ల కొనుగోలుదారుల్లోనూ అవగాహన తెస్తున్నాం. హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లోనూ సమావేశాల్ని నిర్వహించాం.

రెరా ఉంటే సంతోషమే..

రియల్ ఎస్టేట్ పరిశ్రమ రెరా వచ్చినందుకు సంతోషించాలి. ఎందుకంటే, వారు రెరాలో కూడా భాగస్వామ్యులయ్యారు. అదే ఉత్తర భారతాన్ని తీసుకుంటే, అక్కడి పేరెన్నిక గల నిర్మాణ సంస్థలు పూర్తిగా నామరూపాల్లేకుండా పోయాయి. కానీ, ఇక్కడ అలాంటి పరిస్థితుల్లేవు. మహారాష్ట్రలో రెరా పూర్తిగా విజయవంతమైంది. అక్కడి డెవలపర్లు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రెరా అథారిటీ కంటే ముందు, అక్కడో కన్స్యూమర్ రెడ్రెసల్ కమిటీని ఏర్పాటు చేశారు. అక్కడే డెవలపర్ నుంచి ఒక ప్రతినిధి, కొనుగోలుదారుడి తరపున ఒక ప్రతినిధి, రెరా మెంబర్ సెక్రెటరీ ఉంటారు. వీరే, రెరా అథారిటీ కంటే ముందే పలు కేసుల్ని పరిష్కరిస్తుంటారు. ఇలా, అక్కడి రెరా అథారిటీ ఐదు వేల కేసులను పరిష్కరించింది. మన తెలంగాణ రెరాలో కూడా మహారాష్ట్ర విధానాన్ని అవలంబిస్తాం. దీని వల్ల 70-80 శాతం కేసులు వీలైనంత త్వరగా పరిష్కారమవుతాయి.

- మన రాష్ట్రంలో రెరా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకూ ఉన్న వ్యాట్ ట్రిబ్యునల్ రెరాకూ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నది. కాకపోతే, రెరా కేసులింకా వారి దృష్టికి వెళ్లలేదు. రెరా అథారిటీలోనే ప్రత్యేకంగా రెండు కోర్టు రూములను ఏర్పాటు చేశాం. అతిత్వరలో రెరా వెబ్‌సైటులో ద్వారానే కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించే ప్రక్రియనూ మొదలెడతాం. కాకపోతే, కేవలం తెలంగాణ రెరా వద్ద రిజిస్టర్ అయిన ప్రాజెక్టులకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే స్వీకరిస్తాం. వాటినే పరిష్కరించేందుకు తగిన చర్యల్ని తీసుకుంటాం.'

కింగ్ జాన్సన్ కొయ్యడ

క్రెడాయ్ నాట్‌కాన్.. ఈసారి ఇజ్రాయేల్‌లో..

ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌లో క్రెడాయ్ నాట్‌కాన్ 2019 నిర్వహిస్తున్నామని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి ప్రకటించారు. నాట్‌కాన్ ఏర్పాట్లను పరిశీలించడానికి ఇజ్రాయెల్ పర్యటించిన అనంతరం ఆయన నమస్తే సంపదతో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. దేశంలోని అనేక రాష్ట్రాలు పోటీపడితే, ఈసారి నాట్‌కాన్ 2019ను నిర్వహించే అవకాశం క్రెడాయ్ తెలంగాణకు దక్కిందన్నారు. మనకు తోడ్పాటును క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ అందజేస్తుందన్నారు. అందుకే, ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఒక్క తెలంగాణ రాష్ట్రం నుంచే సుమారు 250 మందికి పైగా డెవలపర్లు ఈసారి ఇజ్రాయెల్ సదస్సుకి విచ్చేస్తారని వెల్లడించారు. ఏర్పాట్లను పరిశీలించడానికి ఇటీవల ఇజ్రాయెల్‌కు వెళ్లినవారిలో క్రెడాయ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి చెరుకు రామచంద్రారెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
శనివారం 2 ఫిబ్రవరి 2019

భాగ్యనగరంలో మహర్షి


మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మహర్షి'. వంశీపైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్, పీవీపీ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూజా హెగ్డే కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. మహేష్‌బాబు, జగపతిబాబు, పూజా హెగ్డేలపై ఆధునిక వ్యవసాయ విధానానికి సంబంధించిన కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. కథానుగుణంగా ద్వితీయార్థంలో మహేష్‌బాబు ఈ సినిమాలో రైతు పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. రైతుల సమస్యలతో పాటు స్నేహం ఔన్నత్యాన్ని, కుటుంబ విలువల గొప్పతనాన్ని చాటిచెబుతూ వినూత్నమైన ఇతివృత్తంతో దర్శకుడు వంశీపైడిపల్లి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మహేష్‌బాబు హీరోగా నటిస్తున్న ఇరవై ఐదవ సినిమా ఇది. ఆయన పాత్ర భిన్న పార్శ్వాల్లో స్టైలిష్‌గా ఉంటుందని సమాచారం. ఈ సినిమాలో మహేష్‌బాబు స్నేహితుడిగా అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో కనిపిస్తున్నారు. ఏప్రిల్ 25న ఈ చిత్రం విడుదలకానుంది. దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూర్చుతున్నారు.



'మహర్షి' చిత్రంలో మహేష్‌బాబు

సినిమానే నా రాజకీయం!

'కంప్లీట్ యాక్టర్' అనే పదానికి నిలువెత్తు నిదర్శనం మలయాళ కథానాయకుడు మమ్ముట్టి. ముప్పై ఎనిమిదేళ్ల సినీ ప్రయాణంలో ఆయన చేయని పాత్ర లేదు. స్పృశించని కథాంశంలేదు. విలక్షణ అభినయంతో ఎన్నో అజరామరమైన పాత్రలకు ప్రాణంపోసి దక్షిణాది ప్రేక్షకుల హృదయాల్లో నిజమైన సూపర్‌స్టార్‌గా నిలిచిపోయారు. సుదీర్ఘ విరామం తర్వాత 'యాత్ర' సినిమాతో మమ్ముట్టి తెలుగులో పునరాగమనం చేస్తున్నారు. మహి.వి.రాఘవ్ దర్శకుడు. విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 8న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో మమ్ముట్టి పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...



మమ్ముట్టి

సుదీర్ఘ విరామం తర్వాత తెలుగు సినిమా చేయడం ఎలా ఉంది?

• 'యాత్ర' చిత్రంతో తెలుగులో మళ్లీ పునరాగమనం చేయడం సంతోషంగా ఉంది. ఇన్నేళ్లలో నాలో ఉత్సుకతను, ఆసక్తిని రేకెత్తించే కథలతో ఎవరూ సంప్రదించలేదు. అందుకే తెలుగు సినిమాలకు దూరంగా ఉన్నాను.

'స్వాతికిరణం'లో నటిస్తున్న సమయంలో ఎలా ఉన్నారో ఇప్పుడు అలాగే కనిపిస్తున్నారు. ఆ సీక్రెట్ ఏమిటి?

• ఆ రహస్యాన్ని మాటల్లో వర్ణించలేను. భగవంతుడి దయ వల్లే ఇప్పటికి అలాగే ఉన్నానని భావిస్తున్నాను (నవ్వుతూ).

ఈ కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలేవి?

• ఇది వై.ఎస్.ఆర్ జీవిత కథ కాదు. ఓ వ్యక్తి జీవితాన్ని సంపూర్ణంగా రెండు గంటల్లో తెరపై ఆవిష్కరించడం అసాధ్యం. వైఎస్.ఆర్ జీవితంలోని పాదయాత్ర ఘట్టాన్ని తీసుకొని మహి.వి.రాఘవ్ ఈ సినిమాను తెరకెక్కించారు. పాదయాత్ర నుంచి ముఖ్యమంత్రి పదవి చేపట్టేవరకు ఆయన జీవితంలోని సంఘటనలకు దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. ఈ పాదయాత్రలో ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్ని తెలుసుకుంటూ వాటికి పరిష్కారాల్ని సూచిస్తూ రాజశేఖర్‌రెడ్డి ఎలా ముందు సాగాడన్నది భావోద్వేగభరితంగా ఉంటుంది.

వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాత్ర కోసం ఎలాంటి పరిశోధన చేశారు?

• సినిమా కోసం వై.ఎస్.ఆర్‌ను అనుకరించే ప్రయత్నం చేయలేదు. ఆయన వస్త్రధారణ, నడక, మాట్లాడేతీరును ఉన్నది ఉన్నట్లుగా చూపించడం వల్ల పాత్రకు పూర్తిగా న్యాయం జరగదు. పాత్ర ఆత్మకు అనుగుణంగా నా శైలిలో వై.ఎస్.ఆర్ పాత్రలో నటించే ప్రయత్నం చేశాను. ఈ కథ కోసం దర్శకుడు మహి.వి.రాఘవ్ ఎక్కువ కష్టపడటం వల్ల నా పని సులభమైంది.

రాజకీయ నేపథ్య ఇతివృత్తంతో సినిమా చేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?

• గతంలో నేను చేసిన సినిమాలకు భిన్నంగా ఉంటుంది. ఇదివరకు చారిత్రక ఇతివృత్తాలతో రూపొందిన అంబేద్కర్, బషీర్ జీవితకథల్లో నటించాను. రాజకీయ నాయకుడి జీవితంపై రూపొందిన సినిమాలో నటించడం ఇదే తొలిసారి.

రాజకీయాల పట్ల మీకు ఆసక్తి ఉందా?

• 38 ఏళ్లుగా నటుడిగా కొనసాగుతున్నాను. సినిమానే నా రాజకీయం. చిత్ర పరిశ్రమకు దూరంగా వెళ్లను. ఇక్కడే ఉంటాను.

గత రెండుమూడేళ్లుగా విభిన్నమైన కథాంశాల్ని ఎంచుకుంటూ సినిమాల్ని చేస్తున్నారు

• ప్లాన్ చేసి నేను ఏదీ చేయను. తమిళంలో నటించిన 'పెరంబు' చిత్రం మూడేళ్ల క్రితం అంగీకరించాను. 'యాత్ర' సినిమా గత ఏడాది ఒప్పుకున్నాను. వారం తేడాతో రెండు ఒకేసారి విడుదల అవుతున్నాయి. సినిమా వెనుక ఎంతో మంది కృషి, శ్రమ దాగి వుంటాయి.. ఒక్కరూ ప్లాన్ చేస్తే సరిపోదు.

మీ తనయుడు దుల్కర్ సల్మాన్ మీకు పోటీ అని అనుకుంటున్నారా?

• తన అమ్మపై ప్రేమను చూపించడంలో దుల్కర్ నాతో పోటీపడుతున్నాడు.

తెలుగు సినిమాలు చూస్తుంటారా?

• తరుచుగా చూస్తుంటాను. ఇటీవల రంగస్థలం, భరత్ అనే నేను సినిమాలు చూశాను.

డ్రీమ్‌రోల్స్ అంటూ ఏమైనా ఉన్నాయా?

• డ్రీమ్‌రోల్స్ అంటూ ఏమీ లేవు. చేసే ప్రతి సినిమాను డ్రీమ్‌రోల్‌గానే భావిస్తాను.



రాశీఖన్నా

అదృష్టం కలిసిరావాలి..

'గ్లామర్‌తో ముడిపడిన రంగమిది. అందాల ప్రదర్శన చేయకూడదని గిరిగీసుకుంటే సినీ పరిశ్రమలో ఎక్కువ కాలం కొనసాగలేము. గ్లామర్ పాత్రల్లో నటిస్తూనే ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు లభించినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యం' అని చెబుతున్నది రాశీఖన్నా. కమర్షియల్ సినిమాలు చేస్తూనే మరోవైపు సవాళ్లతో కూడిన పాత్రలపై దృష్టిసారిస్తున్నది ఈ ఢిల్లీ సొగసరి. తాజాగా తమిళంలో విజయ్ సేతుపతితో ఓ సినిమాను అంగీకరించింది. తమిళనాడులోని మధురై ప్రాంతానికి చెందిన పల్లెటూరి యువతిగా ఆమె పాత్ర ఛాలెంజింగ్‌గా సాగుతుందని సమాచారం. రాశీఖన్నా మాట్లాడుతూ 'ప్రతి సినిమాలో కథ, నా పాత్రల పరంగా ఏదో ఒక కొత్తదనం కనిపించాలి. ఆ సిద్ధాంతాన్ని నమ్మే ఈ సినిమాను అంగీకరించాను. ఈ సినిమాలో సంప్రదాయాలకు విలువనిచ్చే పల్లెటూరి యువతిగా నా పాత్ర విభిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా హోమ్‌వర్క్ చేయడం లేదు. ఎక్కువగా ఆలోచిస్తే నటనలో కృత్రిమత్వం కనిపిస్తుంది' అని చెప్పింది. పరాజయాల గురించి మాట్లాడుతూ 'గతాన్ని గురించి ఆలోచించను. మనకు రాసిపెట్టుందే దక్కుతుంది. నిజాయితీగా కష్టపడంతో పాటు కొన్నిసార్లు అదృష్టం కలిసిరావాలి' అని తెలిపింది.

20-20 ప్రేమకథ!



అరవింద్, మోహిని జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'లవ్ 20-20'. సెంథిల్‌కుమార్ దర్శకుడు. మోహన్ మీడియా క్రియేషన్స్ పతాకంపై వడ్లపట్ల సినిమాస్ సమర్పణలో మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల, జోశర్మ, మెక్విన్ గ్రూప్ యుఎస్ఎ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'సరికొత్త కథాంశంతో తెరకెక్కుతున్న ప్రేమకథా చిత్రమిది. ఇప్పటి వరకు బెంగళూర్, నాగర్హోలే నేనల్ పార్క్, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, ఇడుక్కి(కేరళ), హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. ఈ నెల 6 వరకు ముంబాయిలో కీలక ప్రాంతాల్లో చివరి పాటను చిత్రీకరించనున్నాం. చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.



రఘురాజ్, ఉదయ్‌కుమార్

తొమ్మిది జీవితాల కథ

'నాలుగు అక్షరాలతో ముడిపడిన తొమ్మిది జీవితాల కథ ఇది. తెలుగు సినీ చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ స్పృశించని వినూత్నమైన ఇతివృత్తంతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నాం' అని అన్నారు ఆర్.రఘురాజ్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం '4 లెటర్స్'. ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకితమహారాణా హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించారు. ఈ నెల రెండో వారంలో ఈ చిత్రం విడుదలకానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ ''కలుసుకోవాలని' తర్వాత తెలుగులో నేను దర్శకత్వం వహించిన చిత్రమిది. నేటి తరం అభిరుచులకు అనుగుణంగా యువతరానికి కావాల్సిన హంగులతో సినిమాను రూపొందించాం. ఇంజనీరింగ్ కుర్రాడి జీవితగమనంలో ఎదురైన సంఘటనలేమిటి? తొలిప్రేమ అతడికి చేదు జ్ఞాపకాల్ని మిగిల్చినా మలి ప్రేమలో ఎలా విజయం సాధించాడన్నది ఆకట్టుకుంటుంది. సంభాషణలన్నీ సహజంగా ఉంటాయి' అని తెలిపారు. నిర్మాత దొమ్మరాజు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ 'నిర్మాతగా నా తొలి సినిమా ఇది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంతో మా అబ్బాయి ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాం. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని సందేశాత్మక కోణంలో ఆవిష్కరిస్తున్నాం. భీమ్స్ పాటలకు, ట్రైలర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు.

సందేశాత్మకంగా 'ఒక్కటే లైఫ్'



జితన్ రమేష్, శృతి యుగల్

ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఒక్కటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అని ఉపశీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ కథానాయికగా నట్టిస్తున్న ఈ చిత్రాన్ని నారాయణ్‌రామ్ నిర్మిస్తున్నారు. ఈ నెల 8న విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'టెక్నాలజీ పేరుతో పరుగుపెడుతున్న నేటితరం మానవసంబంధాలకు ప్రాధాన్యతనివ్వాలన్న కాన్సెప్ట్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. కథ, కథనాలు ఆసక్తికరంగా సాగుతాయి. భావోద్వేగాలతో పాటు సందేశం ఆకట్టుకుంటుంది. జితన్ రమేష్ హీరోగా నటిస్తున్నారు. అమ్రీష్ అందించిన గీతాలకు మంచి ఆదరణ లభిస్తోంది. నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరు హైలైట్‌గా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు టి. హరీష్‌రావు ఇటీవల విడుదల చేసిన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. చక్కటి సందేశాత్మక కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా తప్పకుండా అన్నివర్గాల వారిని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అన్నారు.